www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 13-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 195 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ.12.25 తదుపరి అష్టమి; నక్షత్రం: ఆర్ద్ర మ.12.27 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.12.10-1.44, దుర్ముహూర్తం: మ.12.24-1.11, మ.2.44-3.31; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎస్సారెస్పీ ఫేజ్-2కు దామోదర్‌రెడ్డి పేరు

- 24 గంటల్లో జీవో విడుదల చేస్తాం
- ఆర్డీఆర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి ఇదే
- దామన్న వల్లే నల్లగొండకు గోదావరి జలాలు
- ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది
- దామోదర్‌రెడ్డి సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

13



పార్టీ తరఫునా..!

- బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్
- స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుకు యోచన
- జీవో 9పై హైకోర్టు స్టే విధించడం మీద ప్రభుత్వపరంగా నేడు పిటిషన్
- నేడు ఢిల్లీకి టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- అభిషేక్ సింఘ్వీతో భేటీ అయ్యే అవకాశం
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు పరామర్శ



హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన జీవో 9పై తెలంగాణ హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పార్టీ పరంగా కాంగ్రెస్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో టీపీసీసీ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఇటీవల అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఢిల్లీ వెళుతున్నారు. ఖర్గేను పరామర్శించిన అనంతరం.. పార్టీ పరంగా పిటిషన్ దాఖలు చేసే అంశంపై చర్చించేందుకు ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీని మహేశ్‌కుమార్ గౌడ్ కలవనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పిటిషన్ దాఖలు చేయనుంది. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే సింఘ్వీ సహా ఇతర న్యాయవాదులతో చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నామని, దీనికి సంబంధించి అన్ని మార్గాలనూ అన్వేషించాలని కోరారు. రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించిన తర్వాతే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేశామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కమిషన్ ఏర్పాటు చేయడం, ఆ కమిషన్ అధ్యయనం, సూచనలు, సలహాలతోనే రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించిన విషయాన్ని సుప్రీంకోర్టుకు విన్నవించాలని కోరినట్లు సమాచారం. ఈ మేరకు అన్ని అంశాలనూ పొందు పరుస్తూ సోమవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

రిజర్వేషన్ల సాధనకు 'బీసీ-జేఏసీ'

- రాష్ట్రంలో ఏకమైన బీసీ సంఘాలు 3
- జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య
- వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్
- 18న రాష్ట్ర బంద్‌కు పిలుపు



జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా
దీపక్‌రెడ్డి?

- పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో నిర్ణయం
- పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోదముద్ర!
- ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి పేరును పార్టీ జాతీయ నాయకత్వం ఎంపిక చేసినట్లు సమాచారం. ఆదివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోగా, పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోద ముద్ర వేసినట్టు తెలిసింది. జూబ్లీహిల్స్‌లో పోటీ కోసం దీపక్ రెడ్డి, కీర్తిరెడ్డి, పద్మ పేర్లతో కూడిన జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు శనివారమే పార్టీ జాతీయ నాయకత్వానికి అందించారు. ఆదివారం

మిగతా 3వ పేజీలో...

ఒకే ఇంటి నంబర్.. 43 ఓట్లు!

- సామాజిక మాధ్యమాల్లో జూబ్లీహిల్స్ ఓటరు జాబితా ఫొటోలు వైరల్ 3
- విచారణకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశం

నేటి నుంచే నామినేషన్లు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ నేడే 3
- 21 దాకా నామినేషన్ల దాఖలుకు చాన్స్
- 15న సునీత, 17న నవీన్ నామినేషన్లు

వివేక్ X అడ్లూరి

ముగిసిన వివాదం మళ్లీ తెరపైకి!

- నాపై కావాలనే మంత్రి అడ్లూరి విమర్శలు
- ఆయన్ను రాజకీయాల్లో ప్రోత్సహించింది కాకానే
- అడ్లూరితో నాకు విభేదాల్లేవు: మంత్రి వివేక్
- వివేక్ పార్టీ నేతల సమక్షంలో మాట్లాడాల్సింది
- ఆయన కుమారుడిని గెలిపించింది మేం కాదా?
- ఇక అధిష్ఠానమే చూసుకుంటుంది: అడ్లూరి




నిజామాబాద్/జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్ వెంకటస్వామి మధ్య సమసిపోయిందనుకున్న వివాదం మళ్లీ రాజుకుంది. జూబ్లీహిల్స్‌లో ప్రెస్‌మీట్ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై అడ్లూరి చేసిన వ్యాఖ్యలను వివేక్ తాజాగా మరోసారి ప్రస్తావించడమే ఇందుకు కారణమైంది. ఆదివారం నిజామాబాద్‌లో నిర్వహించిన మాలల ఐక్య సదస్సుకు మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని, అయినా ఉద్దేశపూర్వకంగానే తనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తాను మాలల కోసం పోరాటం చేస్తుంటే.. కొందరు కావాలనే కుట్రలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా తనను అవమానించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మంత్రిగా తన పని తాను చేసుకుపోతున్నానని, మంత్రి అడ్లూరి విషయంలో అనవసరంగా తన పేరును ప్రచారం చేశారని వాపోయారు. తనది మాల జాతి అంటూ మంత్రి అడ్లూరి విమర్శిస్తున్నారని, కానీ.. ఆయనను రాజకీయంగా ప్రోత్సహించింది తన తండ్రి వెంకటస్వామి (కాకా) అనే విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని

మిగతా 13వ పేజీలో...

అది.. మా కుటుంబ సమస్య

- చిన్న చిన్న పంచాయితీలుంటాయి
- సీతక్క, సురేఖ నాతో మాట్లాడారు
- సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా
- 'పొంగులేటి' వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలు
- బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంది
- అందుకే సుప్రీం తలుపు తడుతున్నాం
- ఆర్డీవి చట్టానికి తూట్లు పొడిచిన బీజేపీ: మహేశ్‌గౌడ్ 13
- నేనెవరిపైనా ఫిర్యాదు చేయలేదు: సీతక్క
- అధిష్ఠానం మందలించలేదు: కొండా

మోదీకి ట్రంప్ ఆహ్వానం





- 'గాజా శాంతి' సమావేశానికి రావాలని పిలుపు
- ఈజిప్టు అధ్యక్షుడు అల్-సిసి నుంచీ ఆహ్వానం
- నేడు 20కి పైగా దేశాధినేతల సమక్షంలో ఒప్పందం
- భారత్ తరఫున కేంద్ర మంత్రి కేవీ సింగ్ ప్రాతినిధ్యం

న్యూఢిల్లీ, అక్టోబరు 12: ఈజిప్టులో సోమవారం జరగనున్న గాజా శాంతి ఒప్పంద కార్యక్రమానికి హాజరు కావాలని ప్రధాని మోదీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి ఆహ్వానించారు. కార్యక్రమానికి చివరి నిమిషంలో శనివారం మోదీకి ఆహ్వానం అందిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో భారత్ తరఫున విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పాల్గొంటారని వెల్లడించాయి. ఈజిప్టు అధ్యక్ష ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రంప్, అబ్దేల్ ఫత్తాహ్ అల్-సిసి అధ్యక్షతన 20కి పైగా దేశాల నాయకుల సమక్షంలో సోమవారం మధ్యాహ్నం షర్మ్-ఎల్ షేక్‌లో గాజా శాంతి ఒప్పందం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని మెలోనీ, స్పెయిన్ ప్రధాని సాంచెజ్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ తదితర నాయకులు హాజరు కానున్నారు.



రక్తశుద్ధికి వెళితే కొత్త రోగాలు!

- డెత్‌బెడ్స్‌గా డయాలసిస్ కేంద్రాలు!
- గత నెలలో మణుగూరులో ఓ రోగికి హెచ్ఐవీ
- హాట్ డిస్ ఇన్ఫెక్షన్ చేయని రక్తశుద్ధి కేంద్రాలు
- 3 నెలలకోసారి జరగని వైరల్ మార్కర్ టెస్టులు
- కొన్నిచోట్ల రెండుసార్లు డయలైజర్ల వాడకం
- షిఫ్టుల కోసం రోగుల నుంచి డబ్బులు వసూలు
- పర్యవేక్షణ కొరవడినందునే ఈ పరిస్థితి!

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల వ్యాధి బారిన పడి.. డయాలసిస్ కోసం ప్రభుత్వ రక్తశుద్ధి కేంద్రాలకు వెళ్తున్న రోగులు కొత్త రోగాల బారిన పడుతున్నారు. రక్తశుద్ధి కోసం వెళితే డెత్‌బెడ్ ఎక్కాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. సర్కారీ డయాలసిస్ కేంద్రాల్లో సరైన హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ చేయడం లేదని, దాంతో కిడ్నీ రోగులు హెచ్ఐవీ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని అంటున్నారు. గత నెలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని డయాలసిస్ కేంద్రానికి రక్తశుద్ధి కోసం వెళ్లిన ఓ 60 ఏళ్ల వ్యక్తికి రక్తపరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దాంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. గతంలో కూడా డయాలసిస్ కారణంగా ఇతర జబ్బుల బారిన పడిన బాధితులు ఉన్నట్లు వైద్య వర్గాలు పేర్కొన్నాయి. రక్తశుద్ధి కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ నుంచి సరైన పర్యవేక్షణ ఉండటం లేదని, అందుకే నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందనే ఆరోపణలు

మిగతా 12వ పేజీలో...



చౌక కాదు.. నాణ్యమైన వైద్యం కావాలి

- అవసరమైతే అదనంగా చెల్లిస్తాం
- జవాబుదారీతనం, మంచి శ్రద్ధ ఉండాలి
- దేశవ్యాప్తంగా 90% రోగుల అభిప్రాయం
- నాణ్యత ధ్రువీకరణ పొందిన ఆస్పత్రులు 10% లోపే.. ల్యాబ్‌లైతే 2% లోపే!
- తొలిదశలో రోగాల గుర్తింపులో వెనకడుగే
- ఫిక్కీ-ఈవై పార్థెనాన్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే తూతూమంత్రపు వైద్యం కాదు.. నాణ్యమైన, జవాబుదారీతనంతో కూడిన వైద్యం కావాలి.. వైద్య సేవల్లో పారదర్శకత, ప్రామాణికత పెరగాలి.. అవసరమైతే ఇందుకోసం కాస్త ఎక్కువ సొమ్ము చెల్లించేందుకు కూడా సిద్ధం.. ఇది మన దేశంలోని 90శాతం రోగులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం. ఫిక్కీ, (భారత వాణిజ్య, పరిశ్రమల ఫెడరేషన్)ఈవై-పార్థెనాన్ సంస్థలు తాజాగా 'ట్రూ అకౌంటబుల్ కేర్: మాక్సిమైజింగ్ హెల్త్‌కేర్ డెలివరీ ఇంపాక్ట్ ఎఫిషియెంట్లీ' పేరిట విడుదల చేసిన అధ్యయన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఎవరో చెప్పారనో, తక్కువ

మిగతా 13వ పేజీలో...

58 మంది పాక్ సైనికులను మట్టుబెట్టాం

- 20 పాక్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేశాం.. వైమానిక దాడులకు ప్రతీకారంగానేనని ప్రకటించిన తాలిబన్లు 2
- పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో దాడులు, ప్రతిదాడులతో ఉద్రిక్తత
- 200 మంది తాలిబన్ సైనికులను హతమార్చామన్న పాక్
- సంయమనం పాటించాలని ఖతార్, సౌదీ, ఇరాన్ సూచన
- దాడులు ప్రస్తుతానికి నిలిపివేశామన్న అఫ్గాన్ మంత్రి

అఫ్గాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో మహిళా జర్నలిస్టులు!

- తాజాగా ఆహ్వానించి విలేకరుల సమావేశం నిర్వహణ
- మొన్న జరిగినది 'ఉద్దేశపూర్వకం' కాదని వివరణ 2



3వ తరగతి నుంచే ఏఐ పాఠాలు 2

- వచ్చే ఏడాది నుంచి సీబీఎస్ఈ బడుల్లో అమలు
- 3, 4, 5 తరగతుల్లో ప్రాథమిక అంశాలు
- ఆరో తరగతి నుంచి స్కిల్ సబ్జెక్టుగా కొనసాగింపు
- ఏఐ సాయంతో భాషా నైపుణ్యాల కల్పన కూడా..
- ఇప్పటికే 18వేల స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టు
- కోటి మంది టీచర్లకు ఏఐపై అవగాహన కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు: కేంద్ర విద్యాశాఖ

పాఠాలు ఆపి.. బడుల తనిఖీకి..

రాష్ట్రంలో 1,473 మంది టీచర్లతో కమిటీలు

- వారు పాఠాలు చెప్పక్కర్లే బడికెళ్లి తనిఖీ చేయడమే..
- జిల్లాస్థాయిలో కలెక్టర్ల నేతృత్వంలో ఏర్పాటు
- 24 వేలకు పైగా బడుల తనిఖీకి 299 కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ
- ఈ నిర్ణయంపై టీచర్ల సంఘాల వ్యతిరేకత



హైదరాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల తనిఖీకి ఉపాధ్యాయుల కమిటీలు ఏర్పాటు కానున్నాయి. కనీసం పదేళ్ల అనుభవం కలిగిన ఉపాధ్యాయులను ఈ కమిటీల్లో నియమిస్తారు. వారికి ఇక బోధన బాధ్యతలు ఉండవు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 1,473 ఉపాధ్యాయులు తనిఖీ అధికారులుగా మారనున్నారు. కమిటీల ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ

మిగతా 13వ పేజీలో...

పోలియో చుక్కలు వికటించి 3
3 నెలల చిన్నారి మృతి

- సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- మృతదేహం పోస్టుమార్టానికి తరలింపు

16.35 లక్షల పిల్లలకు పల్స్ పోలియో

మూడు జిల్లాల్లోనే 6,612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12

- వాటి విలువ రూ.4,804 కోట్లు
- రియల్ ఎస్టేట్‌పై దుష్ప్రచారమే
- నిర్మాణ రంగ వృద్ధిరేటు 11.97%
- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

ముఖ్యమంత్రి చెబితే చేయాలంతే..!



- 'కాదు' అన్నందుకే నాడు ఎల్వీపై జగన్ వేటు
- చెప్పింది చేయకుంటే నేనెందుకని జగన్ అన్నారు.. కోపంతోనే వీఆర్ఎస్
- రాజీనామా వెనక్కి తీసుకోవాలనుకున్నా.. బాబు ఒప్పుకోలేదని తెలిసింది
- కలవాలని ప్రయత్నించా.. నాపై కోపంగా ఉన్నారని సీఎస్ చెప్పారు
- జగన్‌కు మొక్కలేదు.. నోటి దురుసుతనం వస్తుందనే అలా కూర్చున్నా
- ఆర్కేతో 'బిగ్ డిబేట్'లో రిటైర్డ్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్ 14

బీజేపీ, జేడీయూలకు చెరో 101 సీట్లు

చిరాగ్ పాసవాన్ పార్టీకి 29.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ సీట్ల కేటాయింపులు పూర్తి



న్యూఢిల్లీ, అక్టోబరు 12: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్‌డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు ఆదివారం ఖరారయింది. మొత్తం 243 స్థానాలకుగానూ జేడీయూ, బీజేపీ చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ ఆధ్వర్యంలోని లోక్ జనశక్తి పార్టీ 29 సీట్లలో, మరో కేంద్ర మంత్రి జితన్ రాం మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ ఆవాం మోర్చా (సెక్యులర్) ఆరు చోట్ల, ఇంకో కేంద్ర మంత్రి ఉపేంద్ర కుశ్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్‌మోర్చా ఆరు స్థానాల్లో పోటీ

మిగతా 2వ పేజీలో...

కర్రెగుట్టల్లో కమాండో ట్రైనింగ్ స్కూల్!

సీఆర్‌పీఎఫ్ యోచన

సరైన ప్రదేశం కోసం కొనసాగుతున్న సర్వే

న్యూఢిల్లీ/బీజాపూర్, అక్టోబరు 12: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో కమాండో ట్రైనింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసే దిశగా కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ప్రణాళికలు రచిస్తోంది. నక్సల్స్‌కు వ్యతిరేకంగా కర్రెగుట్టలు కేంద్రంగా జరిగిన ఆపరేషన్‌లో గత ఏప్రిల్, మే నెలల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా కొన్నేళ్లు మావోయిస్టులు స్థావరంగా మార్చుకున్న కర్రె గుట్టలను బలగాలు జల్లెడపట్టారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా యూనిట్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కర్రెగుట్టల్లో చేపట్టిన 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో భాగంగా భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు మావోయిస్టులపై జరిగిన అతిపెద్ద ఆపరేషన్ ఇదే. 2026 మార్చి నాటికి దేశంలో వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలకాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. దాదాపు 60 కిలో మీటర్ల పొడవు, 5-20 కిలో మీటర్ల వెడల్పుతో విస్తరించిన ఈ ప్రాంతంలో గుహలు, బంకర్లు వెలుగుచూశాయి. ఈ గుట్టలపై వివిధ రకాల జంతువులు, కీటకాలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కమాండో ట్రైనింగ్ స్కూల్‌కు అనుకూలమైన ప్రదేశాన్ని గుర్తించేందుకు సర్వే జరుగుతోందని అధికారిక వర్గాలు పీటీఐకి తెలిపాయి. ఒక ప్రాంతంపై విజయం ప్రకటించిన తర్వాత భద్రతా బలగాల ద్వారా ఆ ప్రాంతాన్ని స్వాధీనంలోకి తీసుకోవాల్సి ఉంటుందని, లేదంటే ఆయా వర్గాలు మళ్లీ సంఘటితమయ్యే అవకాశం ఉంటుందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. కమాండోలకు శిక్షణ ఇచ్చేందుకు కర్రెగుట్టల్లో శాశ్వత కేంద్రాన్ని స్థాపించడానికి గాను పారామిలటరీ దళం, ఛత్తీస్‌గఢ్ పోలీస్ నుంచి ఓ అధికారుల బృందం లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల అంశాలను పరిశీలిస్తోందని మరో అధికారి తెలిపారు.

'ఆమ్కా' జెట్‌ల రేసులో..
హైదరాబాదీ సంస్థతో అదానీ జట్టు!

▸ ఎంటార్ టెక్నాలజీస్‌తో కలిసి కన్సార్షియం?

హైదరాబాద్, అక్టోబరు 12: దేశీయంగా అభివృద్ధి చేయనున్న ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్)' ప్రొటోటైప్ తయారీ రేసులో హైదరాబాదీ సంస్థ కూడా భాగస్వామ్యం అవుతోంది. ఆమ్కా ప్రొటోటైప్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు అదానీ గ్రూపులోని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తాజాగా హైదరాబాద్‌కు చెందిన 'ఎంటార్ టెక్నాలజీస్' సంస్థతో జట్టుకట్టినట్టు తెలిసింది. విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ దీనిపై కథనాన్ని ప్రచురించింది. ప్రెసిషన్ ఇంజనీరింగ్ (కీలకమైన పరికరాలు, విడిభాగాలను ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత కచ్చితత్వంతో తయారు చేయడం)లో ఎంటార్ టెక్నాలజీస్ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, ఇస్రో, డీఆర్‌డీవో తదితర సంస్థలకు ఎన్నో సంస్థలు ఎంటార్ టెక్నాలజీస్ కస్టమర్లుగా ఉన్నాయి. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లకు అవసరమైన ఎలక్ట్రో న్యూమాటిక్ వ్యవస్థలను ఈ సంస్థే సరఫరా చేసింది.

లోకం తీరు



3వ తరగతి నుంచే ఏఐ పాఠాలు

▸ వచ్చే సంవత్సరం నుంచి సీబీఎస్ఈ బడుల్లో అమలు

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో సీబీఎస్ఈ విద్యార్థులు ఇకపై మూడో తరగతి నుంచే 'కృత్రిమ మేధ (ఏఐ)' పాఠాలు నేర్చుకోనున్నారు. సుమారు 31వేల పాఠశాలల్లో 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. ఏఐ సాయంతో భాషా నైపుణ్యాలు, గణితం, చాట్‌బోట్ ప్రాంప్ట్‌లు, లాంగ్వేజ్ మోడల్స్, జనరేటివ్ ఏఐ వంటి ప్రాథమిక అంశాలను బోధించనున్నారు. చిన్న వయసులోనే టెక్నాలజీ పట్ల అవగాహన పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. ఏఐ పాఠాలు, బోధనకు సంబంధించి ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు అమలుచేస్తున్నామని, ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్నారని వెల్లడించారు. 3వ తరగతి నుంచి ఏఐ ప్రాథమిక అంశాల బోధన ఉంటుందని, 6వ తరగతి నుంచి ఏఐ స్కిల్ సబ్జెక్టుగా కొనసాగుతుందని తెలిపారు. దేశంలో దాదాపు కోటి మంది ఉపాధ్యాయులు ఉన్నారని, వారందరికీ ఏఐ టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

పాఠశాలల్లో యూపీఐతో ఫీజుల వసూలు

న్యూఢిల్లీ, అక్టోబరు 12: పాఠశాలల్లో విద్యార్థుల నుంచి తీసుకునే ఫీజుల వసూలుకు యూపీఐ(యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు పాఠశాలల్లో యూపీఐ చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) తదితర బోర్డులకు కేంద్ర విద్యా శాఖ లేఖలు పంపింది. ఇకపై, ఫీజులను యూపీఐ ద్వారా వసూలు చేసుకోవాలని ఆ లేఖల్లో స్పష్టం చేసింది. నగదు రహిత విధానం వల్ల పాఠశాలల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం పేర్కొంది.

దేశంలో ఏకోపాధ్యాయ బడులు 1,04,125

▸ ఏపీలో అత్యధికంగా 12,912.. తెలంగాణలో 5,001

న్యూఢిల్లీ, అక్టోబరు 12: దేశంలో లక్షకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, ఇతర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర గణాంకాల ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా మొత్తం 1,04,125 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. సగటున ఒక్కో పాఠశాలలో 34 మంది విద్యార్థులు చొప్పున వీటిలో మొత్తం 33,76,769 మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 12,912 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఇక తెలంగాణలో 5,001 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, లద్దాఖ్, దాద్రా-నగర్ హవేలీ, డామన్-డయ్యూ, చండీగఢ్‌లో ఒక్కటి కూడా లేవు. 2009 నాటి విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి ప్రాథమిక స్థాయిలో(1 నుంచి 5 తరగతులు) 30:1, ఉన్నత ప్రాథమిక స్థాయిలో (6 నుంచి 8 తరగతులు) 35:1 ఉండాలి.

పోలీసుల దెబ్బలకు యువ ఇంజనీరు మృతి

▸ ఉద్యోగం వచ్చిందని స్నేహితులతో పార్టీ

▸ రూ.10వేల లంచం ఇవ్వనందుకు కొట్టిన పోలీసులు

భోపాల్, అక్టోబరు 12: పోలీసులు కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉదిత్ (22) అనే యువ ఇంజనీరు మరణించినట్టు ఆయన తల్లిదండ్రులు ఆరోపించారు. ఇటీవలే ఉద్యోగం సంపాదించిన ఉదిత్.. కంపెనీకి డిగ్రీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉండడంతో గురువారం సెహోర్‌లోని ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లాడు. తిరిగి వచ్చిన తరువాత చీకటి పడిన సమయంలో ఇంద్రపురిలో స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. పార్టీ ముగించి కారులో తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో పోలీసులు వచ్చి రాత్రి వేళ పార్టీ చేసుకున్నందుకు రూ.10వేలు లంచంగా ఇవ్వాలని డిమాండు చేశారు. అందుకు ఉదిత్ నిరాకరించాడు. అనంతరం భయపడ్డ ఉదిత్ చీకట్లోకి పరుగెత్తే ప్రయత్నం చేయగా పోలీసులు లాక్కొచ్చి దుస్తులు చింపేశారు. లాఠీలతో తీవ్రంగా కొట్టగా బలమైన గాయాలు తగిలాయి. వెంటనే స్నేహితులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలో ప్రాణాలు కోల్పోయాడు.

అంతరిస్తున్న జాతుల్లో భారతీయ తోడేలు

ముంబై, అక్టోబరు 12: ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన తోడేలు వంశాల్లో ఒకటైన భారతీయ తోడేలు(కానిస్ లూపస్ పల్లిప్స్) మనుగడ ప్రమాదంలో పడింది. ఈ జాతి తోడేళ్ల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతోంది. 2023-24 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా ఈ తోడేళ్లు.. 2,877 నుంచి 3,310 వరకు మాత్రమే ఉన్నట్టు భారతీయ పరిశోధకులు అంచనా వేశారు. దీంతో వీటిని అంతరించిపోతున్న జాతులుగా గుర్తించిన అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సమితి(ఐయూసీఎన్)... వీటిని ఈ నెల 10న తొలిసారిగా ప్రమాదంలో ఉన్న జాతుల జాబితాలో చేర్చింది. 1995లో చివరిసారిగా మొరాకోలో కనిపించిన స్లెండర్-బిల్డ్ కర్లీ అనే వలస పక్షి జాతి పూర్తిగా అంతరించిపోయినట్టు ఐయూసీఎన్ ప్రకటించింది.

కేరళలో 'మెదడు తినే అమీబా' కలకలం

▸ ఇప్పటివరకు 104 కేసుల నమోదు.. 23 మంది మృతి

తిరువనంతపురం, అక్టోబరు 12: కేరళ రాష్ట్రాన్ని 'మెదడు తినే అమీబా' (నెగ్లేరియా ఫౌలెరి) కలవరపెడుతోంది. ఈ అరుదైన, అత్యంత ప్రమాదకరమైన అమీబిక్ మెనింగోఎన్సెఫలైటిస్ (మెదడు వాపు) వ్యాధి కారణంగా ఇప్పటివరకు రాష్ట్రంలో 104 కేసులు నమోదవగా, అందులో 23 మంది మరణించినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఆదివారం వెల్లడించారు. కొల్లాం, తిరువనంతపురం జిల్లాల్లో అత్యధిక కేసులు నమోదు కాగా, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో కూడా ఈ కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2023లో కోజికోడ్‌లో నిఫా వైరస్ వ్యాప్తి చెందిన తర్వాత, అన్ని ఎన్సెఫలైటిస్ కేసులను తప్పనిసరిగా నివేదించాలని, వాటి మూలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఫలితంగా, 2024 నుంచి ఈ కేసులను అధికారికంగా నమోదు చేశారని, వాటిలో కొన్నింటిని అమీబిక్ ఎన్సెఫలైటిస్ కేసులుగా గుర్తించారని చెప్పారు.

ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలు నిషేధించాలి

▸ కర్ణాటక సీఎంకు మంత్రి ప్రియాంక్ ఖర్గే లేఖ

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ సీఎం సిద్దరామయ్యకు మంత్రి, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, పబ్లిక్ మైదానాల్లో ఆరెస్సెస్ తన 'శాఖ'లను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. నినాదాలు చేస్తూ పిల్లలు, యువత మనసుల్లో ప్రతికూల ఆలోచనలను నాటుతోందని ఆరోపించారు. ఆరెస్సెస్ నమ్ముతున్న వ్యవస్థ భారతదేశ ఐక్యత, లౌకిక భావనకు విరుద్ధమని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జోక్యం చేసుకోవాలని కోరారు.

బీజేపీ, జేడీయూలకు
చెరి నూటొక్క సీట్లు

(మొదటి పేజీ తరువాయి)



చేయనున్నాయి. సీట్ల పంపకం ఖరారయినట్టు కేంద్ర మంత్రి, బీజేపీ బిహార్ ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్న బీజేపీ సెంట్రల్ కమిటీ సమావేశంలో సీట్ల సర్దుబాటుకు ఆమోదం లభించిందని తెలిపారు. బీజేపీ కన్నా జేడీయూ ఎక్కువ సీట్లలో పోటీ చేయకుండా ఉండడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. బీజేపీ కన్నా జేడీయూ కనీసం ఒక్క సీటులోనయినా అదనంగా అభ్యర్థిని నిలబెడుతుందని తొలుత ఊహాగానాలు వ్యాపించినా రెండు సరిసమాన స్థానాల్లో పోటీ చేయనుండడం విశేషం. గత ఎన్నికల్లో జేడీయూ 115 సీట్లలో, బీజేపీ 110 స్థానాల్లో పోటీ చేశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ..జేడీయూ కన్నా ఒక్కస్థానం అధికంగా ఉండేటట్టు సర్దుబాటు చేసుకుంది. ఇది జేడీయూ ప్రాబల్యం తగ్గుదలకు, బీజేపీ ప్రాధాన్యం పెరుగుదలకు సూచిక అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. చిరాగ్, మాంఝీ, కుశ్వాహాలు మరిన్ని సీట్ల కోసం గట్టిగా బేరసారాలు చేసినప్పటికీ పెద్దగా ఫలించలేదు. చివరకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారని దేవేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

నేడు మహా కూటమి చర్చలు

సీట్ల పంపకాలపై మహాగట్‌బంధన్ భాగస్వామ్య పార్టీల మధ్య సోమవారం చర్చలు జరిపే అవకాశం ఉంది. కోర్టులో జరిగే విచారణకు హాజరయ్యే నిమిత్తం ఆర్జేడీ నాయకులు లాలు ప్రసాద్, తేజస్వీ యాదవ్‌లు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా సీట్ల సర్దుబాటుపై కూడా చర్చలు జరిగే అవకాశాలు ఉన్నట్టు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 స్థానాలు కేటాయించగా కేవలం 19 సీట్లలోనే గెలిచింది. అందువల్ల ఈసారి ఆ పార్టీకి సీట్లు తగ్గిస్తారని, 50కి మించకపోవచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత రెండు రోజులుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా వివిధ పార్టీలతో చర్చలు జరుపుతున్నారు. మహాకూటమిలో కొత్త పార్టీలు చేరాయని, వాటికి సీట్లు ఇవ్వాల్సి ఉన్నందున చర్చల్లో జాప్యం జరుగుతున్నట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ చెప్పారు. అభ్యర్థుల పేర్లతో పాటు, ఉమ్మడి ఎలక్షన్ మేనిఫెస్టోను కూడా ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉంది.

తేజస్వి యాదవ్‌ను ఎక్స్‌లో అన్‌ఫాలో అయిన తేజ్ ప్రతాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, ఆ పార్టీ బహిష్కృత నేత తేజ్ ప్రతాప్ యాదవ్.. తన తమ్ముడు తేజస్వి యాదవ్‌ను ఎక్స్‌లో అన్‌ఫాలో అయ్యారు. ఇప్పటికే తన అక్కలు మీసా యాదవ్, హేమా యాదవ్‌లను అన్‌ఫాలో చేశారు. తేజ్ ప్రతాప్ యాదవ్ ఓ మహిళతో ఎప్పటి నుంచో రిలేషన్‌షిప్‌లో ఉన్నానని పోస్ట్ చేయడం ఇటీవల వివాదాస్పదమైంది. పార్టీ నైతిక విలువలు ఉల్లంఘించినందుకు ఆయన్ను పార్టీ, కుటుంబం నుంచి బహిష్కరిస్తున్నట్లు లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. ఆర్జేడీ నుంచి సస్పెన్షన్‌కు గురైన తేజ్ ప్రతాప్ కొత్తగా జనశక్తి జనతాదళ్(జేజేడీ) పార్టీని ప్రారంభించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను మహువా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నానని, తమ పార్టీ అభ్యర్థుల జాబితాను అక్టోబర్ 13న ప్రకటిస్తానని చెప్పారు. తేజ్ ప్రతాప్‌కు గతంలో బిహార్ మాజీ సీఎం దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యతో వివాహమైంది. ఆ తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు రావడంతో విడిపోయారు. ప్రస్తుతం వీరి విడాకుల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది.

నోబెల్ శాంతి బహుమతి
సమాచారం లీక్!

న్యూఢిల్లీ, అక్టోబరు 12: ఇటీవల వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ప్రకటన సమాచారం అంతకుముందే లీక్ అయిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. దీని వెనుక గూఢచర్యం ఉండొచ్చని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ అనుమానిస్తోంది. మరియా మచాడో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి విజేతగా ఎంపికయ్యే అవకాశాలు బెట్టింగ్ ప్లాట్‌ఫాం 'పాలిమార్కెట్'లో రాత్రికి రాత్రే 3.75 శాతం నుంచి 73 శాతానికి పెరిగిందని ప్రముఖ వార్తా సంస్థ ఏఎఫ్‌పీ పేర్కొంది. మచాడోను ఈ ఏడాది విన్నర్‌గా నోబెల్ కమిటీ ఓస్లోలో అధికారికంగా ప్రకటించడానికి కొద్ది గంటల ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. నిపుణులు, మీడియా సంస్థల అంచనాల్లోనూ మరియా మచాడో పేరు ప్రముఖంగా వినిపించకపోవడం అత్యంత రహస్య సమాచారం లీకైందనే అనుమానాలను బలం చేకూరుస్తోంది. నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, నోబెల్ కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హర్ప్‌వికెన్ నార్వేకు చెందిన టీవీ2 టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఇది గూఢచర్యం అయ్యే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించినట్లు వార్తా సంస్థ పేర్కొంది. ఈ వ్యవహారంపై నోబెల్ ఇన్‌స్టిట్యూట్ పరిశీలిస్తుందని, అవసరమైన చోట భద్రతను కట్టుదిట్టం చేస్తామని చెప్పారు.

బీఎస్ఎఫ్‌లో తొలి మహిళా ఫ్లైట్ ఇంజనీరుగా భావనా చౌదరి



న్యూఢిల్లీ, అక్టోబరు 12: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో తొలి మహిళా ఫ్లైట్ ఇంజనీరుగా ఇన్‌స్పెక్టర్ భావనా చౌదరి నియమితులయ్యారు. బీఎస్ఎఫ్‌లో విమాన విభాగం 1969లో ఏర్పాటు కాగా, ఇంజనీరు పదవిలో మహిళను నియమించడం ఇదే ప్రథమం. నలుగురు పురుషులతో పాటు శిక్షణ పొందిన భావనకు ఇటీవలే బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి ఫ్లయింగ్ బ్యాడ్జెస్‌ను అందజేశారు.

బాధితురాలు కాలేజీ బయటకు..
అర్ధరాత్రి ఎలా వెళ్లింది?

▸ వైద్యవిద్యార్థిని గ్యాంగ్‌రేప్ కేసులో పశ్చిమ బెంగాల్ సీఎం మమత

▸ నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



కోల్‌కతా, అక్టోబరు 12 : పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్ ప్రాంతంలో వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ ఘటనపై ఆ రాష్ట్ర సీఎం మమత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అయితే బాధితురాలు అర్ధరాత్రి 12.30 గంటలకు కాలేజీ బయటకు ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. ఆమె అర్ధరాత్రి బయటకు ఎలా వెళ్లిందో మెడికల్ కాలేజీ నిర్వాహకులు సమాధానం చెప్పాలన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలు తమ విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు బయటకు అనుమతించకూడదన్నారు. బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వారు హాస్టల్ నిబంధనలు పాటించాలని, రాత్రిళ్లు బయటకు వెళ్లకూడదని సూచించారు. గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష తప్పదన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ మహిళలపై ఎన్నో నేరాలు జరిగాయని అవి కూడా ఖండించదగినవని చెప్పుకొచ్చారు. మణిపూర్‌లో ఇలాంటి ఘటనలు ఎన్నో అని.. అలాగే ఒడిశాలోనూ మహిళలపై ఎన్నో ఘోరాలు జరిగాయని ఆరోపించారు. అక్కడి ప్రభుత్వాలు వాటిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే, అనంతరం తన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరించిందని ఆరోపించారు. "మీరో ప్రశ్న వేస్తారు.. దానికి నేను సమాధానం ఇస్తాను.. మీరు దాన్ని వక్రీకరిస్తారు.. ఇలాంటి రాజకీయాలు చేయవద్దు.." అని మీడియాను ఉద్దేశించి అన్నారు. కాగా వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ కేసులో నలుగురు వ్యక్తులను పశ్చిమ బెంగాల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరిలో ఒకరు షేక్ రియాజుద్దీన్, మరొకరు షేక్ ఫిర్దౌస్‌గా గుర్తించారు. కాగా ఒడిశా సీఎం మాఝి ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మమతను కోరారు.

ఆపరేషన్ బ్లూస్టార్.. తప్పుడు చర్య!

▸ తీవ్రవాదుల ఏరివేతకు అది సరైన మార్గం కాదు

▸ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం వ్యాఖ్యలు



సిమ్లా, అక్టోబరు 12: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం మాజీ ప్రధాని ఇందిరపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె హయాంలో పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయంలో చేపట్టిన ఆపరేషన్ బ్లూస్టార్‌ను తప్పుడు చర్యగా అభివర్ణించారు. 1984లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో దాక్కున్న ఖలిస్థానీ తీవ్రవాదులను బంధించేందుకు ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట సైనిక చర్య చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, తీవ్రవాదులను ఏరిపారేసేందుకు అది సరైన మార్గం కాదని చిదంబరం అన్నారు. శనివారం హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలిలో జరిగిన 'దె విల్ షూట్ యు మేడం: మై లైఫ్ త్రూ కాన్‌ఫ్లిక్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పుస్తక రచయిత హరీందర్ బవేజాతో జరిగిన సంభాషణలో ఈ వ్యాఖ్యలు చేశారు. "స్వర్ణ దేవాలంయలో నక్కిన తీవ్రవాదులను బంధించడానికి/ఏరివేతకు సరైన మార్గాలు ఉన్నాయి. కానీ, ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట నిర్వహించిన సైనిక చర్య సరికాదు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు గాను ఇందిరా గాంధీ మూల్యం చెల్లించుకున్నారు. తన ప్రాణాలే కోల్పోయారు. కానీ, ఆపరేషన్ బ్లూస్టార్ అనేది సైన్యం, నిఘా విభాగం, పోలీస్, రక్షణ శాఖల సమష్టి నిర్ణయం. దానికి ఇందిరను ఒక్కరినే నిందించడం సరికాదు" అని కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి చిదంబరం పేర్కొన్నారు. "3-4 ఏళ్ల తర్వాత ఆపరేషన్ బ్లాక్ థండర్ పేరిట సైన్యాన్ని ఆలయం వెలుపలే ఉంచి సరైన మార్గంలో స్వర్ణ దేవాలయంలో దాక్కొని ఉన్న తీవ్రవాదులను ఏరిపారేశాం" అని చిదంబరం చెప్పారు. స్వర్ణ దేవాలయంలో దాక్కున్న జర్నైల్ సింగ్ బింద్రన్‌వాలే నేతృత్వంలోని సాయుధ తీవ్రవాదులను ఏరిపారేసేందుకు 1984 జూన్ 1-10 మధ్య ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట సైనిక చర్య చేపట్టారు.

సీనియర్లు జాగ్రత్తగా మాట్లాడాలి

చిదంబరం వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సీనియర్ నేతలు బహిరంగ ప్రకటనలు చేసేముందు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. పార్టీ నుంచి అన్ని రకాలుగా లబ్ధి పొందిన సీనియర్లు అప్రమత్తంగా మాట్లాడాలని అధిష్ఠానం పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.


కాంగ్రెస్ కట్టుకథలను బట్టబయలు చేశారు: బీజేపీ

ఆపరేషన్ బ్లూస్టార్‌పై కాంగ్రెస్ కట్టుకథల గుట్టురట్టయిందని బీజేపీ పేర్కొంది. చిదంబరం వ్యాఖ్యలతో ఈ విషయం తేటతెల్లమైందని తెలిపింది. ఆపరేషన్ బ్లూస్టార్ దేశం కోసం కాదని, రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని ఆరోపించింది. కాంగ్రెస్ చేసిన ఘోర తప్పిదాలను చిదంబరం చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్‌లో పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీసింగ్ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వాస్తవాలు కచ్చితంగా చరిత్రలో నమోదవుతాయన్నారు.

ఐపీఎస్ అధికారి ఆత్మహత్యలో కొత్తగా అట్రాసిటీ సెక్షన్

చండీగఢ్, అక్టోబరు 12: హరియాణా దళిత ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో ఆయన భార్య, ఐఏఎస్ అధికారిణి అమనీత్ డిమాండ్‌తో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సెక్షన్ 3 (2) (వీ)ను చేర్చారు. ఈ సెక్షన్ కింద నిందితులకు పదేళ్లు, అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ముందు ఈ చట్టంలోని 3(1) (ఆర్) కింద కేసు నమోదు చేశారు. అభియోగాలు రుజువైతే ఈ సెక్షన్ ఆరు నెలల నుంచి గరిష్ఠంగా ఐదేళ్ల మాత్రమే శిక్ష పడుతుంది. సీనియర్ ఐపీఎస్ అధికారుల కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకోలేక కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కుమార్ సూసైడ్ నోట్‌లో హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహతక్ ఎస్పీ బిజార్ణియా సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని పేర్కొన్నారు.

అఫ్గాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో
మహిళా జర్నలిస్టులు!



తాజాగా ఆహ్వానించి విలేకరుల సమావేశం నిర్వహణ

న్యూఢిల్లీ, అక్టోబరు 12: విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో అఫ్గాన్ విదేశాంగమంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. తాజాగా స్త్రీ, పురుష జర్నలిస్టులందరినీ ఆహ్వానించి ఆదివారం ఢిల్లీలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం నాటి విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడం ఉద్దేశపూర్వకంగా చేసినది కాదని, అది సాంకేతికంగా జరిగిందని వివరణ ఇచ్చారు. 'కొందరు నిర్దిష్ట జర్నలిస్టులతో ప్రెస్‌మీట్ నిర్వహించాలని మా రాయబార కార్యాలయ అధికారులు భావించారు. చాలా తక్కువ సమయం ఉండటం వల్లే కొద్ది మంది విలేకరులనే ఆహ్వానించాం. అది సాంకేతికంగా జరిగింది. అందులో ఉద్దేశపూర్వకం ఏమీ లేదు. మహిళలైనా, పురుషులైనా.. ఏ ఒక్కరి హక్కునూ నిరాకరించకూడదు' అని ముత్తాఖీ పేర్కొన్నారు. శుక్రవారం భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన ముత్తాఖీ అదే రోజు ఢిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాగా, జైశంకర్‌తో తాను జరిపిన ద్వైపాక్షిక చర్చల గురించి తాజా విలేకరుల సమావేశంలో ముత్తాఖీ వివరించారు. అఫ్గానిస్థాన్‌లో నిలిచిపోయిన అభివృద్ధి ప్రాజెక్టులను పునఃప్రారంభించేందుకు ఇరుపక్షాలూ అంగీకరించినట్టు చెప్పారు. త్వరలో అఫ్గాన్ నుంచి దౌత్య బృందం ఢిల్లీకి రానుందని తెలిపారు. అలాగే, అమృత్‌సర్ నుంచి అఫ్గాన్‌కు త్వరలోనే విమానాలు నడవనున్నట్టు తెలిపారు.

భారత్-అఫ్గాన్ సంయుక్త ప్రకటనపై పాక్ భగ్గు


భారత్-అఫ్గానిస్థాన్ సంయుక్త ప్రకటనలోని అంశాలపై పాకిస్థాన్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇస్లామాబాద్‌లోని అఫ్గాన్ రాయబారికి తన అభ్యంతరాలను తెలియజేసింది. సంయుక్త ప్రకటనలో జమ్మూకశ్మీర్‌ను ప్రస్తావించడంపై పాకిస్థాన్ మండిపడింది. 'జమ్మూకశ్మీర్‌ను భారత భూభాగంగా పేర్కొనడం ఐరాస భద్రతామండలి తీర్మానాలను తీవ్రంగా ఉల్లంఘించడమే' అని పేర్కొంది. ఉగ్రవాదాన్ని పాక్ అంతర్భాగంగా ముత్తాఖీ పేర్కొనడాన్నీ తోసిపుచ్చింది.

పాక్-అఫ్గాన్ సరిహద్దు.. రణరంగం

▸ దాడి, ప్రతిదాడులతో తీవ్ర ఉద్రిక్తత

▸ 58 మంది పాక్ సైనికులను మట్టుబెట్టామన్న తాలిబన్లు

▸ 200 మంది తాలిబన్ సైనికులను హతమార్చామన్న పాక్



న్యూఢిల్లీ, అక్టోబరు 12: దాడి, ప్రతిదాడులతో పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దు ప్రాంతాలు అట్టుడుకుతున్నాయి. ఖైబర్ ఫఖ్తుంక్వా, బలోచిస్తాన్ సరిహద్దు వెంబడి శనివారం రాత్రి నుంచి జరుగుతున్న సైనిక చర్యల్లో తాము 58 మంది పాకిస్థానీ సైనికులను హతమార్చామని అఫ్గానిస్థాన్ ప్రకటించింది. 20 పాక్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేశామని కూడా వెల్లడించింది. ఈ నెల 9న తమ గడ్డపై పాక్ జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఈ దాడులకు పాల్పడినట్లు తాలిబన్ల ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్‌లో ఉన్న ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించవద్దని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము 1893 బ్రిటీష్ కాలం నాటి డ్యూరాండ్ లైన్‌ను గుర్తించబోమని మరోసారి తేల్చి చెప్పారు. పాకిస్థాన్ కూడా తాము 200 మంది తాలిబన్లను మట్టుబెట్టామని, ఘర్షణలో తమ సైనికులు 23 మంది మృతిచెందారని అంగీకరించింది. 19 అఫ్గానిస్థాన్ మిలిటరీ పోస్టులను స్వాధీనం చేసుకున్నామని పాక్ ఆర్మీ తెలిపింది. అఫ్గన్ దాడులపై పాక్ ఆంతరిక మంత్రి మొహసిన్ నఖ్వీ స్పందించారు. ఇటుకలతో చేసే దాడులకు రాళ్లతో బదులిస్తామని తాలిబన్లను హెచ్చరించారు. కాగా, పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఘర్షణను నివారించాలని, రెండు దేశాలు సంయమనం పాటించాలని ఖతార్, సౌదీ అరేబియా, ఇరాన్ సూచించాయి. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరాయి. దీంతో తాము దాడులు ప్రస్తుతానికి ఆపేశామని భారత్‌లో పర్యటిస్తున్న అఫ్గన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీ తెలిపారు.

ఏపీలో నకిలీ మద్యంపై సిట్!

- త్వరలోనే కుట్ర బయటపడుతుంది
- 'నకిలీ' ఖాతాలో యాచకుల మరణాలు
- దుష్ప్రచారాన్ని సహించం: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇది సాధారణంగా జరిగిన నేరం కాదని... భారీ కుట్ర ఉందని తెలిపారు. కుట్రదారులెవరో త్వరలోనే బయటపడుతుందని అన్నారు. ఇందులో దిగ్భ్రాంతికరమైన అంశాలు వెలుగు చూసే అవకాశముందని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు 'ఎక్సైజ్ సురక్ష' పేరుతో కొత్త యాప్‌ను ఆవిష్కరించారు. మద్యం సీసాపై ఉన్న బార్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ సీసా ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు అన్ని వివరాలు తెలుస్తాయని... కోడ్ స్కాన్ కాకపోతే అది నకిలీగా నిర్ధారణ అవుతుందని వివరించారు. యాప్ పనిచేసే తీరుపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

బైకును ఢీకొన్న ఇసుక లారీ

- వైద్యుడితో పాటు ర్యాపిడో డ్రైవర్ మృతి

పంజాగుట్ట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్ చౌరస్తా సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వైద్యుడితో పాటు ర్యాపిడో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఖమ్మం జిల్లా హవేలి రూరల్ మండలానికి చెందిన ఎం.నవీన్ (30) జేఎన్‌టీయూ సమీపంలో నివాసం ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బేగంపేట్ కుందన్‌బాగ్‌లో నివాసం ఉంటూ బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో జనరల్ ఫిజిషియన్‌గా పనిచేస్తున్న జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన డాక్టర్ కస్తూరి జగదీశ్ చంద్ర (35) ఆదివారం తెల్లవారుజామున ర్యాపిడో బైక్ బుక్ చేసుకోగా నవీన్ తన హోండా యాక్టివా ద్విచక్ర వాహనంపై అతడిని ఎక్కించుకుని బయలుదేరాడు. మార్గమధ్యలో గ్రీన్‌ల్యాండ్ చౌరస్తా వద్ద యూసుఫ్‌గూడ వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ (టీఎస్09యూడి9279) వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ర్యాపిడో డ్రైవర్ నవీన్ లారీ వెనుక చక్రాల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న డాక్టర్ జగదీశ్ డివైడర్‌పై పడి మృతి చెందారు. డాక్టర్ జగదీశ్‌ను స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పి.శంకర్ (38)ను అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

131 మంది ఎంపీడీవోలుగా నియామకం

హైదరాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రూప్ 1 అధికారులుగా నియమితులైన వారిలో 131 మందిని 26 జిల్లాలకు మండలపరిషత్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్స్(ఎంపీడీవో)గా నియమించారు. పంచాయతీరాజ్ శాఖలో వీరికి ఏడాది పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం వారికి అయా జిల్లాల్లోని మండలాల్లో ఎంపీడీవో పోస్టింగ్స్ ఇస్తారు. మరోవైపు మల్టీజోన్ రెండులో నలుగురు ఎంపీడీవోలను మల్టీజోన్ వన్‌లో మరో నలుగురిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు పంచాయతీరాజ్ డైరెక్టర్ శ్రీజన ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచే నామినేషన్లు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ నేడే.. 21 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ జారీ తర్వాత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు(సెలవులు మినహా ఇతర రోజుల్లో) నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షేక్‌పేట తహసీల్దార్ ఆఫీసులో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. 15, 16, 17 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్న నేపథ్యంలో ఈ మూడు రోజుల్లోనే ఎక్కువ నామినేషన్లు



దాఖలు చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత 15వ తేదీన, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 17వ తేదీన నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అలాగే, కొందరు స్వతంత్రులు, ఇతర పార్టీల అభ్యర్థులు బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయనందుకు నిరసనగా.. నామినేషన్లు వేస్తామని నిరుద్యోగులు ప్రకటించినా, వారు బరిలో ఉంటారా..? లేదా.? అన్నది తేలాల్సి ఉంది. అభ్యర్థులు డిజిటల్ పద్ధతిలోనూ నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. http://encore.eci.gov.in ద్వారా నామినేషన్ పత్రం ఆన్‌లైన్‌లో నింపి, క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్ కాపీని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఆర్‌వో కార్యాలయం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు అమలు దృష్ట్యా.. 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుందని రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు.

ఒకే ఇంటి నంబర్.. 43 ఓట్లు!

- సామాజిక మాధ్యమాల్లో జూబ్లీహిల్స్ ఓటర్ జాబితా ఫొటోలు వైరల్
- విచారణకు ఆదేశాలు జారీ

హైదరాబాద్ సిటీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆ నియోజకవర్గ ఓటర్ జాబితాలో ఓ ఇంటి నంబర్‌పై ఏకంగా 43 మంది ఓటర్లు ఉండటం చర్చనీయాంశమైంది. యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్‌లోని 8-3-231/బీ/160 ఇంటి నంబర్‌పై 43 మంది పేర్లు నమోదు చేశారు. వీరిలో చాలా మంది 30-40 ఏళ్లలోపు వారే ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గ ఓటర్లు 3.85 లక్షలు ఉండగా.. ఇటీవల ప్రకటించిన తుది జాబితా మేరకు ఓటర్ల సంఖ్య 3.98 లక్షలకు పెరిగింది. తుది దశ పరిశీలనలోని దరఖాస్తుల సంఖ్య కలిపితే ఓటర్ల సంఖ్య 4 లక్షలు దాటుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఒకే ఇంటి నంబర్‌పై 43 మంది ఓటర్లున్న ఓటర్ జాబితా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై దృష్టి సారించిన జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. ఎన్నికల విభాగం అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో ఆ చిరునామాలో అపార్ట్‌మెంట్ ఉందా..? ఇండిపెండెంట్ నివాసమా..? ఎన్ని కుటుంబాలున్నాయి..? జాబితాలో పేరున్న వాళ్లు అక్కడుంటున్నారా.. లేదా..? అన్నది అధికారులు పరిశీలించనున్నారు.

బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి?

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో దీనిపై చర్చించారు. నియోజకవర్గంలో లక్ష మంది ముస్లిం ఓటర్లు ఉన్న నేపథ్యంలో.. బీజేపీ నుంచి ఎవరిని పోటీపెడితే బాగుంటుందన్న దానిపై కసరత్తు చేసినట్టు తెలిసింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీ చేసిన మాధవీలత అభ్యర్థిత్వం అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. తర్వాత ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఆదివారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులోనూ దీపక్‌రెడ్డి వైపే మొగ్గు చూపినట్టు తెలిసింది. ఏక్షణమైనా ప్రకటన చేయవచ్చని పార్టీవర్గాలు వెల్లడించాయి.

రిజర్వేషన్ల సాధనకు 'బీసీ-జేఏసీ'

- జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్
- 18న రాష్ట్ర బంద్‌కు పిలుపు

హైదరాబాద్/ఖైరతాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు ఏకమయ్యాయి. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు 'బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (బీసీ జేఏసీ) ఆవిర్భవించింది. ఆదివారమిక్కడి ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో బీసీ-జేఏసీని ఏర్పాటు చేశారు. జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్‌గా వీజీఆర్ నారగోని, కో చైర్మన్లుగా రాజారాంయాదవ్, దాసు సురేష్, సమన్వయకర్తగా గుజ్జ కృష్ణను ఎన్నుకున్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఈ నెల 13న జాతీయ రహదారుల దిగ్బంధానికి పిలుపునివ్వగా..



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నారగోని, జాజుల తదితరులు

ఆర్.కృష్ణయ్య ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు కార్యక్రమాలను వాయిదా వేసి, 18న రాష్ట్ర బంద్‌ను చేపట్టాలని నిర్ణయించారు. కృష్ణయ్య మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లపై స్టే విధించడం ద్వారా రాష్ట్రంలోని బీసీలకు హైకోర్టు అన్యాయం చేసిందన్నారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ బీసీలంతా రాజకీయ పార్టీలకతీతంగా ఏకమై పోరాడితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివస్తాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని భవిష్యత్తులో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించేదాకా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న జరిగే బంద్‌లో బీసీలు పార్టీలకతీతంగా పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీల నోటికాడ ముద్దను పిడికెడు మంది కూడా లేని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ వ్యతిరేకులకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ పెట్టడానికి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. అందుకే రాష్ట్రంలోని ప్రధాన బీసీ సంఘాలు, వ్యక్తులు, శక్తులను సమన్వయం చేసుకుని బీసీ జేఏసీగా ఏర్పడినట్లు తెలిపారు. రెడ్లను రాజకీయ శత్రువులుగా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. బంద్ ఫర్ జస్టిస్ పేరిట ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌తో బీసీల బలాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చూపుతామన్నారు.

పోలియో చుక్కలు వికటించి మూడు నెలల చిన్నారి మృతి

- సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో ఘటన

నారాయణఖేడ్, కంగ్టి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం భీంరా గ్రామంలో ఆదివారం విషాద ఘటన చోటు చేసుకుంది. పోలియో చుక్కలు వికటించి మూడు నెలల మగ పిల్లవాడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన సర్కున్‌దొడ్డి ఉమాకాంత్, స్వర్ణలత దంపతులకు ముగ్గురు కూతుళ్లు, మూడు నెలల కుమారుడు ఉన్నారు. వారికి ఆదివారం పోలియో చుక్కలు వేయించేందుకు తల్లి స్వర్ణలత స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లింది. ఆశావర్కర్లు పోలియో చుక్కలు వేసిన కొద్దిసేపటికే శిశువు ఏడవడం ప్రారంభించడంతో పాలు పట్టేందుకు తల్లి ప్రయత్నిస్తుండగానే పసికందు ప్రాణాలు కోల్పోయింది. వైద్యాధికారి నాగమణి శిశువును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పోలియో చుక్కలు వేయడం ద్వారానే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి శిశువును పోస్టుమార్టం కోసం నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నాగమణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. శిశువుకు వేసిన పోలియో చుక్కల సీసా నుంచి మరో 17 మందికి వేశామని, ఎవరికీ హాని జరగలేదని తెలిపారు. బాధిత కుటుంబంలోని ముగ్గురు చిన్నారులకు కూడా చుక్కలు వేసినా ఏమీ కాలేదని చెప్పారు. కాగా, శిశువు మృతికి పోలియో చుక్కలు కారణం కాదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. వైద్యులు, వైద్యాధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నామన్నారు. పోలియో చుక్కలను ఒకే సీసా నుంచి శిశువుకు, వారి అక్కలకు, గ్రామంలోని ఇతర చిన్నారులకు వేశారని చెప్పారు. పోలియో చుక్కలు వేశాక తల్లి పాలు పట్టిందని, దీంతో శిశువు వాంతులు చేసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. వాంతులతో యాష్ ప్రెషర్ అయ్యి మృతి చెందిందని వివరించారు.

16.35 లక్షల మంది పిల్లలకు పల్స్ పోలియో

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఈ 6 జిల్లాల పరిధిలో 5 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలు 17,56,789 మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. అందులో 16,35,432 మంది పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేశామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ప్రకటించారు. మిగిలిన పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

సోమవారం 13 అక్టోబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'అర్రాసు' కథా సంపుటి

రాజీ కన్నా కథల సంపుటి 'అర్రాసు' ఆవిష్కరణ అక్టోబరు 14 సా.6గంటలకు మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. వక్తలు గోరటి వెంకన్న, అల్లం నారాయణ, పెద్దింటి అశోక్ కుమార్, పల్లవి కోయిల, అబ్దుల్ ఖాదర్.

బోధి ఫౌండేషన్

వేదగిరి రాంబాబు పురస్కారాలు

డాక్టర్ వేదగిరి రాంబాబు పురస్కారాల ప్రదానోత్సవం, 'మా కథలు 2024' ఆవిష్కరణ, సింహ ప్రసాద్ కథలు 'మనుగడ' ఆవిష్కరణ... ఈ కార్యక్రమాలు అక్టోబరు 14 ఉ.10 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. బాల సాహిత్య పురస్కారం పుల్లా రామాంజనేయులు, కథానిక పురస్కారం స్ఫూర్తి కందివనం స్వీకరిస్తారు. సభలో కె.వి. రమణాచారి, విహారి, సుధామ పాల్గొటారు. వివరాలకు: 98490 61668.

సింహప్రసాద్ సాహిత్య సమితి

'అట్లనే' కవితా సంపుటి

అన్నవరం దేవేందర్ 'అట్లనే' కవితా సంపుటి ఆవిష్కరణ సభ అక్టోబరు 17 మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని డాక్టర్ కేతు విశ్వనాథ రెడ్డి హాల్‌లో జరుగుతుంది. వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి ఆవిష్కరిస్తారు. అతిథులుగా కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, రజనీ నెల్లుట్ల పాల్గొంటారు.

జీవగడ్డ మిత్రులు

'మట్టిరంగు' కవితా సంపుటి

సి. భవానీదేవి కవితా సంపుటి 'మట్టిరంగు' ఆవిష్కరణ అక్టోబరు 19 సా.6గంటలకు హోటల్ గౌతమి (మొదటి అంతస్తు), జి.బి.సి. రోడ్, బాపట్లలో జరుగుతుంది. సభాధ్యక్షులు వెలువోలు నాగరాజ్యలక్ష్మి; ముఖ్య అతిథి పాపినేని శివశంకర్; పుస్తక పరిచయం బీరం సుందర రావు; ఆత్మీయ అతిథులు పి.సి. సాయిబాబు, టి. శ్యామసుందర్.

ఆం.ప్ర. రచయితల సంఘం

విద్యార్థులకు పద్య పోటీలు

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జాతీయ స్థాయి తెలుగు శతక పద్య పోటీలు నిర్వహిస్తున్నాము. వందకు పైగా పద్యాలు చెప్పగలిగిన పిల్లలు అక్టోబరు 16 లోపు 95534 29770 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోగలరు.


తులసీనాథం నాయుడు

సుద్దాల పురస్కారాల ప్రదానం

సుద్దాల జానకమ్మ హనుమంతు సాహితీ- జానపద- నృత్య పురస్కారాల ప్రదానోత్సవం అక్టోబరు 13 సా.6గం.లకు సుందరయ్య కళా నిలయం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. రచయిత్రి ఓల్గా, గాయని మధుప్రియ, నర్తకి లాలీ నిధి పురస్కారాలను స్వీకరిస్తారు. సభలో సూరేపల్లి నంద, హరిచందన దాసరి, ఎస్. రఘు, సుద్దాల సుధాకర్ తేజ, ఎస్ రెడ్డి రాంరెడ్డి, మడిమడకల నర్సిరెడ్డి తదితరులు పాల్గొంటారు.

సుద్దాల అశోక్‌తేజ

కవితా జీవనది జూకంటి



ప్రియురాలి మునివేళ్లు, తేనె తెట్టులో మకరందం, మల్లెపువ్వులో సువాసన దగ్గరే ఆగిపోకుండా పగిలిన వరిమడిని, వేపచెట్టుకు వేలాడుతున్న రైతు శవాన్ని, దగ్ధమవుతున్న అంటరాని పూరి గుడిసెను, ఒరిగిపోతున్న ఆదివాసీ వీరుడిని, కుతకుత ఉడుకుతున్న తెలంగాణ అస్తిత్వాన్ని, గ్లోబల్ ఖడ్గానికి మౌనంగా తెగిపడుతున్న మానవ సంబంధాలను అక్షరాలతో పుటం పెడుతున్న కవుల వరుసలో అపురూపమైన కవి జూకంటి జగన్నాథం.

ఆయన మౌనంగా ఉంటాడు, మెరుపుల ప్రపంచానికి దూరంగా ఉంటాడు, పల్లెను మోసుకు తిరుగుతాడు, మాయిముంత వాసనేస్తాడు, అల్పాక్షరాలలో వ్యక్తమవుతాడు. ఆయన సిరిసిల్ల, ఆయన జగిత్యాల, ఆయన మానేరు. ఆయనొక నిరంతరం ప్రవహించే కవితా జీవనది. ఏడు పదుల జూకంటి అర్ధశతాబ్దంగా కవిత్వమే జీవితంగా రాస్తున్నాడు.



జూకంటి జగన్నాథం దేశం స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్లలో ఈ భూమి మీద పడ్డాడు. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యాన్ని శాసిస్తున్న కాలంలో కష్టజీవికి ఇరువైపుల ఉన్నవాళ్లే కవులనే భావన విస్తారంగా వ్యాపించి ఉండింది. కానీ ఆ కవులే కలాన్ని దించి అంతర్ బహిర్ యుద్ధరవానికి విరామం ప్రకటించారు. ఆ కాలం లోనే అగ్నిగోళంలా మండుతున్న ప్రపంచంలో విస్మరణకు గురైన సమూహాల నుంచి అనేక ప్రశ్నలు ఉదయించాయి. భారత సమాజం ఈ క్రమానికి మినహాయింపు కాలేకపోయింది. నల్లమందు మింగి మత్తుగా ఉన్న కవి వర్యుని యువకవులు ప్రశ్నించారు. సామాన్యుని ఆర్తిని ఆకాశమంత ఎత్తుకు అరిచిన కాలంలో జూకంటి బాల్య దశను దాటి యవ్వన కాలాన్ని అందుకోవడానికి 'ఆకాశానికి నిచ్చెన' వేసాడు. ప్రగతి భావన ఆయన యవ్వన కాలపు స్వప్నాలను తట్టిలేపింది. సిరిసిల్ల సమీపం లోని సినారె ప్రభావం కంటే జగిత్యాల జైత్రయాత్ర మట్టి మనుషులే ఆయనను అమితంగా ఆకర్షించారు.

జూకంటి మాతామహుల ఇంటినుంచి సిరిసిల్లకు రావటం వలన అరుదైన కవిగా రూపొందడానికి మొదటి పునాది పడింది. సిరిసిల్ల ఆంధ్ర మహాసభల ద్వారా వెల్లివిరిసిన అక్షర చైతన్యం ఆ ప్రాంతాన్ని ఆవరించింది. పౌర గ్రంథాలయాలు ఏర్పడడానికి దారి దొరికింది. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అలంకారికుల భావనలు కావచ్చు కానీ అవి ఏ కవికైనా అబ్బవలసిన ప్రాథమిక నియమాలు. నిరంతర అధ్యయనమే మనిషిని సాన పడుతుందని చెప్పడానికి జూకంటియే నమూనా. సిరిసిల్ల పౌర గ్రంథాలయంలో దొరికిన ప్రతీ పుస్తకాన్ని తిరిగేసిన అనుభవమే ఆయనలోని వ్యుత్పత్తి వికాసానికి మూలం. పెద్దపల్లి, కరీంనగర్ పట్టణాలను తన జ్ఞానం, బోధన ద్వారా ప్రభావితం చేసిన నిజాం వెంకటేశంతో స్నేహం జూకంటిని మరో తలంలోకి తీసుకెళ్లింది. ఆయన పరిచయం చేసిన కమ్యూనిస్టు మేనిఫెస్టో జూకంటిలో అలజడిని రేపింది. అప్పటికే చదివివున్న పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి సాహిత్య దృక్పథం అర్థం కావడానికి మార్క్స్ తోడ్పడ్డాడు.

ఎమర్జెన్సీ కాలానికి జూకంటి రెండు పదుల్లోకి ప్రవేశించాడు. నిండు జవ్వనంబుతో కవిత్వాన్ని అల్లటం ప్రారంభించాడు. ఆ వయసులో సృజనకాలాన్ని కాంక్షించాడు. కానీ సంకెళ్లకాలం అంతర్ముఖున్ని చేసింది. అలాగని జూకంటి పలాయనవాది కాదు, ఆ కాలంలో పదునెక్కిన యవ్వనకలం. ఎమర్జెన్సీ, దళిత అస్తిత్వ వేదన, మండల్ కమీషన్ ఉద్యమం, ప్రపంచీకరణ, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష ఇలా తన కాలపు జన సందోహాలన్నింటిని జూకంటి అక్షరబద్ధం చేసాడు. ఈ కవి చుట్టూ నిండైన సామాజిక చలనాలు రూపొందాయి. ఈ యాభై ఏళ్ల కాలానికి ఆయనొక కాపలాదారుగా ఉన్నాడు.

ప్రతి కవి కవిత్వానికొక డిక్షన్ ఉంటుంది. మెటఫర్ ఉంటుంది. అలాంటి తనదైన ముద్రతో తెలుగు కవిత్వంలోకి జూకంటి ప్రవేశించాడు. వాస్కోడిగామా డాట్ కామ్‌ను గ్లోబలైజేషన్ తొలి రోజుల్లోనే కవిత్వం చేసిన క్రాంతదర్శి ఆయన. ఏలిక అనుకుంటే ఏదైనా జరగవచ్చును, అది రాజపత్రంగా రూపొందుతుంది. రాజ్యాలు లేని రోజుల్లో రాజదర్పం, రాజపత్రం ఉండటమే వింతల్లోకెల్లా వింతగా కవి భావించాడు. 'ఊళ్లకూళ్లు కూలగొట్టి కడుపులు కాలబెట్టిన రాజపత్రం గురించిన చిలక రహస్యాన్ని కవి చెప్పగలడు. రాజ్యం అణచివేత సాధనం, రాజకీయార్థశాస్త్రం తెలిసిన వారందరికి అర్థమయ్యే పెట్టుబడి సత్యాన్ని ఎన్నిసార్లు ఆవిష్కరించినా ఆయన కవిత్వంలో కొత్తగానే వ్యక్తమవుతుంది. అది కవి ప్రతిభ ద్వారా వ్యక్తమైన శిల్పనైపుణ్యం. దోపిడీ విశ్వమంతా వ్యాపించి ఉంది. నిరసన కూడా ఎల్లలు దాటింది. ఈ చారిత్రక విభాత సంధ్యను జూకంటి దర్శించిన తీరు తాజాగా ఉంటుంది. సముద్రం మౌనంగా ఉందని మనం అనుకునేలోపు అదొక ఝంఝ మారుతంలా చుట్టేస్తుందనే ప్రమాద హెచ్చరికను ఈ కవి చేయగలడు. అగ్నిపర్వతం మీది నుంచి కవితాగానం సంధించగలడు. జీవితం లోతుల్లోకి వెళ్లి పాతాళ గరిగెతో సమస్త దుఃఖాన్ని తవ్వితీసి ఒడ్డుకు వేసే పనిలో ఆయన నిమగ్నమయ్యాడు.

గ్లోబల్ దృశ్యాన్ని ఎప్పటికప్పుడు అక్షరబద్ధం చేస్తాడు జూకంటి. పరుగెత్తుతున్న కాలాన్ని అంతే వేగంగా అందుకుంటాడు. అందుకే ఆయన కవితా నవయవ్వనుడు. "కిటికీలు దర్వాజలు తీసుకుపోగా/ దూలానికి వేలాడిన గుక్కపట్టిన ఉయ్యాల/ కన్నీటి జోలపాటకు తల ఊగుతుంది" వర్తమానంలో నిర్వాసితుల దుఃఖాన్ని ఈ పద్యం ఆవిష్కరించింది. నది ఏదైనా, ఊరు ఏదైనా గాయం ఒకటే. అలాగే తెలంగాణ గురించి ఈ కవి కలగన్నాడు. బాల్యంలో కోరుకున్నాడు, యవ్వనంలో ఆశించాడు, వృద్ధాప్యంలో నెరవేర్చుకున్నాడు. కానీ సంధించిన ప్రశ్నలు వడి పెడుతుంటే ఎవర్ని అడగాలో తెలియక మానేరు నదితో ఒంటరిగా సంభాషిస్తున్నాడు.

> **ఆయన మౌనంగా ఉంటాడు, మెరుపుల ప్రపంచానికి దూరంగా ఉంటాడు, పల్లెను మోసుకు తిరుగుతాడు, మాయిముంత వాసనేస్తాడు, అల్పాక్షరాలలో వ్యక్తమవుతాడు. ఆయన సిరిసిల్ల, ఆయన జగిత్యాల, ఆయన మానేరు. ఆయనొక నిరంతరం ప్రవహించే కవితా జీవనది. ఏడు పదుల జూకంటి అర్ధశతాబ్దంగా కవిత్వమే జీవితంగా రాస్తున్నాడు.**

జూకంటి కవిత్వంలో విస్తారమైన ఇతివృత్త వైవిధ్యం ఉంది. కన్నతల్లి, తండ్రి, మనుమరాండ్లు, స్నేహితులు, సెల్ ఫోన్, పేపర్ బాయ్, మిల్క్ బాయ్, మానేరు, సిరిసిల్ల, తెలంగాణ, విప్లవం, అమరులు, గ్లోబలైజేషన్. ఇలా తన చుట్టూ ఆవరించిన ఇతివృత్త సముదాయమంతా ఆయన కవిత్వంలో ఉంది. తెలంగాణ జీవద్భాష కలిగి ఉండటం చూస్తే స్థానీయత మీద ఆయనకుండే మమకారం తెలుసుకోవచ్చు. తెలంగాణ మట్టిలో నుంచి ఆయన వ్యక్తమవుతాడు. మనిషితనం, మంచితనం అతడి కవితా సారాంశంగా భావించవచ్చు.

కవి మౌనంగా ఉంటే వ్యవస్థ కురచగా మారిపోతుందనే ఎరుక జూకంటికి ఉంది. సంవిధానం, ప్రజాస్వామ్యం వికసించాలంటే ప్రశ్న మనుండాలని కోరుతున్నాడు. "సంఘర్షించాల్సిన సమయంలో మౌనంగా తల వంచుకుంటే చావడానికి ఇలా ఎన్నెన్నో ఉటంకింపులు" ఉంటాయని హెచ్చరిస్తున్నాడు. "చీకటి గురించి అడుగు/ వెలుగుకు అంటిన/ నల్లని మరకల గురించి అడుగు" అప్పుడే కవి సజీవ దృశ్యంగా ఉంటారని జూకంటి రాస్తాడు. కవులు అనధికారిక శాసనకర్తలని ఆంగ్లంలో ఒక మాట ఉంది. కనుక వారి కలం, వారి గొంతు ప్రజాపక్షమే. ఏలికలో భాగమైన కవిలో సృజనాత్మకత ఒట్టిపోతుంది. ప్రపంచీకరణ పతాక స్థాయికి చేరుకున్న కాలంలో విధ్వంసమవుతున్న మానవ విలువలు కవిని పాలక కొసకు చేర్చుతున్నాయనే న్యాయమైన ఫిర్యాదు జూకంటికి ఉంది. సచివాలయ గుమ్మానికి కవులు స్వచ్ఛందంగా శిరస్సులను వేలాడదీసుకున్నారని బాధపడుతున్నాడు. రాజ్యం కోసం అక్షరం సొట్టపడకూడదని నెత్తి నోరు మొత్తుకొని బామాడుతున్నాడు.

కవి మట్టిలో కలిసిపోవచ్చు. కానీ జీవనది లాంటి అక్షరం మాత్రం గొంతు లేని వారికి ఆసరా కావాలి. జూకంటి అర్ధశతాబ్ది కవితా ప్రవాహం 18 సంపుటాల్లో, 1745 పేజీల్లో నిక్షిప్తమైంది. ఒక్క వ్యాసంలో ఆయన కవితా ఆత్మను ఆవిష్కరించడం సాధ్యమయ్యే పనికాదు.

■ **చింతకింది కాశీం**
✆ 97014 44450

బ్రతుకు మూట

జాతర ఏదో జరుగుతున్నట్టు
దేవతాభరణాలు ఏవో మోసుకొస్తున్నట్టు
వీధుల వెంట తిరిగే ఊరేగింపు

చూడడానికి చిన్నదే అయినా
మూట విప్పితే
ఇంద్రజాలం ఏదో చూసినట్టు
రాజూ రాణీ వస్త్రాలు ఏవో ప్రదర్శనకు పెట్టినట్టు
వాకిలి నిండా పరుచుకునే బట్టల దుకాణం

చిన్న రాయుడు పెద్ద రాయుడు లుంగీలంటూ
రంభ రమ్యకృష్ణ చీరలు అంటూ
వాడు ఎన్నెన్ని కలలు మూటగట్టుకుని వస్తాడో

ఒక ధర చెప్తాడు
మనము వద్దు అంటాము
వాడు ఒక మాట అంటాడు
మనము ఇంకో మాట అంటాము
వాడొక మెట్టు దిగి
కూలీ గిట్టిన బేరం కుదిరినట్టు
కళ్ళలో నవ్వులు పూయిస్తాడు

ఉద్దెరకు ఊ కొడుతాడు
ఎంతసేపు బేరమాడినా
నుదుటిపై విసుగు బొమ్మ అగుపడనీయడు

పొద్దు తిరుగుడు పువ్వులా
ఆ సందూ ఈ సందూ తిరిగి
సాయంత్రానికి మూట దులిపి
జేబు నిండిన సంబరం
వెంటబెట్టుకుని వెళ్తాడు

కాలం ఉత్తగ ఉండనే ఉండదు కదా
కుడిచేత్తో తోలిన గాలిని
ఎడమ చేత్తో మళ్ళగొడుతున్నది

వాని ఉపాయం కాపీ కొట్టి
నడూళ్ళో వెలసిన షాపింగ్ మాల్
వాని పొట్టగొడుతూ
బ్రతుకు మీద ప్రళయ తాండవమాడుతున్నది

వడగండ్లకు రాలిపోయిన వరి గొలుసులా
ఎక్కడో
పీక తెగుతున్నది.


■ **గజ్జెల రామకృష్ణ**
✆ 89774 12795

కూలుతున్న ప్రపంచాల నైరాశ్యం

ప్రపంచం ఇక అంతాన్ని సమీపించింది. కానీ ఆ అంతం ఒక అగ్ని వర్షం గానో, జల ప్రళయం గానో ఒక్క పెట్టున వచ్చి పడేది కాదు. ఒక నైతిక పతనంగా, భౌతిక క్షయంగా, అతి మెల్లగా దాపురిస్తుంది. - ఇదీ లాస్లో క్రస్నహోర్కాయ్ నవలల్లోని వాతావరణం. అతని తొలి రెండు ప్రసిద్ధ నవలల్లోనూ ప్రపంచం ఇక రేపో మాపో అంతం కాబోతుందన్న గుబులు ఉంటుంది. ఆ అంతానికి కారణం ఏమిటన్నది స్పష్టంగా వ్యక్తం కాదు. కానీ నవలల్లోని పాత్రలన్నీ ఆ సమీపిస్తున్న అంతాన్ని నిశ్శబ్దంగా ఒప్పుకున్నట్టే ప్రవర్తిస్తాయి. చుట్టూ క్రమంగా శిథిలమై కూలుతున్న ప్రపంచాల మధ్య తమని కాపాడే ఆశ కోసం ఎదురు చూస్తుంటాయి. ఆ ఆశ ఎప్పటికీ రాదు. ఒక్కోసారి ఎవరో రాబోయే మనిషి తమని కాపాడతాడన్న ఎదురుచూపు ఉంటుంది. కానీ ఆ వచ్చిన మనిషి తన కోసం ఎదురుచూస్తున్న వాళ్ళని మోసం చేసి వెళ్ళిపోతాడు.

లాస్లో క్రస్నహోర్కాయ్ (Laszlo Krasznahorkai)కు ఇలాంటి ఇతివృత్తాలను సరఫరా చేసింది అతని స్వదేశమైన హంగరీలో ఆనాటి రాజకీయ వాతావరణమే అనుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత హంగరీ సోవియట్ రష్యా అధీనం లోని ఒక దేశంగా మారింది. స్టాలిన్ అడుపాజ్ఞల కింద హంగరీలో కూడా కమ్యూనిస్ట్ పాలన మొదలైంది. స్టాలిన్ చనిపోయాకా 1956లో హంగరీలో రష్యన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం మొదలైనప్పటికీ, రష్యా దాన్ని యుద్ధటాంకులతో హింసాత్మకంగా అణచివేసింది. ఆ తర్వాత ఇక 1989 దాకా హంగరీలో కమ్యూనిస్టు పాలనే కొనసాగింది. ఈ కాలమంతా ప్రజల సామాజిక జీవితం భయం, అణచివేతల మధ్య గడిచింది. 1960ల నుంచి క్రమంగా హంగరీపై రష్యా అదుపు తగ్గించుకుంటూ వచ్చినా, ప్రజలకు స్వేచ్ఛ మాత్రం పరిమితమే. లాస్లో క్రస్నహోర్కాయ్ బాల్యం, యవ్వనం అంతా ఈ వాతావరణంలోనే గడిచింది. 1989లో తన 35 ఏళ్ళ వయస్సులో కమ్యూనిస్టు పాలన ముగిసిన సందర్భాన్ని తలచుకుంటూ, "ఆ రాజకీయ స్వేచ్ఛ నమ్మశక్యం కాని విషయంలా అనిపించింది," అంటాడు లాస్లో. "అప్పటి దాకా అదో కాలం కదలని సమాజం. పరిస్థితులు ఎప్పటికైనా మారతాయన్న ఆశలేకుండా చేశారు పాలకులు. ఎప్పుడూ అదే బూడిదరంగు ఆకాశం, కళాకాంతుల్లేని చెట్లు, పార్కులు, వీధులు, భవనాలు, నగరాలు. చవక బార్లు, పేదరికం, మాటపై నిషేధం. మార్క్సిజంపై నమ్మకం కోల్పోయిన తొలి తరం మాది," అంటాడు.

లాస్లో క్రస్నహోర్కాయ్ 1954లో జ్యులా పట్టణంలో పుట్టాడు. అతని అసలు ఇంటి పేరు 'కొరీన్'. కానీ అంతకుముందు హిట్లర్ చెలరేగిన కాలంలో తమని యూదులుగా పట్టించి వేసే ప్రమాదం ఉన్న ఆ ఇంటి పేరును లాస్లో తాతయ్య 'క్రస్నహోర్కాయ్'గా మార్చాడు. (అది హంగరీలో ఒక పాత కోట పేరు.) తనకు యూదు మూలాలు ఉన్నాయన్న సంగతి లాస్లోకి కూడా పదకొండేళ్ల వయసు వచ్చే దాకా తెలియదు.



> **యవ్వనంలో తన చుట్టూ చవి చూసిన రాజకీయ ఉక్కపోత లాస్లో క్రస్నహోర్కాయ్ రచనల ఇతివృత్తాలను, శైలిని నిర్దేశించింది. అయితే అతను తన రచనలను నిరంకుశ రాజకీయ వ్యవస్థలపై ఎక్కుపెట్టలేదు. అలాంటి వ్యవస్థల కింద సమాజం క్రమ క్రమంగా క్షీణించే తీరుపై ఎక్కువ దృష్టి పెట్టాడు. ఇక అంత్య దశకు వచ్చేసిన ప్రపంచం ఏదో మహా విపత్తు వైపు క్రమంగా జారుతున్న వాతావరణం అతని నవలల నిండా పరుచుకుని ఉంటుంది.**

పంతొమ్మిదేళ్ళ వయసులో- నిర్బంధ మిలటరీ పని నుంచి తప్పించుకోవాలని కొంత, దాస్తవిస్కీ లాంటి పంతొమ్మిదో శతాబ్దం రష్యన్ రచయితల ప్రభావంతో కొంతా- లాస్లో క్రస్నహోర్కాయ్ ఇల్లు వదలి పేద ప్రజల మధ్యకు వెళ్ళి చిన్నా చితకా ఉద్యోగాలు చేయటం మొదలుపెట్టాడు. గనుల్లో కూలీ పని నుంచి డైరీ ఫార్మ్‌లో నైట్ వాచ్‌మన్ పని దాకా రకరకాల ఉద్యోగాలు చేస్తూ హంగరీ అంతా దేశ దిమ్మరిలా తిరిగాడు. రాత్రిపూట డైరీ ఫార్మ్‌లో వందలాది ఆవులకు కాపలా కాస్తూనే తన తొలి నవల 'సాటాన్‌టాంగో' (Satantango) రాశాడు. వర్షపు బురద నిండిన వీధులూ, కూలిపోతున్న ఇళ్లూ, ఏదీ పండని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, పాడైపోయిన మిల్లులు, పేద జనం మసిలే ఇరుకుబార్లు... ఇదీ నవలకు నేపథ్యం. (ఈ నవలను దర్శకుడు బేలా టార్ 1994లో ఏకంగా ఏడున్నర గంటల సినిమాగా తీశాడు!)

లాస్లో అంత సులువుగా చదివించే రచయిత కాదు. అతని నవలల్లోని పాత్రలు కదలని కాలంలో చిక్కుకుపోయి ఉన్నట్టు గానే, వాటిని చదివే పాఠకుడు కూడా ఆ ఎడతెగని వాక్యాల వరద మధ్య చిక్కుకుపోతాడు. వేగంగా కదులుతూ కూడా ఎటూ పోని లాస్లో వాక్యాలు చాలా పొడవుగా ఉంటాయి. పేరాల విభజన లేకుండా, ఫుల్‌స్టాపులు కూడా లేకుండా పేజీలకు పేజీలు కొనసాగుతాయి. "ఫుల్‌స్టాప్ అవసరం ఉన్నది దేవుడు ఒక్కడికే. అంతా ముగిసే అంతంలో ఒక ఫుల్‌స్టాప్ వాడతాడు తప్పకుండా," అంటాడు. ఆయన ప్రసిద్ధ నవల 'సాటన్‌టాంగో'లో మొదటి వాక్యమే ఆరు పేజీల పాటు ఏ ఫుల్‌స్టాప్ లేకుండా కొనసాగుతుంది! "ఒక స్నేహితుడితో పాటూ కూర్చుని రాత్రి పూటంతా మేల్కొని మన జీవితంలో ఎంతో ముఖ్యమైన విషయాన్ని అతనికి అర్థమయ్యేలా చెబుతున్నప్పుడు, మన మాటలకి ఫుల్‌స్టాపులూ కామాలూ అవసరం లేదు. మాట్లాడేందుకు ఊపిరీ, మాటల్లో లయా మాత్రమే కావాలి. నేను ఫుల్‌స్టాపులు తక్కువ వాడాలనీ, పొడవాటి వాక్యాలు మాత్రమే రాయాలనీ ఏమీ నియమం లాగ పెట్టుకోలేదు. పాఠకుడిని చేరువ చేసుకుని అతన్ని కన్విన్స్ చేయటానికి కథ చెప్తున్నప్పుడు నాకు ఆ లయా, ఆ రాగం, అలాంటి వాక్య నిర్మాణం సహజంగా వచ్చేశాయి," అంటాడు.

యవ్వనంలో తన చుట్టూ చవి చూసిన రాజకీయమైన ఉక్కపోత లాస్లో రచనల ఇతివృత్తాలను, శైలిని నిర్దేశించింది. అయితే అతను తన రచనలను నిరంకుశ రాజకీయ వ్యవస్థలపై ఎక్కుపెట్టలేదు. అలాంటి వ్యవస్థల కింద సమాజం క్రమ క్రమంగా క్షీణించే తీరుపై ఎక్కువ దృష్టిపెట్టాడు. ఇక అంత్య దశకు వచ్చేసిన ప్రపంచం ఏదో మహా విపత్తు వైపు క్రమంగా జారుతున్న వాతావరణం అతని నవలల నిండా పరుచుకుని ఉంటుంది. "మనం ఏ మహా ప్రళయం (apocalypse) కోసమూ ఎదురు చూడనక్కర్లేదు. ఎందుకంటే మనం మహా ప్రళయం లోనే జీవిస్తున్నాం," అంటాడు. ఈ విపత్తు నుంచి తప్పించుకునేందుకు మనుషులు దేని మీద ఆశపెట్టుకున్నా అది చివరకు వాళ్ళని మోసమే చేస్తుంది. కానీ లాస్లో దృష్టిలో ఆశ ఎంత నిష్ఫలమైనప్పటికీ అది ఎంతో అవసరం కూడా. అలాంటి ఆశను ప్రజల నుంచి లాక్కోవటం కళ చేయాల్సిన పని కాదంటాడు. "మానవ జీవిత నైరాశ్యాన్ని ఉన్నది ఉన్నట్టు చూపిస్తానే కానీ మనుషుల నుంచి ఆశను లాగేసుకోవటం నా ఉద్దేశం కాదు," అంటాడు.

ఈ ఏడాది నోబెల్ సాహిత్య బహుమతిని లాస్లో క్రస్నహోర్కాయ్‌కు ప్రకటిస్తూ, "ప్రపంచం అంతం కానున్నదనే భయావహ వాతావరణం మధ్య కళని శక్తివంతంగా నిలబెట్టిన అతని దార్శనిక రచనలకు ఈ బహుమతిని ఇస్తున్నాం," అంది నోబెల్ కమిటీ. ఈ సందర్భంగా అతని స్పందన కోరుతూ ఒక విలేకరి, "మీ రచనల్ని నడిపించేది ఏమిటి?" అని అడిగితే, "అక్కసు" (bitterness) అని జవాబు ఇచ్చాడు లాస్లో. "ఇప్పుడు ప్రపంచం ఏ పరిస్థితిలో ఉందో చూస్తే బాధ కలుగుతుంది. అదే నా రచనలకి లోతైన ప్రేరణ," అన్నాడు.

■ **ఎన్. వసంత్**



వసంత స్వప్నం లాంటి మృదు నిమిషం

ఉద్దండుడెవరో ఎదురైనప్పుడు
మాయా మైకాలు నీలో రెండు కాళ్ళ జంతువులా తిరిగి
పలకరింత కోసం ఉవ్విళ్లూరుతాయి
మిటకరించే కళ్ళతో
కాసింత దూరంలో నిలబడి చేతుల్ని
నమ్మనట్టు గిల్లుకుంటావు

నువ్వు సితారలా చూసిన మనిషి నీ ముందు
కనబడినప్పుడు
కైవల్యం మెట్ల ముందు నిలబడ్డట్టు కాసింత
కల్లోలమౌతావు

అతడు పలకరింపుగా నవ్వినప్పుడు
సంకోచం ఏదో నీలో బలపం నమిలే పెదవిలా
తడబడుతుంది

వసంత స్వప్నం లాంటి ఆ నిమిషం
అడగాలనుకున్న ప్రశ్నలు ఎగిరిపోయిన పక్షుల్లా
తలను ఖాళీ చేసి వెళ్ళిపోతాయి

ఏ లాలిత్యమో
తొలి పలుకంత మృదువుగా తుళ్ళే వింత మైకంలో
నువ్వతడి చేతుల్ని నొక్కి తృప్తి పడతావు

రాని భాషలో కుశలమేదో అడిగినట్టు
ఉద్వేగానికి వ్యాకరణాలద్ది ముక్కలయ్యాక
మంత్ర లోకం నుండి ఇంటి వైపు మళ్ళినట్టు
ఉండిపోతావు

మరే లాలసా లేనట్టున్న ఆ నిమిషం
కాలం నిన్నొక ఉన్మత్త స్వప్నంలా ముట్టుకుందని
చెప్పుకుంటావు

■ **రఘు**
✆ 96761 44904

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక

- అభ్యర్థుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

7



ముక్కిపోయి.. మూలిగిపోయి..



- రేషన్‌షాపుల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యం
- ఆరునెలలుగా గోదాముల్లోనే నిల్వ
- అటకెక్కిన సర్కారు వేలం నిర్ణయం
- కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- జాప్యం చేస్తే పూర్తిగా పాడైపోయే పరిస్థితి



హనుమకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల్లో, గోదాముల్లో ఆరు నెలలుగా ముక్కిమూలుగుతున్న దొడ్డు బియ్యానికి ఇంకా మోక్షం కలగడం లేదు. ఈ బియ్యం క్రమంగా పురుగులు పట్టిపోతున్నాయి. ఇంకా కొన్ని రోజులు వీటిని ఇలాగే వదిలేస్తే ఎందుకూ పనికిరాకుండా పోయే పరిస్థితి ఉంది. రెండు నెలల కిందటే ప్రభుత్వం ఈ బియ్యాన్ని తిరిగి తీసుకోనున్నట్టు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు వాటికి జోలికి వెళ్లలేదు. దొడ్డు బియ్యానికి త్వరలో వేలం వేయనున్నట్టు చెప్పినప్పటికీ అది కూడా ఇప్పటి వరకు జరగలేదు. ఆరు నెలలుగా దొడ్డు బియ్యం రేషన్ షాపుల్లో, గోదాముల్లోని ఈ బియానికి కదలిక లేకపోవడంతో పురుగులు పట్టడమే కాదు ఎలుకలు, పందికొక్కుల బెడత కూడా మరీ ఎక్కువైంది. దీనితో రేషన్ షాపు డీలర్లు కలవరపడుతున్నారు. మరో వైపు స్థలం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సన్న బియ్యం రాకతో..

చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఇది వరకు దొడ్డు బియ్యం ఉచితంగా పంపిణీ చేసేవారు. ఉగాది నుంచి కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. మరో వైపు పోర్టబులిటీ సౌకర్యంతో కార్డుదారు రాష్ట్రంలో బియ్యం ఏదుకాణంలోనైనా తీసుకునే వెసులుబాటు ఉండడంతో డీలర్లు నిర్ణీత కోటాకు మించి బియ్యం తీసుకున్నారు. అలా తీసుకోగా దొడ్డు బియ్యం ఒక్కో రేషన్ షాపులో 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు మిగిలిపోయాయి. రేషన్ దుకాణాలు అద్దె గదుల్లోనే కొనసాగుతుండడం.. దొడ్డు బియ్యం నిల్వలతో స్థలం ఇరుకుగా మారడంతో ఎండ తెరిపి లేని వర్షాలతో బియ్యం ముక్కిపోతున్నాయి. ఎలుకల పాలవుతున్నాయి. త్వరగా దొడ్డు బియ్యం ఖాళీ చేయించి విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇప్పటికే ఆ బియ్యం బస్తాలకు చెద పురుగులు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. రేషన్ దుకాణాల్లో దొడ్డు, సన్న బియ్యం నిల్వలు ఒకే చోట ఉండటంతో పంపిణీ సమయంలో సంచుల నుంచి బియ్యం కిందపడడంతో కార్డుదారులు అభ్యంతరం చెబుతున్నారనే మాట డీలర్ల నుంచి వినిపిస్తోంది. దొడ్డు, సన్న బియ్యం కలిపి ఇస్తున్నారా? అని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారని, అనవసరంగా తమపై నిందలు వేస్తున్నారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలం కొరతకు తోడు పురుగులు, ఎలుకల సంచారంతో తరుగును ఎలా భర్తీ చేయాలో తెలియక డీలర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానంత వరకు దొడ్డు బియ్యం నిల్వల తరలింపు విషయంలో తామేమీ చేయలేమని పౌరసరఫరాల శాఖ అధికారులు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 2045 మెట్రిక్ టన్నులు

హనుమకొండ జిల్లాలో మొత్తం 2,045.327 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. ఇందులో రేషన్ దుకాణాల్లో 588.427 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉండగా, బఫర్ గోదాముల్లో 1330 మెట్రిక్ టన్నులు, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద మరో 126.900 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి. నెలనెలా కేటాయించే బియ్యం కోటాలో చాలామంది తీసుకెళ్లరు. గోదాము నుంచి కూడా కొంతమంది రేషన్ డీలర్లు తక్కువ కార్డులకే డీడీలు చెల్లించడంతో వారికి పూర్తి స్థాయిలో బియ్యం కేటాయించరు. దీంతో గోదాముల్లో ప్రతి నెలా కొంత మేరకు బియ్యం నిల్వలుంటాయి. అదే విధంగా దొడ్డు బియ్యం కూడా గోదాములు, రేషన్ డీలర్ల వద్ద నిల్వ ఉన్నాయి. వాటిని సకాలంలో తీసుకోకపోతే పూర్తిగా పనికి రాకుండా పాడై పోయే ప్రమాదం ఉంది.

లెక్కలు సేకరించి..

రేషన్ దుకాణాలు, గోదాముల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం గతంలోనే వచ్చింది. ఆ మేరకు అసలు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం ఎన్ని మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయో లెక్క తేల్చే పనిలో పడింది. ఆరు జిల్లాల్లోని బియ్యం నిల్వల వివరాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇది వరకే పంపారు. అయితే ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలకు, అధికారులు పంపిన నిల్వలకు పొంతన లేకుండా పోయింది. దీనితో ప్రభుత్వం సందిగ్ధంలో పడింది. మిగతా దొడ్డు బియ్యం సంగతి తేల్చాలనే నిర్ణయానికి వచ్చింది. లెక్క తేలే వరకు వేలం వేయరాదన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దొడ్డు బియ్యం వేలంలో కొనుగోలు చేయడానికి కూడా వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదని సమాచారం. బియ్యం పురుగులు పట్టి నాణ్యత లోపించడంతో వాటిని కొనుగోలు చేసే సాహసాన్ని వ్యాపారులు చేయడం లేదు.

పోలియో చుక్కలు తప్పక వేయించాలి..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయిలతో కలిసి పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో చిన్నారులకు ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా, పోలియో బారిన పడకుండా పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో సుమారు 150పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఐదేళ్ల వయస్సున్న పిల్లలు సుమారు 85,000మంది ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలు వేసేందుకు 472 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు జేవీ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రసాద్, అశోక్‌లు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పలు పల్స్ పోలియో కేంద్రాలను సందర్శించి కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డాక్టర్ మదన్‌మోహన్‌రావు, డాక్టర్ మహేందర్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ గీత, ఇవి.శ్రీనివాసరావు, కేశవరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడారంలో మంత్రుల పర్యటన

ములుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సోమవారం పర్యటించనున్నారు. సమ్మక్క, సారలమ్మ మహాజాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించనున్నారు. కాగా, స్థానిక మంత్రి సీతక్క అందుబాటులోనే ఉండగా, శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్ ద్వారా మేడారానికి చేరుకోనున్నారు. ఉదయం 9 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి 9.30 గంటలకు బేగంపేటకు చేరుకోనున్నారు. అక్కడ హెలీకాప్టర్ ఎక్కి 10.30 గంటలకు మేడారంలోని హెలీప్యాడ్‌లో దిగుతారు. 10.45 గంటలకు సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని సందర్శించనున్నారు. 11 గంటలకు అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. 11.30 గంటలకు హరిత హోటల్‌లోనే సమావేశపు గదిలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.



సుబేదారిలో మొక్కలను పరిశీలిస్తున్న మేయర్

మీడియన్‌లలో పచ్చదనం పెంపొందించాలి

- మేయర్ గుండు సుధారాణి
- సుబేదారి మీడియన్‌ల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని మీడియన్‌లలో పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని మీడియన్ సెంటర్‌లను పరిశీలించారు. సంబంధిత మునిసిపల్ హార్టికల్చర్ అధికారులను పిలిచి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రధాన రోడ్ల మధ్యలో ఉన్న మీడియన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిరంతరం గ్రీనరీ ఉండేలా చూడాలన్నారు. యేటా గ్రీన్ బడ్జెట్ కోసం 10 శాతం నిధులు కేటాయిస్తున్నామన్నారు. వనమహోత్సవంలో భాగంగా నర్సరీలలో మొక్కలను పెంచడంతో పాటు నగర ప్రజలకు మొక్కలు పంచుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డితో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో..

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలైన నేపథ్యంలో స్థానిక ఎన్నికలు నిర్వహించే వరకు ప్రజావాణిని రద్దు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు బీసీ రిజర్వేషన్‌లపై స్టే విధించడంతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుందని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

వరంగల్ సిటీకి త్వరలో వంద ఎలక్ట్రిక్ బస్సులు

- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం
- రోడ్డు రవాణా సంస్థ ఎం.డి. వైవీ నాగిరెడ్డి
- వరంగల్ రీజినల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష

హనుమకొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని వరంగల్ నగరానికి త్వరలో వంద ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైవీ నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని వరంగల్ రీజినల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వరంగల్ రీజియన్‌కు తొలిసారిగా వచ్చిన ఆయనకు.. ఆర్ఎం డి.విజయభాను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వరంగల్-1 డిపో ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ప్రగతి చక్ర అవార్డు కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ సేవలందించిన సిబ్బందిని సత్కరించారు. హనుమకొండ బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి అవసరమైన సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైవీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9,800 బస్సులు, 40 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. ప్రతీరోజు 60లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. వరంగల్ రీజినల్ పరిధిలో వెయ్యి బస్సులు నడుపుతున్నామని, రోజుకు 4 లక్షల మంది ప్రయాణికులకు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి ఆదాయం పె రుగుతోందని, ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిధులు ఇస్తోందని తెలిపారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కోసం ప్రతీ డిపోలో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రస్తుతం బస్సు చార్జీలు పెంచామని అన్నారు. డిపోలలో డ్రైవర్లు, కండక్టర్లకు అనుకూల వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చడం ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలమాన్, వరంగల్ ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మహేష్, అధికారులు రవీందర్, సైదులు, డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ -1 డిపోలో మొక్క నాటుతున్న ఆర్టీసీ ఎం.డి. వైవీ నాగిరెడ్డి



బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఖాయం

- దానికి పేటెంట్ హక్కు సీఎం రేవంత్‌రెడ్డిదే..
- బీసీలపై బీఆర్ఎస్, బీజేపీలది కపటప్రేమ
- కాంగ్రెస్‌ను సంస్థాగతంగా అభివృద్ధి చేయాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

6

సాగునీటి ప్రాజెక్టులపై అబద్ధపు ప్రచారాలు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలి
- 22 నెలల్లో ఒక్క ప్రాజెక్టు కట్టలేదు.. రిపేర్లు చేయలేదు..
- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

హనుమకొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు చేస్తూ కాలం గడుపుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. నీటి ప్రాజెక్టులపై రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరం అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి మానసపుత్రికైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 22 నెలల్లో ఒక్క ప్రాజెక్టు కట్టిందీ లేదని, రిపేర్లు చేసింది లేదన్నారు. నష్కల్, ఉప్పుగల్లు కెనాల్ కోసం రూ.1,015కోట్లకు అంచనా పెంచారని, ఇప్పటివరకు పైసా ఇవ్వలేదని, పనులు ప్రారంభించలేదని అన్నారు. సమ్మక్క- సారలమ్మ బ్యారేజ్‌తో పాటు మరి కొన్ని ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉట్టిమాటలు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర అనుమతి లేనిది సీయూసీ పర్మిషన్, ఫారెస్టు క్లియరెన్స్ లేనిది ప్రాజెక్టును ఎలా కడతారని ప్రశ్నించారు. ప్రాజెక్టులు ప్రజల కోసం కాకుండా కమీషన్ల కోసమే రూపకల్పన చేయాలని కాంగ్రెస్ ఆలోచిస్తోందని రాజయ్య విమర్శించారు. కేసీఆర్ హయాంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులను కాంగ్రెస్ చేపట్టడం లేదని అన్నారు. రైతు సంక్షేమం, సాగునీటి హక్కు కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు మోటార్లను రిపేర్లు చేసి, ప్రాజెక్టులకు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని రాజయ్య డిమాండ్ చేశారు.



తెలంగాణ 'దీప్తి' పతాక..!

మళ్లీ ప్రపంచ వేదికపై జీవాంజి కీర్తి పతాకం

- ఆస్ట్రేలియాలో బంగారు పతకం సాధించిన అథ్లెట్
- 55.92 సెకండ్లలో 400 మీటర్ల పరుగు
- అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

ఆస్ట్రేలియాలో బంగారు పతకం సాధించి వివిధ దేశాల రన్నరప్‌లతో జీవాంజి దీప్తి

7

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖాయం

» బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్, బీజేపీది కపట ప్రేమ
» స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటానికి పేటెంట్ కమ్యూనిస్టులదని, తెలంగాణ ఉద్యమానికి పేటెంట్ కేసీఆర్ అని, రానున్న రోజుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లభిస్తుందని, దానికి పేటెంట్‌గా సీఎం రేవంత్ రెడ్డి నిలుస్తాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంగతన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్ష పదవి ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్, టీపీసీసీ పరిశీలకుడు, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఎమీడ.అవేజ్, శ్రీకాంత్‌యాదవ్, అరుణ్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలోజరిగినకార్యక్రమంలో ఎమ్మెల్యేమాట్లాడారు.

కుల గణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి, బిల్లు పాస్ చేసి గవర్నర్‌కు, కేంద్రానికి పంపించారన్నారు. ఆరు నెలలైనా స్పందన రాకపోవడంతో జీవో-9ని తీసుకువచ్చామని కడియం పేర్కొన్నారు. జీవో ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. దీన్ని కోర్టు నిలిపివేయడం దురదృష్టకరమన్నారు. బీసీలపైన కపట ప్రేమ ప్రదర్శించే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని ప్రకటించకపోవడం దుర్మార్గమని కడియం ఆరోపించారు. ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా రిజర్వేషన్లకు అనుకూలమని చెప్పే ధైర్యం లేదన్నారు. సీఎం రేవంత్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్‌తో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.1,075 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నానని కడియం పేర్కొన్నారు. ఎన్నేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నామనేది ముఖ్యం కాదని, ఎంత గొప్పగా ప్రజలకు దగ్గరగా ఉన్నామనేది ముఖ్యమన్నారు. పార్టీ పేరు చెప్పుకొని తిరగడం వలన ప్రయోజనం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడి కోసం నియోజకవర్గంలోని ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికైనా తనకు ఇబ్బందేమీ లేదని కడియం స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, అంబటి కిషన్‌రాజ్, రాపోలు మధుసూదన్‌రెడ్డి, పురమాని రజాక్‌యాదవ్, నాగరబోయిన శ్రీరాములు, అన్నం బ్రహ్మారెడ్డి, బేతి జయపాల్‌రెడ్డి, కొలిపాక సతీష్, రాజేష్‌నాయక్, గడ్డమీది సురేష్, కుందూరు వెంకట్‌రెడ్డి, కనకం రమేష్, నాగరబోయిన యాదగిరి, ఇల్లెందుల విజయ్ పాల్గొన్నారు.

దొంతిని పరామర్శించిన మంత్రి పొంగులేటి

హనుమకొండ సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మాధవరెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవలే మృతి చెందారు. శనివారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని మాధవరెడ్డి ఇంటికి మంత్రి శ్రీనివాస్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి జానారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి వచ్చి కుటుంబానికి సానుభూతి తెలియచేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల గడువు 23

కేయూ క్యాంపస్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నేతృత్వంలో టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు పొందేందుకు అక్టోబరు 23 వరకు గడువు ఉందని క్రిస్టియన్‌కాలనీ వరంగల్ యూనిక్ హైస్కూల్ ఏ1 కోఆర్డినేటర్ సమీఉల్లాబేగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి విద్యార్హతలు లేకున్నా టెన్త్‌లో అడ్మిషన్లు పొందవచ్చునని, టెన్త్ ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఇంటర్‌లో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో చదువుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. సెలువు రోజుల్లో తరగతులు జరుగుతాయని తెలిపారు. వివరాలకు సెల్ 7396135390లో సంప్రదించాలని సమీఉల్లాబేగ్ తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో ఎఫ్ఎల్ఎన్ సెల్ ఏర్పాటు

- ఇందులో పని చేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం
- అర్హులైన ఐదుగురు ఉపాధ్యాయులకు అవకాశం

హనుమకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యా నాణ్యతను పెంపొందించడం, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల పఠన, లిఖన, గణన సామర్థ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేయనున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరెసీ(ఎఫ్ఎల్ఎన్) సెల్‌లో సభ్యులుగా చేరడానికి విద్యాశాఖ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ సెల్ రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, పర్యవేక్షణ, సమన్వయానికి కేంద్రంగా పని చేస్తోంది. ఇందులో మొత్తం 5 మంది సభ్యులను నియమిస్తారు. వీరిలో ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జీటీ)లు కాగా, ఇద్దరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు (పీఎస్ హెచ్‌ఎంలు లేదా ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు). సెల్‌లో సభ్యులుగా నియమితులైన వారు విద్యా నాణ్యత మెరుగుదల, శిక్షణా కార్యక్రమాలు, డేటా విశ్లేషణ, పాఠశాలల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. కనీసం 10 ఏళ్ల బోధనానుభవం, 5 ఏళ్ల రిసోర్స్ పర్సన్ అనుభవం, రాష్ట్ర, జిల్లా స్థాయిలో విద్యా ప్రణాళికలు, పాఠ్యాంశాల రూపకల్పనలో పాలుపంచుకున్న అనుభవం, డిజిటల్ లిటరసీ, డేటా విశ్లేషణ, విద్యా అంచనా పద్ధతుల్లో నైపుణ్యం కలిగిన వారు సభ్యులుగా నియమితులయ్యేందుకు అర్హులు. అర్హతల ఆధారంగా షార్ట్‌లిస్టింగ్ (1:2 నిష్పత్తి) చేస్తారు. ఏఎస్‌పీడీ నిపుణుల బృందం ఇంటర్వ్యూ చేస్తుంది. ఎంపికైన అభ్యర్థులు డిప్యుటేషన్ ఆధారంగా రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ సెల్‌లో నియమితులవుతారు. ఆసక్తి కలిగిన వారు ఐఎస్ఎంఎస్ తెలంగాణ పోర్టల్ ద్వారా ఈనెల ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలి.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

జనగామ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బెయిల్ రాదని మనస్తాపం చెందిన రిమాండ్ ఖైదీ బలవన్మరణానికి పాల్పడిన ఘటన జనగామ జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల మల్లయ్య(42) కూలీ పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన స్నేహితుడు బ్రహ్మచారితో దసరా పండుగ ముందు చిన్న మాటమాట పెరిగి తగాదా జరగడంతో బ్రహ్మచారి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దేవరుప్పుల పోలీసులు ఈనెల 8న మల్లయ్యను రిమాండ్ చేసి జనగామ సబ్ జైలుకు తరలించారు. మరుసటి రోజు బెయిల్ కోసం ప్రయత్నించగా రాకపోవడంతో రెండో శనివారం, ఆదివారం కోర్టుకు సెలవు రోజులు కావడంతో బెయిల్‌కు మరో రెండు రోజులు వాయిదా పడింది. దీంతో తనకు బెయిల్ రాదేమో అని మనస్తాపం చెందిన మల్లయ్య శనివారం బ్లీచింగ్ పౌడర్ తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా జైలు అధికారులు మల్లయ్యను జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లయ్య శనివారం రాత్రి మల్లయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్లయ్య భార్య హైమ, కుటుంబ సభ్యులు జైలు అధికారుల నిర్లక్ష్యం వలన మల్లయ్య మృతి చెందాడని, విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదివారం డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

పంట పొలాల్లో మొసలి ప్రత్యక్షం

- భయాందోళనకు గురైన రైతులు
- అటవీ అధికారులు పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేత



కొత్తూరు శివారు పంటపొలంలో ప్రత్యక్షమైన మొసలిని బంధించిన అటవీ అధికారులు

ఖానాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో మొసలి ప్రత్యక్షమైన సంఘటన మండలంలోని కొత్తూరు శివారులో ఆదివారం జరిగింది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సంపేట పట్టణానికి చెందిన రైతు పల్నాటి రవీందర్ కొత్తూరు శివారు తుంగబంధం కాలువ పారకంలో గల తన పంట పొలంలో వరిపంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాగు పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లి తిరుగుతుండంగా పొలం మధ్యలో మొసలి కదులుతూ కనిపించింది. మొసలి 15 అడుగుల పొడవుతో భారీగా ఉండడంతో రైతు భయాందోళనకు గురై సమీపంలోని రైతులకు సమాచారం ఇచ్చారు. దీంతో సమీపంలోని రైతులు పొలం వద్దకు వచ్చి మొసలిని చూసి ఎటువెళ్లకుండా చర్యలు చేపట్టి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి మొసలిని తాళ్లతో బంధించి పాకాల సరస్సులో వదిలివేశారు. దీంతో రైతు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల తరచుగా మొసళ్లు పాకాల పంట కాలువల్లో, పొలాల్లోకి వస్తుండడంతో రైతులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు కోరుతున్నారు.

బీసీలు రాజ్యాధికారం చేపట్టేవరకు ఉద్యమం

- తమిళనాడు తరహాలో బీసీ బిల్లు తీసుకురావాలి
- ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్
- హనుమకొండలో బీసీల రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీసీలు రాజ్యాధికారం చేపట్టేవరకు ఉద్యమం ఆగదని ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ స్పష్టం చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం బీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం భాస్కర్, బీసీ సంఘాల మేధావులు, ఉద్యోగులు హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ బిడ్డల బలిదానాలతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అగ్రవర్ణాలే అధికారం చెలాయిస్తున్నారని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ నోటికాడి కూడును లాక్కోవాలని చూస్తున్న రెడ్డి జాగృతి సంస్థ ప్రతినిధులపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ సాధన కోసం సబ్బండ వర్గాలు ఏ రకంగా కదిలాయో అదే తీరులో బీసీ రాజ్యాధికారం కోసం మరో ఉద్యమం చేయాలన్నారు. బీసీలం బలహీనులం కాదని, బాహుబలులం అన్నారు. బీసీ రిజర్వేషన్ తమ పౌర హక్కు, సామాజిక తెలంగాణ తమ జన్మహక్కు అని నినదించారు. బీసీలకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే బీసీల తడాఖా చూపిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో బీసీ బిల్లు తీసుకువచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. బీసీలకు ప్రభుత్వం ప్రతీ ఏటా రూ.లక్ష కోట్ల బడ్జెట్ ప్రకటించి నామినేటెడ్ పదవుల్లో, విద్య, వైద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో కూడిన అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, రాజేష్‌కుమార్, వేణుమాధవ్ గౌడ్, తాడిశెట్టి క్రాంతికుమార్, పులి రజినీకాంత్, ప్రొఫెసర్ సీహెచ్.రాములు, కమల్‌కుమార్, బెనర్జీ, రాజయ్య యాదవ్, కటకం పెంటయ్య, వెంకయ్య, గొల్లపల్లి వీరస్వామి, అడ్వకేట్ సర్వా మోహన్, మౌనిక గౌడ్, మనోహర్‌రావు, భిక్షపతి, శ్రీధర్‌రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

ధర్మసాగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి దిడ్డి అశోక్(39) అనేవ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై దిలీప్ ఆదివారం తెలిపారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన అశోక్ తన ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్ద మోటార్‌ను ఆన్ చేయడానికి అర్ధరాత్రి 12 గంటలకు వెళ్లాడు. ఈ క్రమంలో బావి వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. ఎంతసేపటికీ భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానంతో బావి వద్దకు భార్య రాజేశ్వరి వెళ్లిచూడగా భర్త అశోక్ మృతదేహం బావిలో కనిపించింది. విషయాన్ని చుట్టుపక్కల ఉన్న వారికి తెలుపడంతో వారు వచ్చి బావిలోకి చూసే సరికి అశోక్ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారాన్ని అందించడంతో సంఘటనస్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారత్-స్విట్జర్లాండ్ మధ్య సహకారం ఎంతో ముఖ్యం

» వరంగల్ ఎంపీ కడియం కావ్య
» స్విస్ పార్లమెంటేరియన్లతో హైటీ మీటింగ్



స్విస్ పార్లమెంటేరియన్లతో ఎంపీ డాక్టర్ కావ్య

హనుమకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత్, స్విట్జర్లాండ్ దేశాల మధ్య ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, శాంతి, అభివృద్ధికి సహకారం ఎంతో ముఖ్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. భారతదేశం, స్విట్జర్లాండ్ పార్లమెంటేరియన్లు పరస్పర అనుభవాలను పంచుకోవడం ద్వారా సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత బలమైన బంధం ఏర్పడుతుందని అన్నారు. ఆదివారం స్విస్ పార్లమెంటేరియన్లతో హైటీ మీటింగ్‌లో వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొన్నారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో స్విట్జర్లాండ్ పార్లమెంటేరియన్ల ప్రతినిధి బృందంతో నిర్వహించిన ఈ మీటింగ్‌లో కావ్య పాలుపంచుకున్నారు. భారత్-టిబెట్ సమన్వయ కార్యాలయం ఆధ్వర్యంలో జెనీవా(స్విట్జర్లాండ్)లోని టిబెట్ బ్యూరో తరపున ఈ సమావేశం ఏర్పాటు చేశారు. భారత దేశం, స్విట్జర్లాండ్ మధ్య ద్వైపాక్షిక పార్లమెంటరీ సంబంధాలను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడం, పరస్పర అవగాహన, సహకార మార్గాలను పరిశీలించడం లక్ష్యంగా ఈ హైటీ సమావేశం జరిగింది. అనంతరం స్విస్ ఎంబసీ, న్యూఢిల్లీలో స్విస్ ఆర్ట్‌నైట్ కార్యక్రమంలో కూడా ఎంపీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల పార్లమెంట్ సభ్యులు, రాయబారులు, సాంస్కృతిక ప్రతినిధులు హాజరయ్యారు.

కోటలో విద్యార్థుల సందడి

- హెరిటేజ్ క్యాంప్‌లో భాగంగా ఉమ్మడి జిల్లాలో పర్యటన




ఖిలావరంగల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 40 మంది విద్యార్థులు ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఆర్కియాలజీ, టూరిజం, హిస్టరీ తదితర విభాగాలకు చెందిన విద్యార్థులు, వలంటీర్స్‌తో పాటు ఇరాన్ దేశం నుంచి ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారు. వరల్డ్ హెరిటేజ్ క్యాంప్‌లో భాగంగా వారు రామప్ప, పాండవుల గుట్ట, వేయిస్తంభాల దేవాలయంతో పాటు ఖిలావరంగల్‌లోని కాకతీయుల కళాఖండాలను తిలకించారు. కీర్తి తోరణాలు, కళాఖండాలు, శిల్పసంపద, ఖుష్‌మహల్, సింగారపు బావి, దేవాలయాలు, రాతి, మట్టికోట, బావులు, చెరువుల గురించి తెలుసుకున్నారు. అనంతరం లైట్ అండ్ సౌండ్ షోను తిలకించారు. ఈ సందర్భంగా రిటైర్డు ప్రొఫెసర్ పాండురంగారావు, అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ ప్రమోషన్ కుసుమ సూర్యకిరణ్ మాట్లాడుతూ.. కాకతీయుల కాలంనాటి చరిత్ర, నాటి అద్భుత శిల్పకళాఖండాలను రక్షించి ముందు తరాలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ సంస్థ శ్రీధర్‌రావు, పర్యాటక అభివృద్ధి మేనేజర్లు అజయ్, రాజేష్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇన్‌చార్జి శ్రీకాంత్, శ్రీనివాస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గటిక విజయ్‌కుమార్



నెక్కొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షుడిగా వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు డాక్టర్ గటిక విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ కోకాపేటలో పెరిక కుల ఆత్మగౌరవ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కుల సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. విజయ్‌కుమార్ గతంలో సీఎం పీఆర్వోగా, వివిధ న్యూస్ పేపర్లు, చానళ్లలో జర్నలిస్టుగా విధులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ ముదిసేని వీరయ్య, మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాం భద్రయ్య, బండి పుల్లయ్య, సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మద్దా లింగయ్య, దాసరి మల్లేశం, శ్రీరామ్ దయానంద్, చంచు ఉపన్న తదితరులు పాల్గొన్నారు. విజయ్‌కుమార్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

టీసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయచందర్‌రెడ్డి



వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన ప్రముఖ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో ఐఎంఏ భవన్‌లో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు హనుమకొండకు చెందిన డాక్టర్ విజయచందర్‌రెడ్డి గత రాష్ట్ర కమిటీలో కోశాధికారిగా తన సేవలు అందించారు. ఈ సందర్భంగా విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాష్ట్రంతో పాటు వరంగల్ జిల్లా వ్యాప్తంగా క్రికెట్ క్రీడాభివృద్ధికి నిరంతరం సేవలు అందిస్తానన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రికెట్ క్రీడాకారులను గుర్తించి మరింత ప్రోత్సహిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా అవకాశం కల్పించిన టీసీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బీటీ పాటిల్, గురువారెడ్డితో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు విజయచందర్‌రెడ్డి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

గురుకులాలకు బడ్జెట్ కేటాయింపులు

- టీజీఏఆర్ఐఈఏ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు

హనుమకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ గురుకులాల విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్ల నిధులు కేటాయించినందుకు తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీజీఏఆర్ఐఈఏ) రాష్ట్ర కమిటీ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, గురుకులాల సెక్రెటరీ క్రిష్ణ ఆదిత్యకు కూడా టీజీఏఆర్ఐఈఏ రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నర్సింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.జనార్దన్, ఉపాధ్యక్షుడు భిక్షం యాదవ్ సంయుక్త ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల గురుకుల బడ్జెట్ కేటాయింపులపై సంఘం తరుపున మంత్రి లక్ష్మణ్‌కు కలిసి ప్రాతినిధ్యం వహించినట్టు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య ఆధ్వర్యంలో గురుకులాల్లోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, రెగ్యులర్ టీచర్ల పెండింగ్ బిల్లులు, స్లీపింగ్ స్కానింగ్ కాంట్రాక్టు బిల్లులు, బడ్జెట్ సంబంధిత సమస్యలపై చర్చించామని తెలిపారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ వద్ద 60 ఎంఎల్‌డీ మోటార్లలో సాంకేతిక సమస్య ఉత్పన్నం కావడం వల్ల సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి అంతరాయం కారణంగా వరంగల్ నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రాంతంలో రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. సమీప ప్రాంతాల ప్రజలు బల్దియా అధికారులకు సహకరించాలని సత్యనారాయణ తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-19 బాలబాలికలకు క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాలబాలికలకు పలు క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. 13న వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్‌బాల్, సాఫ్ట్ టెన్నిస్, బీచ్ వాలీబాల్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, షూటింగ్, రగ్బీ. 14వ తేదీ హ్యాండ్‌బాల్, చెస్, షటిల్, హాకీ, సైక్లింగ్‌స్కేటింగ్, బేస్‌బాల్, లాన్‌టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, తైక్వాండో. 15న ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, క్యారమ్స్, క్రికెట్, ఫెన్సింగ్ క్రీడాంశాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9848876765 నెంబర్‌లో సంప్రదించాలని శ్రీధర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టీజీపీఈడబ్ల్యూయూ మహాసభలను విజయవంతం చేయాలి

- టీజీపీఈడబ్ల్యూయూ గౌరవ అధ్యక్షుడు చక్రపాణి



టీజీపీఈడబ్ల్యూయూ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చక్రపాణి

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(టీజీపీఈడబ్ల్యూయూ) సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని టీజీపీఈడబ్ల్యూయూ హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో టీజీపీఈడబ్ల్యూయూ మహాసభ వాల్‌పోస్టర్‌ను చక్రపాణి సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేసి కేటగిరీ వారీగా గ్రామ పంచాయతీ కార్మికులను కొనసాగించాలని, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని వారి పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ మహాసభకు జిల్లాకు చెందిన ఏడుగురు ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాకయ్య, పల్లె రామన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బండ సాంబయ్య పాల్గొన్నారు.

రచనల్లో సామాజిక స్పృహ ఉండాలి

- కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సాహిత్యం వైవిధ్యం
- 'పుంజుతోక' కవిత సంకలనం ఆవిష్కరణ సభలో అంపశయ్య నవీన్



'పుంజుతోక' కవిత సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న నవీన్ తదితరులు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం అంటేనే పాఠకుడికి సామాజిక స్పృహ కల్పించేలా ఉండాలని, పోలీస్ అధికారి అయిన శ్రీనివాస్‌రెడ్డి రచనలు వైవిధ్యంగా ఉంటూ సామాజిక స్పృహ కల్పింపజేస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో మిత్రమండలి ఆధ్వర్యంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కలం నుంచి జాలువారిన వివిధ కవితల సంకలనం పుంజుతోక సంకలనాన్ని అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నవీన్ మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి రచనలు యువతను ఆకట్టుకునేలా అభ్యుదయ భావాలతో అద్భుతంగా ఉన్నాయన్నారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పనిచేసిన ఆ శాఖకు సంబంధించి గాని, ఇతర అంశాలు ఏవీ ప్రస్తావించకపోవడం విశేషమన్నారు. నవరసాలతో కూడిన సాహిత్య సృజన చేసిన శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. ప్రాణత్యాగాలు చేస్తూ వృత్తిపరంగా సామాజిక సేవ చేస్తున్న వారే పోలీసులని పేర్కొన్నారు. సమాజాన్ని పరిశీలించి ముఖ్యంగా మానవీయ సంఘటనలపై చలించి తన అద్భుత భావాలను అక్షరరూపంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సమీప భవిష్యత్‌లో శ్రీనివాస్‌రెడ్డి ద్వారా అన్ని సామాజిక అంశాలతోపాటు అభ్యుదయ రచనలు మరిన్ని రావాలని నవీన్ ఆకాంక్షించారు.

విశ్రాంత పోలీసు అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు వరంగల్ అనేక అనుభవాలను, అనుభూతులను మిగిల్చిందని అన్నారు. ఉద్యోగ తొలినాళ్లలో ఏఎస్పీగా వరంగల్‌లోనే ట్రైనింగ్ చేసి, ఇదే జిల్లాకు ఎస్పీగా పనిచేసే భాగ్యం కలిగిందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే కవితలు రాయడం అలవాటని, ఆ రోజుల్లోనే తాను రాసిన కవితలు పత్రికల్లో ప్రచురితం అయ్యాయన్నారు. పోలీసు అధికారి అయ్యాక తన ఆలోచనలను కేవలం ఒక పుస్తకానికి పరిమితం చేశారన్నారు. శ్రీశ్రీ, చలం, కాళోజీ లాంటి కవులతో పాటు సినీ దర్శకులు సత్యజిత్‌రే, బి.నర్సింగరావులాంటి వారు స్ఫూర్తి నిచ్చినట్లు చెప్పుకున్నారు. అంపశయ్య నవల ద్వారా నవీన్ తనకు అత్యంత సన్నిహితులయ్యారని అన్నారు. అంపశయ్య రజతోత్సవ సభలో తాను పోలీసు అధికారిగా పాల్గొంటే.. ఇప్పుడు తన సంకలనాన్ని ఆయన ఆవిష్కరించడం గొప్ప విశేషమన్నారు. సాహిత్యం సంస్కారంతోపాటు మానవ విలువలను కాపాడుతుందన్నారు.

నాగిళ్ల రామశాస్త్రి, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్. విద్యార్థి, కేయూ తెలుగు ఆచార్యుడు బన్న అయిలయ్య మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి రచనల్లో పరిణతి కనిపిస్తోందని, వృత్తికి, ప్రవృత్తికి అంతర్యాలు ఉన్నా ఆయనకు సాహిత్యమంటే ఎంత మక్కువో తన రచనల ద్వారా చాటాడని పేర్కొన్నారు. అనేకమంది పోలీసు అధికారులు, సాహిత్యవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సహృదయ కార్యదర్శి మల్యాల మనోహర్‌రావు వందన సమర్పణ చేశారు.

మట్టి బిడ్డల చరిత్రను ప్రచురించడం అభినందనీయం

- 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్
- 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకావిష్కరణ



'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పోచమ్మమైదాన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మట్టి బిడ్డల చరిత్రను ప్రచురించి భావితరాలకు అందించడం అభినందనీయమని సామాజిక సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్ కొనియాడారు. వరంగల్ జిల్లా ఆరెపల్లిలో గల సరళి అధ్యయన కేంద్రంలో ఆదివారం సీనియర్ జర్నలిస్టు నాగబెల్లి జితేందర్ సామ్రాట్ రచించిన 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకావిష్కరణ, అంకితోత్సవ సభ నిర్వహించారు. ఈ పుస్తకాన్ని కె.శ్రీనివాస్-గోపరాజు సుధ దంపతులకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె. శ్రీనివాస్, ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరవగా... రిటైర్డ్ ప్రిన్సిపాల్, సాహితీవేత్త ఘంటా రామిరెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి దయ్యాల రమేష్ 'సామాజిక పొద్దు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామ స్థా యి నుంచి వచ్చిన సమాచారాన్ని తీర్చిదిద్దుతూ తాము సంపాదకులు గా మారామని అన్నారు. ప్రతీ గ్రా మంలో ఉన్న మట్టిబిడ్డల గురించి భావితరాలకు తెలియాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి అన్వర్, పొట్లపెల్లి శ్రీనివాసరావు, సినీ గేయరచయిత మిట్టపెల్లి సురేందర్, విశ్రాంత ప్రొఫెసర్ బన్న అయిలయ్య, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి-అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు బుద్దె పెద్దన్న, కన్నెబోయిన సారయ్య, దారా దేవేందర్, బీఆర్ విద్యార్థి, దయ్యాల రాకేష్‌భాను, సంగంరెడ్డి పృథ్వీ పాల్గొన్నారు.

ఆదివాసీ జీవితాల ప్రతిబింబమే మిడ్కో సాహిత్యం



మిడ్కో గ్రంథాలను ఆవిష్కరిస్తున్న మిడ్కో తల్లి జయమ్మ, ప్రముఖులు

సమగ్ర సాహిత్య ఆవిష్కరణ సభలో వక్తలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కడవెండి ముద్దుబిడ్డ, భారత ఉద్యమ చరిత్రలో తనకుంటూ ప్రత్యేక స్థానాన్ని ఆపాదింపజేసుకున్న గుముడవెల్లి రేణుక (మిడ్కో) సాహిత్యం ఆదివాసీ జీవితాల ప్రతిబింబమని, యావత్ మహిళా లోకానికే రేణుక గర్వకారణమని అనేకమంది వక్తలు ప్రశంసించారు. మిడ్కో సమగ్ర సాహిత్య గ్రంథాలను ఆదివారం దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ కన్వీనర్ ఆస్నాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మిడ్కో తల్లి జయమ్మతోపాటు అనేకమంది ప్రముఖ కవులు, రచయితలు, ఉద్యమకారులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిడ్కో తల్లి మాట్లాడుతూ.. రేణుక తనకు బిడ్డగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమని పేర్కొన్నారు. మిడ్కో భౌతికంగా మరణించినా.. ఆమె రచనల ద్వారా ఎప్పటికి సజీవంగా ఉంటుందన్నారు. దండకారణ్యం, ఆదివాసీ ప్రాంతంలో జరుగుతున్న అన్యాయలు, అక్రమాలను మిడ్కో తన రచనల ద్వారా సమాజానికి తెలియజేశారన్నారు. ఆమె రచనల్లో ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించే దిశగా చూడాలని కోరారు.

దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ సలహాదారుడు, ప్రముఖ కవి ఏరుకొండ నర్సింహులు మాట్లాడుతూ.. వలస కూలీలపై చేసిన అధ్యయనం, విముక్తి బాటలో గ్రంథం, విలువైన పరిశోధనాత్మక రచనగా నిలిచిపోతుందన్నారు. వలస జీవుల దుఃఖం, వారి జీవిలోని చేదు అనుభవాలు మిడ్కో రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయన్నారు. మిడ్కో రచనలను పెద్దఎత్తున సేకరించిన మెట్టు రవీందర్ మాట్లాడుతూ.. ఆమె కథలు భావోద్వేగాల సారాంశమని పేర్కొన్నారు. మిడ్కో 13 ఏళ్ల అనుభవం సాహిత్యంలో ప్రతిబింబింపజేసి వాస్తవ జీవితాన్ని సమాజానికి తెలియజెప్పిందన్నారు. దండకారణ్య ఉద్యమ నిర్మాత లంక పాపిరెడ్డి మాట్లాడుతూ.. మిడ్కో సమాజాన్ని అనేక కోణాల్లో విశ్లేషించిందన్నారు. ఆమె రచనల్లో బస్తర్ ప్రాంతాల్లో అఘాయిత్రాలు, ఆదివాసీల సంస్కృతి విచ్ఛిన్నం, మహిళల కష్టసుఖాలు ప్రస్ఫుటంగా ప్రతిబింబింపజేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ నేత బి.రమాదేవి మాట్లాడుతూ.. మిడ్కో ఉద్యమంలో నిస్వార్థంగా పనిచేసిందని, ఆమె చదువుకుంటూనే ఆదివాసీలకు అక్షరజ్ఞానం అందిస్తూ సాయుధ పోరాటంలో భాగస్వామురాలిగా నిలిచిందన్నారు.

దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ కన్వీనర్ ఆస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మిడ్కో రచనలను సమాజానికి దారిచూసే దీపస్తంభంగా అభివర్ణించారు. మల్లెపూవు నుంచి మోదుగు పూవుగా మారి అనేక కష్టసుఖాలను చవిచూసిన మిడ్కో తన సాహిత్యం ద్వారా వాస్తవ జీవితాన్ని ఆవిష్కరింపజేసిందన్నారు. ఆస్నాల విమల మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే రేణుక చైతన్యవంతురాలని, ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ప్రవృత్తిపరంగా సాహిత్యం ద్వారా సున్నితమైన అనుభవాలను అక్షరీకరించినట్లు పేర్కొన్నారు. మరొక ప్రముఖ కవి జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో సమసమాజం సాధ్యమవ్వాలంటే మార్పు ద్వారానే సాధ్యమని దానికి మిడ్కో జీవితం ఆదర్శనీయమన్నారు. గోరేటి అరుణ, సీపీఐ ఎంఎల్ నాయకుడు అప్పారావులతోపాటు అనేక మందిసాహితీ వేత్తలు, కడవెండి గ్రామస్థులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మిడ్కోకు సమావేశం ఘన నివాళులర్పించింది.

రక్తదానం.. సామాజిక బాధ్యత..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- క్రెడాయ్ ఆధ్వర్యంలో 520 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వేదికపై మేయర్ సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి

వడ్డెపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం సామాజిక బాధ్యత అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ ఎంజీఎం సంయుక్తంగా ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయనతో పాటు మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో 520 యూనిట్లకు పైగా రక్తం సేకరించారు. క్రెడాయ్ వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాకమూరి అమర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. సమాజంలోని ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. రక్తదానం చేయడంతో ఎదుటి వారికి ప్రాణం పోసిన వారమవుతారని అన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, క్రెడాయ్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రెసిడెంట్ ఎలక్ట్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.రవీందర్‌రెడ్డి, ఎల్.రజినీకాంత్‌రెడ్డి, జి.రాజేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు కొండా రెడ్డి, నాగరాజు, వెంకటమల్లారెడ్డి, కోశాధికారి వరుణ్ అగర్వాల్, ఈసీ సభ్యులు రిషిన్‌రెడ్డి, మనోహర్, సందీప్, బాబురావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత గట్టు మహేష్‌బాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి గౌడ్, నన్నె సాహెబ్, బూర గాంధీ, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక

- అభ్యర్థుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్

హనుమకొండ సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి తదితరులతో కలిసి మాట్లాడారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. తొలి రోజు ఆదివారం డీసీసీ భవన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరిగిందని, ఈ నెల 18 వరకు కొనసాగనున్నట్లు చెప్పారు.

పార్టీ బలోపేతం కోసం అగ్రనేత రాహుల్‌గాంధీ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారని నవజ్యోతి పట్నాయక్ చెప్పారు. భారత్ జోడో యాత్ర ఇందులో ఒకటిగా చెప్పారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టంగా నిర్మించడం, నాయకత్వ ఉత్పత్తి, పార్టీ పదవుల ఎంపికలో నిర్దిష్ట విధానాల రూపకల్పన, అమలు వంటివి ప్రవేశపెట్టామన్నారు. 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' పేరుతో పార్టీ పునర్‌నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుల ఎంపిక ఉంటుందన్నారు. పారదర్శకత, నిబద్ధత, నాయకత్వ సామర్థ్యం, పార్టీకి చేసిన సేవలు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని అధ్యక్ష పదవి ఎంపిక జరుపనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల గురించి క్షేత్రస్థాయిలో వివిధవర్గాల నుంచి అభిప్రాయాల సేకరణ కూడా ఉంటుందన్నారు.

కాగా, డీసీసీ అధ్యక్ష పదవుల ఎంపికలో భాగంగా జిల్లాలో సమావేశాలు నిర్వహించనున్నట్లు పట్నాయక్ తెలిపారు. 13న డీసీసీ భవన్‌లో జిల్లా ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం, 14న పరకాల నియోజకవర్గ పరిధిలో సమీక్ష, 16న వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశం, 17న వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో సమావేశ నిర్వహణ, 18న నర్సంపేట నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించి పర్యటనను ముగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షులు బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఏయంసీ చైర్మన్ ఝాన్సీరాణి, తెలంగాణ ఫిషరిస్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మండల సమ్మయ్యతో పాటు కూర వెంకట్, శ్రవణ్, సాగరిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష దరఖాస్తులు ప్రారంభం

హనుమకొండ సిటీ : డీసీసీ పదవి కోసం అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులను ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ స్వీకరించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 18 వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా తొలిరోజు కొందరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ పరిశీలకుడు పట్నాయక్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తూ వారి వివరాలను తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంరెడ్డి, ఓబీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మోజెస్ ఆనంద్, మార్క విజయ్ తదితరులు ఉండగా, మహిళలో హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళా తదితరులు ఉన్నారు. తొలి రోజు ఆదివారం తక్కువ సంఖ్యలో దరఖాస్తుల సమర్పణ జరిగింది. రానున్న రోజుల్లో ఆశావహుల సంఖ్య పెరగనున్నట్లు అంచనాలు ఉన్నాయి.



నవజ్యోతి పట్నాయక్‌కు దరఖాస్తు ఇస్తున్న నాయకుడు మార్క విజయ్

తెలంగాణ 'దీప్తి' పతాక..!

- మళ్లీ ప్రపంచ వేదికపై జీవాంజి కీర్తి పతాకం
- ఆస్ట్రేలియాలో బంగారు పతకం సాధించిన అథ్లెట్
- 55.92 సెకండ్లలో 400 మీటర్ల పరుగు ఛేదన
- అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున అవార్డు అందుకుంటున్న జీవాంజి దీప్తి (ఫైల్)

పర్వతగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి.. ఆస్ట్రేలియాలోని బ్రిటన్‌లో తాజాగా మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. విర్టూస్ వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ -2025లో 400 మీటర్ల పరుగు పందెంలో 55.92 సెకండ్లలో లక్ష్యాన్ని ఛేదించి మొదటి బహుమతి గోల్డ్ మెడల్ సాధించింది. రెండో రన్నరప్‌గా పోర్చుగల్ దేశానికి చెందిన సరేనా పైరమ్ 58.86 సెకండ్లలో పూర్తి చేయగా, మూడో రన్నరప్‌గా 59.09 సెకండ్లలో ఆస్ట్రేలియాకు చెందిన బ్లాక్ స్మిత్ నిలిచింది.

ఒలింపిక్స్‌లో పతకాల పంట

2022లో హ్యాంగ్ జౌ ఆసియా పారా గేమ్స్‌కు ఎంపికై, 2023 అక్టోబరు 24న జరిగిన టీ20 అవెంట్‌లో 400 మీటర్ల పరుగులో థాయిలాండ్‌కు చెందిన ఒరవన్ క్రైసింగ్ కంటే ముందు 56.69 సెకన్లలో చేరుకుని బంగారు పతకం సాధించింది. గతంలో అమెరికా క్రీడాకారిణి బ్రెన్న క్లార్క్ రికార్డును సైతం బద్దలు కొట్టింది. 2024 జపాన్ కోబ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఉమెన్స్ టీ20 కేటగిరీలో 400 మీటర్ల పరుగు పందెంలో కేవలం 55.07 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకం సాధించి మొట్టమొదటి అథ్లెటిక్‌గా నిలిచింది. ప్రపంచ పారా ఒలింపిక్స్‌లో ఎన్నో పతకాలు సాధించిన జీవాంజి దీప్తి ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. 2024 జనవరి 2న భారతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందించగా, ప్రధాన నరేంద్ర మోదీ సైతం సత్కరించారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రముఖులు

జీవాంజి దీప్తి మరోసారి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అభినందించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆర్డీఎఫ్ పాఠశాల వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు సైతం దీప్తి విజయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని, పర్వతగిరి మండల పేరును ప్రపంచ స్థాయిలో వినిపిస్తున్న జీవాంజి దీప్తికి ఎల్లప్పుడు రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారని స్పష్టం చేశారు.

జోరుగా మాంసం విక్రయాలు

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- రోడ్లపైనే అమ్మకాలు
- నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కనే మాంసం విక్రయిస్తున్న దృశ్యం

నర్సంపేట టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యం కోసం వైద్యులు మాంసాహారాన్ని తినాలని సూచిస్తారు. కానీ, ప్రస్తుతం మాంసం తింటే రోగాల బారిన పడే అవకాశాలు నర్సంపేట పట్టణంలో నెలకొన్నాయి. మునిసిపాలిటీ పరిధిలో 14 మాంసం విక్రయ కేంద్రాలు అనుమతి పొందాయి. ద్వారకాపేట సెంటర్‌లో 2, కమలాపూర్ క్రాస్ వద్ద 2 అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే దాదాపుగా 3 క్వింటాళ్లకు పైగా అమ్మకాలు జరుపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మాంసం కొనుగోలుకు నర్సంపేటకు వస్తుంటారు.

జనావాసాల్లో జీవాల వధింపు

పట్టణ, గ్రామీణ ప్రజలు గొర్రెలు, మేకల మాంసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే మాంసం దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతాయి. ఈ విక్రయాలపై దృష్టి పెట్టాల్సిన మునిసిపల్ ప్రజారోగ్య అధికారులు వాటిమాటే మరిచిపోయారు. నిబంధనల ప్రకారం గొర్రె, మేకలను పరీక్షించి ముద్ర వేయాలి. కొన్ని నెలలుగా ముద్ర వేయకుండానే మాంసం విక్రయిస్తున్నారు. కబేళాలో వధించి మాంసం విక్రయించాలి. కానీ, కొంత మంది నిర్వాహకులు మాత్రం ఇళ్లు, రోడ్లపై వధించి మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. జనావాసాల్లో జంతువులను వధించడం వల్ల వాటి వ్యర్థాలను నివాసిత ప్రదేశాలు, డ్రెయినేజీల్లో వేయడం వల్ల ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. జీవాలను వధించే సమయంలో పశు వైద్యాధికారులు అందుబాటులో లేక పోవడంతో ఎలాంటి గొర్రె, మేకల మాంసం విక్రయిస్తున్నారో తెలియడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే విక్రయాలు

నర్సంపేట పట్టణంలో మటన్ మార్కెట్ లేకపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపుల గల షెటర్లలో మాంసం విక్రయిస్తున్నారు. రహదారులపై దుమ్ము ధూళి మాంసంపై పడుతుంది. అదే మాంసాన్ని నిర్వాహకులు ప్రజలకు విక్రయిస్తున్నారు.

నిబంధనలకు తూట్లు

మాంసం విక్రయదారులు మునిసిపాలిటీకి ఫీజు చెల్లించి తప్పనిసరిగా అనుమతి పొందాలి. ద్వారకాపేట సెంటర్‌లో 2, కమలాపూర్ క్రాస్ వద్ద 2 విక్రయ కేంద్రాలు మాత్రం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్లపై మాంసం విక్రయాలు చేస్తున్నారు. ఈ షాపులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్న అంతర్యం ఏమిటో అని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ కాటా భాస్కర్‌ని వివరణ కోరగా.. రహదారులు, జన ఆవాసాల మధ్యలో జంతువులను వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాంసం విక్రయాలను పరిశీలించి నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మూగబోతున్న సైకిల్ బెల్

- తగ్గుతున్న వాడకం
- ఇంధన వాహనాల మోజులో యువత
- జ్ఞాపకంగా మిగిలిపోనున్న సైకిల్



నల్లబెల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక కాలంలో సైకిల్ వినియోగం తగ్గుముఖం పట్టింది. సైకిల్ బెల్ శబ్దం కనుమరుగవుతోంది. ఒకప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలకు రవాణా సౌకర్యంగా పని చేసిన సైకిల్ వాడకం క్రమంగా తగ్గుతోంది. పెరిగిన సాంకేతికతో ఇంధన వాహనాలపై ప్రజలకు మోజు పెరిగింది. నేడు ప్రతి పనికి ద్విచక్ర వాహనాలపైనే వెళ్తున్నారు. శరీరానికి శ్రమ లేకుండా పోయింది. దీంతో సైకిల్ వినియోగం తగ్గడంతో మనుషులు అనారోగ్యం బారిన పడే వారి సంఖ్య పెరిగింది.

కానరాని సైకిల్ బెల్ 'ట్రింగ్.. ట్రింగ్' మోత

గ్రామాల్లో, పట్టణాల్లో నాడు సైకిల్ బెల్ 'ట్రింగ్.. ట్రింగ్' మనే శబ్దాలు మోగేవి. రైతులు పొలం పనులకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు పశుగ్రాసం తీసుకొని తిరిగి ఇంటికి తేచ్చేందుకు సైకిల్ ఎంతో ఉపయోగపడేది. పొద్దునే చిరు వ్యాపారులు తాజా కూరగాయలు, పాలను తీసుకొని ఊరూరా తిరుగుతూ ఉండేవారు. సైకిల్ బెల్ శబ్దం వినగానే మహిళలు బయటకు వచ్చి కూరగాయలు, పాలను తీసుకునేవారు. అప్పట్లో ట్రింగ్ ట్రింగ్ మనే శబ్దం గ్రామాలు, పట్టణాల్లో నిత్యం వినిపించేది. దూరప్రాంతాలకు వెళ్లేందుకు సామాన్యులు ఎక్కువగా సైకిల్‌నే వినియోగించేవారు. కాలుష్య రహిత, పర్యావరణ హిత సైకిల్ వాడకం మంచిదని, పేదలు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించి వారిని ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

సైకిల్ ఎంతో ఉపయోగపడేది..



వ్యవసాయ పనులకు, బావుల వద్దకు వెళ్లడానికి సైకిల్ ఎంతో ఉపయోగపడేది. సైకిల్‌తో ఎలాంటి ప్రమాదం లేకుండా నెమ్మదిగా గమ్యాన్ని చేరుకోవచ్చు. గడ్డి, ఎరువులు, పొయ్యిల కట్టలను సైకిల్‌పైనే తీసుకువచ్చేది. అంతేకాక, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉండేవాళ్లం.

- రైతు అజ్మీరా భీమ్, రుద్రగూడెం

కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యవర్గం ఎంపిక

కేయూ క్యాంపస్ అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వర్సిటీ పరిధిలో పనిచేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయ్యారు. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో నుంచి అత్యధికంగా కార్యవర్గంలో ఎంపికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు. హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అంబాల రాజేశ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అంబాల రాజేశ్ 54 ఓట్లతో గెలిచారు. వీరితో పాటు వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీతో పాటు తదితర పదవులకు వర్సిటీ క్యాంపస్ నుంచి ఎంపికయ్యారు. ఎంపికైన రాజేష్‌తో పాటు పలువురు కరస్పాండెంట్స్, డైరెక్టర్లు, వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు అభినందించారు.


రాజేశ్‌కు ఎంపిక పత్రాన్ని ఇస్తున్న ఎన్నికల అధికారి

చుక్కల మందుకు చుక్కని స్పందన

వాడవాడనా పోలియో చుక్కల శిబిరాలు

వడ్డెపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో పల్స్ పోలియో చుక్కల శిబిరాలను ఆదివారం నిర్వహించారు. పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, జవహర్ కాలనీలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, బీజేపీ గోపాల్‌పూర్ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, జిల్లా నేత అలుగునూరి కృష్ణం రాజు, పూరిగుట్ట తండాలో కాంగ్రెస్ నేత రుద్రోజు మణీంద్రనాథ్ పల్స్ పోలియో చుక్కల శిబిరాలను ప్రారంభించారు. హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్య నగర్ శ్రీకృష్ణ కాలనీలో స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూప రాణి సుధాకర్‌రెడ్డి, గోకుల్ నగర్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ పల్స్ పోలియో శిబిరాల్లో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. హనుమకొండ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ మండల సమ్మయ్య, కాంగ్రెస్ శ్రేణులు జనగాం శ్రీనివాస్‌గౌడ్ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు.


శ్రీకృష్ణ కాలనీలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ స్వరూపరాణి తదితరులు


వడ్డెర బస్తీకాలనీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ కె. అనితారెడ్డి

హనుమకొండ టౌన్: తల్లిదండ్రులు బాధ్యతగా చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారి నుంచి రక్షించాలని అనురాగ్ సొసైటీ చైర్మన్ కె.అనితారెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని వడ్డెర బస్తీకాలనీలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. హనుమకొండ 57వ డివిజన్‌లోని అశోక కాలనీలో పల్స్ పోలియో శిబిరాన్ని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి రాంచందర్, కనకరాజు ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు.


వడ్డెపల్లి పీహెచ్‌సీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ మాలిక

నిండు జీవితానికి రెండు చుక్కలు

బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ రజనీకాంత్

హనుమకొండ చౌరస్తా (ఆంధ్రజ్యోతి): చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు భరోసాగా నిలుస్తాయని బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ అన్నారు. ఆదివారం హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్‌లో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమంలో రజనీకాంత్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుడే జన్మించిన చిన్నారుల నుంచి 5ఏళ్లలోపు వయస్సు వారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా చిన్నారులకు అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని ఆయన తెలిపారు. పోలియోరహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలని రజనీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుష్మచంద్ర, స్థానికులు నెల్లుట్ల సారంగం, కొనుకుంట్ల శ్రీను, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు తమ చిన్నారులకు విధిగా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని వడ్డెపల్లి పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ మాలిక అన్నారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని వడ్డెపల్లి పీహెచ్‌సీలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో వడ్డెపల్లి పీహెచ్‌సీ సిబ్బంది మానస, గోవర్ధన్‌రెడ్డి, కమలాకర్, శరత్, తదితరులు పాల్గొన్నారు.


మచిలీబజార్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న రజనీకాంత్



సుబేదారి సీఐ ఎం. రంజిత్ కుమార్

పోలీసులు, ప్రజలు కలిసి పని చేస్తేనే సమాజం సురక్షితం

ప్రశ్న: పోలీసుస్టేషన్‌కు ప్రజలు రావడానికి భయపడుతున్నారు. వారికి మీరు ఇస్తున్న భరోసా ఏమిటి?

జవాబు: ప్రజల సేవ కోసమే పోలీసులు ఉన్నారు. నేరం జరిగినప్పుడు ప్రజలు భయపడకుండా పోలీసులు సంప్రదించాలి. ప్రతీ ఫిర్యాదును దర్యాప్తు చేయబడుతుంది. పోలీసులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే సమాజం మరింత సురక్షింతంగా ఉంటుంది.

ప్ర: సైబర్ నేరాలపై మీ అభిప్రాయం?

జ: ఇప్పుడు ఎక్కువ నేరాలు మొబైల్ లేదా సోషల్ మీడియాలో జరుగుతున్నాయి. సైబర్ బృందాలు రోజువారిగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు తెలియని లింక్‌లు క్లిక్ చేయొద్దు. వ్యక్తిగత వివరాలు ఇవ్వకుండా జాగ్రత్త పడాలి.

ప్ర: యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుందని చెబుతున్నారు. మీ చర్యలు ఏం తీసుకుంటున్నారు?

జ: విద్యాసంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రగ్స్ సరఫరా చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ పెట్టాలి.

ప్ర: మహిళల భద్రత కోసం మీరు తీసుకుంటున్న చర్యలు?

జ: స్టేషన్‌లో షీటీమ్ భరోసా కేంద్రాలు, ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. ఏ సమస్య అయిన మహిళలు నేరుగా ఫిర్యాదు చేయగలుగాలి.

ప్ర: నేరాలపై ప్రజలకు ఏం అవగాహన ఉండాలి?

జ: నేరం జరుగకముందే ప్రతీ ఒక్కరు బాధ్యతయుతంగా ప్రవర్తించాలి. చట్టం అందరికీ ఒకేలా పనిచేస్తుంది. సురక్షితమైన సమాజం కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలి.

- హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)

ఘనంగా రైల్వే పెన్షనర్ల వార్షికోత్సవం


వార్షికోత్సవానికి హాజరైన రైల్వే పెన్షన్‌దారులు

మడికొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం తరాలపల్లిలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ 12వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేషన్ జోనల్ సహాయ కార్యదర్శి సీహెచ్. కొమ్మాలు మాట్లాడుతూ కొత్తపెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. 8వ వేతన సంఘంలో పెన్షనర్స్‌కు అవకాశం కల్పించాలని కోరారు. 18 నెలల డీఏను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు దాసరి మల్లేష్, కార్యదర్శి కొండయ్య, ప్రతినిధులు పి. వెంకటేశ్వర్లు, దాసరి రాజేశ్వర్‌రావు, సంగమయ్య, కేవీ రావు, సత్యనారాయణ, చంద్రమౌళి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, ఎమ్డీ బషీర్, కర్ర హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎం.డి నాగిరెడ్డికి అభినందనల వెల్లువ


నాగిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న స్టాల్స్ ఓనర్స్ ప్రతినిధులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎం.డి. వైవీ నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారిగా వరంగల్ రీజినల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆదివారం హనుమకొండ బస్టాండ్‌లోని వరంగల్-1 డిపోలో నాగిరెడ్డిని వరంగల్ జిల్లా స్టాల్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎ.ప్రవీణ్‌కుమార్, శ్రావణ్, అనిల్, నజీర్, సంపత్, వివేక్, సాయి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

హైర్ బస్ ఓనర్ల ఆధ్వర్యంలో..

నాగిరెడ్డిని ఆదివారం హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ రీజినల్ అధ్యక్షుడు మారిపెల్లి రాంరెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, నాయకులు కూరతోట సదానందం,హబీబ్ బుద్దిన్, పర్వేజ్, కె. భాస్కర్‌రెడ్డి, గోపు వెంకన్న, టి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.రాంబాబు, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఆర్టీసీ ఎం.డి. వైవీ నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించి ఆదివారం వరంగల్ రీజినల్ కార్యాలయంలో అధికారుల సమీక్షా సమావేశం అనంతరం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాగిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నాగిరెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

భగవాన్‌దాస్ కృషితోనే నగరానికి ఎస్సారెస్పీ తాగునీరు

» స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

» బీఆర్ భగవాన్‌దాస్‌కు ఘన నివాళి

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, కార్మిక నేత బీఆర్ భగవాన్‌దాస్ పోరాటంతోనే వరంగల్ నగర ప్రజలకు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కాకతీయ కెనాల్ ద్వారా తాగునీరు అందించినట్లు మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని బీఆర్ భగవాన్‌దాస్ విగ్రహం వద్ద 22వ వర్ధంతి వారి కుటుంబసభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై భగవాన్‌దాస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎస్సారెస్పీ నీళ్ల రావాలంటే పోచంపాడు మాత్రమే శరణ్యమని, అందుకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు సాధన కోసం భగవాన్‌దాస్ ఎంతగానో పోరాటం చేశారన్నారు.

విశిష్ట అతిథి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు వరంగల్‌లోని ఆజంజాహీ మిల్లు పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటాలు చేసిన వ్యక్తి భగవాన్‌దాస్ అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు భగవాన్‌దాస్ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అదే విధంగా బీడీ, హమాలీ, గీత, టైలర్, ఆటోరిక్షా, సినిమా, భూనిర్వాసిత కార్మికులకు, ప్రజల పక్షాన పలు ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఘనత బీఆర్ భగవాన్‌దాస్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ శ్రీమాన్, మాజీ కార్పొరేటర్లు మంచాల స్వామిచరణ్, జోరిక రమేష్, సీపీఐ నేతలు జ్యోతి, కరుణాకర్, బుద్ధభవన్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, భగవాన్‌దాస్ కుటుంబ సభ్యులు డాక్టర్ బీఆర్ రాజసిద్ధార్థ, బీఆర్ లెనిన్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.


భగవాన్‌దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

'ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలి'

దుగ్గొండి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సం క్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాటాడారు. ఓసీలు అందరూ ఉక్యంగా ఉండి అగ్రకులాల్లో ఆర్థికంగా వెను కబడి ఉన్న వారికోసం 10శాతం రిజర్వేషన్ సాధించుకోవడం జరి గిందన్నారు. దానిని అమలు పరచడం కోసం ఐక్యంగా ఉద్య మించాలన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. అగ్రకు లాల్లోని రెడ్డి, కమ్మ, వెలుమ, బ్రహ్మణ, వైశ్య, మర్వాడీలలో పేదలు ఉన్నారని, వారి సంక్షేమం కోసం ఉద్యమించాలన్నారు. ఈ నెల 19న హనుమకొండలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఎక్కువ సంఖ్యలో కదిలిరావాలన్నారు. ఈ సమావేశంలో చల్లా నర్సిం హారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గోలి బక్కారెడ్డి, కంచరకుంట్ల నర్సింహారెడ్డి, బొమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, తోకల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో రాణించాలి

ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ

మట్టెవాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ అన్నారు. ఆదివారం ఏవీవీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ఉండి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. వైశ్యులకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడిగా గాదె వాసుదేవ్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, ట్రెజరర్‌గా నాగమల్ల సతీష్‌కుమార్‌తోపాటు 24 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు 50 మందికి ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందజేశారు. గాదె వాసుదేవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బోనగిరి రాజన్న, దేవ అరవింద్‌బాబు, కళా రాజేశ్వర్‌రావు, శ్యాం ప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

దొంతి కాంతమ్మకు ఘన నివాళి

కాజీపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గృహంలో ఆదివారం టీరైల్వే జేఏసీ నాయకులు హనుమకొండలో మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాధవరెడ్డిని కలిసి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్‌లు అనుమాల శ్రీనివాస్, పి.రమేశ్, ఎస్.లక్ష్మీనారాయణ, కోకన్వీనర్లు జి.భాస్కర్, జిల్లా రాజలింగం, రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ భూనిర్వాసితులు పాల్గొన్నారు.


కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైల్వే నాయకులు

'డీసీసీ పదవుల్లో బీసీలకు స్థానం కల్పించాలి'


వడ్డెపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ 56వ డివిజన్ జవహర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నియమించే డీసీసీ అధ్యక్ష పదవులలో బీసీల జనాభా దామాషా ప్రకారం 17 జిల్లాల డీసీసీ అధ్యక్ష పదవులను బీసీలకు కేటాయించాలని పేర్కొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాల్లో మూడు డీసీసీ అధ్యక్ష పదవులను బీసీలకు కేటాయించి తగిన ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నేతలు తమ్మల శోభారాణి, తేళ్ల సుగుణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బుద్ధనగర్, మాతా బార్ ఏరియాలో ఉదయం 10గంటల నుంచి 12 వరకు, కొత్తూర్ మార్కెట్, కుమార్‌పల్లి తోటబడి ఏరియాలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పదవికి రవీందర్ యాదవ్ దరఖాస్తు

కాజీపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి కాజీపేటకు చెందిన 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆదివారం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్‌కు దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. ఈ సారి కాజీపేట ప్రాంతం నుంచి యాదవ సామాజికి వర్గానికి చెందిన తనకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరినట్లు దరఖాస్తులో పేర్కొన్నట్లు రవీందర్ యాదవ్ తెలిపారు.


నవజ్యోతి పట్నాయక్‌కు దరఖాస్తును అందజేస్తున్న కార్పొరేటర్ జక్కుల రవీందర్

'కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి'

భీమదేవరపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సీజేఐ గవాయ్‌పై దాడి యత్నాన్ని నిరసిస్తూ హనుమకొండ కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ కోరారు. ఆదివారం ముల్కనూర్‌లో దళిత సంఘాల నాయకుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత సంఘాల నాయకులు చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, కండె సుధాకర్, కొల్గూరి ఎల్లన్న, బోయిని రాజశేఖర్, వేముల జగదీష్ పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో కళాకారులదే కీలకపాత్ర


కళాకారులతో డాక్టర్ జి. మాస్టార్జీ

విశ్వజన కళా మండలి జాతీయ అధ్యక్షుడు మాస్టార్జీ

వడ్డెపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులదే కీలక పాత్ర అని విశ్వజన కళా మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.మాస్టార్జీ అన్నారు. ఆదివారం హనుమకొండలోని మాస్టర్ జీ కళాశాలలో విశ్వజన కళా మండలి కళాకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టార్జీ మాట్లాడుతూ.. వృద్ధ కళాకారులకు నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్ మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ, రైల్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కళాకారులకు ఇంటి స్థలాలను కేటాయించి ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విశ్వజన కళా మండలి 50 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని, ఇందుకోసం కమిటీని ఆయన ప్రకటించారు. వేడుకల కన్వీనర్‌గా డాక్టర్ బన్న ఐలయ్య, కో కన్వీనర్‌గా పసునూరి ప్రసంగి, సభ్యులుగా బొక్క రజితం, పి. రాములు, మంద స్వామి, దరిగి శ్రీని వాస్, సింగారపు అరుణ, కతాని సులోచనలను డాక్టర్ మాస్టార్జీ నియమించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వజన కళా మండలి ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా పోలెపాక యాదగిరి ప్రసాద్, కో కన్వీనర్‌గా బుంగా నర్సింగరావు, సభ్యులుగా లింగాల ఇమానియల్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా గడ్డం సుధాకర్, కో కన్వీనర్‌గా పారునంది రమేష్, ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా తాటికాయల కొమురయ్య, ఎండి మోహిమొద్దీన్, బైరపాక సురేష్, గద్దర్ సాంబయ్య, మానవ హక్కుల సంఘం కన్వీనర్‌గా డాక్టర్ బుంగా జ్యోతిరమణ, కో కన్వీనర్‌గా జి. కుమార్‌లను డాక్టర్ మాస్టార్జీ నియమించారు.

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 13 అక్టోబరు 2025

బహుళజాతి కంపెనీలో గ్లోబల్‌హెడ్‌గా ఉద్యోగం... ఏడు అంకెల జీతం, ఆకర్షణీయమైన జీవితం. వీటన్నిటినీ వదిలేసి అణగారిన వర్గాలకు సాయం చేయడంలో ఆత్మసంతృప్తిని వెతుక్కున్నారు బిందు వినోదన్. ఒడిశాలోని మారుమూల ప్రాంతాల్లో వందలాది మహిళలను సంపాదనపరులుగా మార్చడమే కాదు...దశాబ్దాల క్రితం ఆదరణ కోల్పోయిన కళకు కొత్త జీవం పోశారు.



ఆమె మౌన ధ్వని

"తొమ్మిదేళ్ళ క్రితం జరిగిన ఆ వేడుక ఇంకా నా కళ్ళలో మెదులుతోంది. ఒక బహుళజాతి కంపెనీలో సంస్థాగతమైన అభివృద్ధికి నేను అందించిన సేవలకు గుర్తింపుగా.. ఒక అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్నాను. ఇరవై రెండేళ్ళ వృత్తి జీవితంలో నా విజయాలకు చిహ్నంగా, గర్వకారణంగా దాన్ని పరిగణించాలి. కానీ నాకు అలా అనిపించలేదు. 'ఒక సంస్థ లక్ష్యాలకోసం పని చేయడం, వాటిని నెరవేర్చినందుకు అభినందనలు అందుకోవడం.. జీవితం అంటే ఇంతేనా? ఒక మనిషిగా నేను సాధించినదేమిటి?' అనే ప్రశ్న నన్ను వెంటాడింది.

చంపుతానని బెదిరించారు...

నేను కేరళలో పుట్టాను. ముంబాయిలో పెరిగాను. విద్యార్థిగా ఉన్నప్పుడే... శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకున్నాను. నాటకాలు వేసేదాన్ని. పుస్తకాలు చదవడం ఎంతో ఇష్టం. చదువులోనూ ఎప్పుడూ ఫస్ట్‌క్లాసే. ఇంజనీరింగ్ చదువుతూ ఉండగానే... పెళ్ళయింది. నా భర్త ప్రోత్సాహంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో.. ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాను. ఆ తరువాత మన దేశంలో, విదేశాల్లో పలు కార్పొరేట్ కంపెనీల్లో పని చేశాను. గ్లోబల్ హెడ్ స్థాయికి ఎదిగాను. అయితే ఆ జీవితం నాకు సంతృప్తిని కలిగించలేదు. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేశాను. మన దేశానికి తిరిగి వచ్చేశాను. బెంగళూరులోని ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి పని చేయడం ప్రారంభించాను. గ్రామీణ మహిళల కోసం ఏదైనా చేయాలనేది నా కోరిక.



అందుకే 2017లో 'మౌన ధ్వని ఫౌండేషన్' అనే సంస్థను స్థాపించాను. ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లాలోని చౌలిపోషి గ్రామంలో కార్యకలాపాలు ప్రారంభించాను. దేశంలో అత్యంత పేద గ్రామాల్లో అదొకటి. అక్కడ పాఠశాలలు లేవు, వైద్య సదుపాయాలు, మంచి నీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్ లేవు. ఉపాధికోసం చాలామంది పురుషులు వలసలు వెళ్ళారు. మహిళలు భూస్వాముల పొలాల్లో కట్టుబానిసల్లా పని చేయాలి. నేను స్థానిక మహిళలతో మాట్లాడాలని ప్రయత్నిస్తే.. గ్రామ పెద్దలు వారిని బెదిరించారు. ఈ సమయంలో గోవింద్ అనే యువ సామాజిక కార్యకర్త నాకు సాయపడ్డారు. కొందరు ఔత్సాహికులతో ఒక బృందం ఏర్పాటుకు సహకరించారు. మేము గ్రామ మహిళలతో సమావేశం నిర్వహించాం. వారి సమస్యలు తెలుసుకున్నాం. సాయం అందించడానికి ప్రయత్నాలు ప్రారంభించాం. ఈ సంగతి తెలిసి పెత్తందారులు ఆగ్రహించారు. నా కారును ధ్వంసం చేశారు. చంపేస్తానని బెదిరించారు. మా బృందం సభ్యుల మీద భౌతికంగా దాడి చేశారు. పోలీసులకు నా మీద ఫిర్యాదు చేశారు. పోలీసులు నన్ను ఒక రోజంతా స్టేషన్‌లో కూర్చోబెట్టి రకరకాలుగా ప్రశ్నించారు. మావోయిస్టుగా ముద్రవేసే ప్రయత్నం చేశారు. చివరకు ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టాలనుకున్నాను. అయితే గ్రామంలో మహిళలు నేను వెళ్ళడానికి వీల్లేదని పట్టుపట్టారు. నాకు రక్షణగా నిలుస్తామని చెప్పారు. అప్పుడు... ఇక వెనుకడుగు వేయకూడదని నిశ్చయించుకున్నాను.

సమస్యలు తీరుస్తూ...

ముందుగా... ఆ గ్రామంలోని ఎనిమిది మంది మహిళలకు ఉపాధి కల్పించి, ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేయాలనుకున్నాం. గొర్రెల పెంపకానికి సాయం అందించాం. అప్పటివరకూ గ్రామంలోని మహిళలు బహిర్భూమికోసం ఆరుబయలుకు వెళ్ళాల్సి వచ్చేది. మా బృందం వారికి తొలి టాయిలెట్‌ను నిర్మించి ఇచ్చింది. ఆ గ్రామం ఒకప్పుడు సంప్రదాయికమైన 'మయూర్‌భంజ్ సంతాలీ చేనేత కళ'కు పెట్టింది పేరు. ఎనభయ్యేళ్ళ క్రితం నుంచి క్రమంగా ఆ వైభవం క్రమంగా క్షీణించిపోయింది. ఆ నైపుణ్యం ఉన్న వ్యక్తి ఒక్కరే మిగిలారు. అతని నేతృత్వంలో మహిళలకు శిక్షణ అందించడం కోసం ఒక కేంద్రం ఏర్పాటు చేశాం. అలాగే ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి నిష్ణాతులైన శిక్షకులను తీసుకువచ్చాం. చుట్టుపక్కల గ్రామాల మహిళలు కూడా ఈ కేంద్రానికి వచ్చి నేర్చుకోవడం ప్రారంభించారు. పొలాల్లో పనులు మాని... శిక్షణకు రావడం వాళ్ళకు ఇబ్బందేనని నాకు తెలుసు. అందుకే దాదాపు 600 మంది మహిళలకు, వారి కుటుంబాలకు పోషకాహారాన్ని అందించడానికి 'నైవేద్య' అనే కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించాను. అలాగే వారికి స్టైఫండ్ ఇవ్వడంతో పాటు... వారి పిల్లల కోసం స్కూల్ ఏర్పాటు చేశాను. 'మౌన ధ్వని' ద్వారా శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ వారి పిల్లలను బడికి పంపడం తప్పనిసరి చేశాను. ఇది ఆ ప్రాంతంలో గణనీయమైన మార్పులను తీసుకువచ్చింది. 800 మందికి పైగా మహిళలు సంతాలీ చేనేతలో నిష్ణాతులయ్యారు. దీనివల్ల వారి కుటుంబాలకు ఆదాయం వస్తోంది. పిల్లల భవిష్యత్తుకు భరోసా ఏర్పడింది.



ఇప్పుడు సమాధానం ఉంది...

ఈ విజయం ఇచ్చిన స్ఫూర్తితో వివిధ ప్రాంతాల్లో 21 'మౌన ధ్వని' కేంద్రాలను ఏర్పాటు చేశాను. ప్రతి కేంద్రం రెండు మూడు గ్రామాల మహిళలను అనుసంధానం చేస్తుంది. చేనేత వస్త్రాలతో పాటు పర్యావరణ అనుకూలమైన బ్యాగ్‌లు, డెయిరీలు, ఇతర వస్తువులను తయారు చేయించి విక్రయిస్తున్నాం. వాటికి కార్పొరేట్ సంస్థల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. ఢిల్లీలోని కైరీ సమ్మర్ టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌లో తొలిసారిగా 'మయూర్‌భంజ్ సంతాలీ శారీ కలెక్షన్'ను ప్రదర్శించినప్పుడు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఇవేవీ అంత సులువుగా జరిగిపోలేదు. నేను ఉద్యోగం చేస్తున్నప్పుడు దాచుకున్న డబ్బును, ముంబాయిలో నా సొంత ఫ్లాట్‌ను, మా నాన్న నాకు ఇచ్చిన భూమిని అమ్మగా వచ్చిన మొత్తాలను ఈ ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేశాను. మా బృందంలో పనిచేసేవారి జీతాల కోసం ఇప్పటికీ నెలకు రెండు వారాలు కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను. కానీ ఇంతటి సంతృప్తిని ఇంతకుముందెప్పుడూ అనుభవించలేదు. 'మనిషిగా నేను సాధించినదేమిటి?' అని నన్ను వెంటాడిన ప్రశ్నకు... ఇప్పుడు నా దగ్గర సమాధానం ఉంది."

టీనేజ్ పిల్లలకు ఇవి చెప్పాలి...

శారీరక మార్పులు, హార్మోన్ల పనితీరు, పరీక్షల భారం లాంటి కారణాల వల్ల యుక్తవయసు పిల్లలు తరచూ ఆందోళనకు గురవుతూ ఉంటారు. అలాకాకుండా టీనేజ్ పిల్లలు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...


- ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటుతో టీనేజ్ పిల్లలు ఇబ్బంది పడుతున్నట్లయితే వారిని వెంటనే మానసిక నిపుణుడి దగ్గరకు తీసుకెళ్లాలి.
- సామాజిక మాధ్యమాలను వినియోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి యుక్తవయసు పిల్లలకు వివరంగా చెప్పాలి. స్క్రీన్ టైమ్‌కు సంబంధించి పరిమితులు పాటించేలా చూడాలి. సమయానుసారం నిద్రించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- రోజూ వ్యాయామం చేయాల్సిన ఆవశ్యకతను టీనేజర్లకు తెలియజెప్పాలి. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, డ్యాన్స్ చేసేలా వారిని ప్రోత్సహించాలి. యోగ లేదా ధ్యానం చేయడం అలవాటు చేయాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత గురించి టీనేజ్ పిల్లలకు అవగాహన కల్పించాలి. రోజూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలి. అమ్మాయిలకు రుతుక్రమం గురించిన పూర్తి సమాచారాన్ని అందించాలి.



- శిరోజాలు, చర్మం, గోళ్ల సంరక్షణ కోసం ప్రకృతి సహజమైన ఉత్పత్తులను మాత్రమే వాడడం మంచిదని పిల్లలకు తెలియజెప్పాలి. రసాయనాలతో నిండిన కాస్మొటిక్ ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను వివరించాలి.
- టీనేజ్ పిల్లలతో స్నేహంగా మెలగుతూ వారి అభిరుచులనూ ఆసక్తినీ గమనిస్తూ ఉండాలి. వాళ్లు ఇష్టపడే కళలు, వృత్తి విద్యలు, ఇతర సాంకేతిక విభాగాల్లో నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇప్పించాలి.
- మంచి నడవడికతో పాటు పెద్దలతో గౌరవంగా మెలగడం, తోటివారితో స్నేహంగా ఉండడం, సానుకూల దృక్పథం అలవాటు చేయాలి.

వార్తల్లో వ్యక్తి

మలాలా.. ఓ ప్రేమ కథ!



నోబెల్ బహుమతి గ్రహీత మలాలా యూసఫ్జాయి, ప్రేమించిన వ్యక్తిని పెళ్లాడి ఇప్పటికి నాలుగేళ్లు. ఇంత కాలం తర్వాత మలాలా తన వ్యక్తిగత జీవితం గురించి, భర్త యాసర్ మాలిక్‌తో తన తొలినాళ్ల అనుబంధం గురించీ 'ఫైండింగ్ మై వే' అనే జీవిత చరిత్రలో వివరించింది. అక్టోబరు 21న విడుదల కాబోతున్న ఈ పుస్తకంలో మలాలా పంచుకున్న మధురస్మృతులు ఇవే!

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకునే సమయంలో 35 ఏళ్ల యాసర్ మాలిక్‌తో గోప్యంగా డేటింగ్ చేయడంలో ఎదుర్కొన్న సవాళ్లను మలాలా తన జీవితకథలో వివరించింది. ఆక్స్‌ఫర్డ్‌లో థర్డ్ టర్మ్ చదువుతున్న సమయంలో, తన జీవితంలోకి యాసర్ రాకతో చీకటి మేఘాలన్నీ వీడిపోయాయనీ, కానీ తమది టివిల్లో చూపించే రొమాంటిక్ కామెడీ కథ కాదనీ, స్వేచ్ఛాయుతమైన ప్రేమకలాపం అంతకంటే కాదనీ వివరించింది మలాలా. ఒకానొక సందర్భంలో తామిద్దరూ కలిసి బయటకు వెళ్లినప్పుడు ఎదుర్కొన్న ఒక సంఘటనను వివరిస్తూ.. "మేమిద్దరం చెట్టాపట్టాలేసుకుని నడుస్తున్నాం. అకస్మాత్తుగా ఒక మహిళ నన్ను గుర్తుపట్టి వెంటనే ఫోన్ బయటకు తీసి నాతో ఫొటో తీసుకునే ప్రయత్నం చేసింది. కానీ మాది రహస్య ప్రేమ. యాసర్‌తో స్నేహం చేస్తున్నానని మా తల్లితండ్రులకు తెలియదు. కాబట్టి నేను రోడ్డు పక్కనే ఉన్న పొద చాటుకు పరిగెత్తాను. యాసర్, నా భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమైపోయారు" అంటూ పుస్తకంలో రాసుకుంది మలాలా.

సెక్స్ బాంబ్ అన్నప్పుడు...

ప్రేమించిన వ్యక్తిని కలుసుకోబోయే ఘడియలు ప్రతి ఒక్కరికీ మధురమైనవే! అలా ఒక రోజు యాసర్‌ను కలుసుకోబోతూ, తల్లి ఆమోదం పొందిన సంప్రదాయ సల్వార్ కమీజ్ దుస్తులు ధరించింది. కానీ మలాలాకు ఆధునిక దుస్తులు ధరించాలనే కోరిక ఉంది. అది ఇంట్లో సాధ్యపడదు కాబట్టి అందుకొక ప్రణాళిక రచించుకుంది. ఆ ప్రణాళికలో భాగంగా యాసర్‌ను హోటల్‌లో కలిసిన తర్వాత, అతన్నుంచి ఐదు నిమిషాలు బ్రేక్ తీసుకుని, గులాబీ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్, హైహీల్స్‌తో తిరిగొచ్చింది. ఆ సందర్భం గురించి ప్రస్తావిస్తూ... "టేబుల్ దగ్గరకు తిరిగొస్తున్న నన్ను చూసి యాసర్ చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వును నేను అంతకుముందెప్పుడూ చూడలేదు. నా కోసం కుర్చీ లాగి, 'నువ్వొక సెక్స్ బాంబ్‌వి' అని నా చెవిలో గుసగుసగా చెప్పాడు. ఆ మాట వినగానే సిగ్గును దాచుకోలేక, డిన్నర్ న్యాప్కిన్‌లో ముఖం దాచేసుకున్నాను" అంటూ మధురమైన జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంది మలాలా.



తల్లితండ్రులు వ్యతిరేకించినా...

ప్రేమ సంగతి పెద్దల దృష్టికి తీసుకువెళ్లి, వాళ్ల అంగీకారం పొందడమన్నది ఏ అమ్మాయికైనా ఒక గండంగానే ఉంటుంది. మలాలా కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంది. ఆ సందర్భం గురించి వివరిస్తూ... "నాన్న నా మాటెప్పుడూ కాదనరు. కాబట్టే ఈ విషయాన్ని ముందుగా నాన్నకే చెప్పాలనుకున్నాను. 'నాకు అతనంటే ఇష్టం నాన్నా. నాకు అతనంటే ఎంతో ప్రేమ' అని చెప్పి, ఈ విషయం అమ్మతో చెప్పకండి అని కూడా అభ్యర్థించాను. కానీ నాన్న ఏమాత్రం ఆలస్యం చేయకుండా అమ్మకు కాల్ చేసి, చెప్పేశారు. అవతలి వైపు అమ్మ గొంతు నాకు స్పష్టంగా వినిపిస్తోంది. 'నేనిది ఒప్పుకోను. అసలతను పష్తో మాట్లాడగలుగుతాడా? మలాలా, పష్తూన్ వ్యక్తినే పెళ్లాడాలి' అంటూ అమ్మ గట్టిగా అరుస్తోంది. పరిస్థితి ఇంత తీవ్రంగా మారిపోతుందని నేను ఊహించలేదు. వెంటనే మాలిక్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాను. నా తల్లితండ్రులు అపవాదు గురించి కంగారుపడ్డారు. అతన్ని కలవడం మానేయమని నన్ను ఆదేశించారు. కానీ నేనది చేయలేను. కానీ తల్లితండ్రుల కారణంగా మా అనుబంధం ఆందోళనకరంగా మారిపోవడం నాకు నచ్చలేదు. దాంతో ఆక్స్‌ఫర్డ్ చదువు పూర్తయ్యేవరకూ, కొంత కాలం పాటు ప్రేమ వ్యవహారాన్ని పక్కన పెట్టేద్దామని మాలిక్‌ను అడిగాను. అందుకతను... 'ప్రేమ భావాలు అలా ఆగేవి కావు. కానీ నేనందుకు ప్రయత్నిస్తాను' అని సమాధానమిచ్చాడు. కానీ అది మా ఇద్దరికీ సాధ్యపడే పని కాదని తెలుసు" అంటూ ప్రేమలో ఎదుర్కొన్న సవాళ్ల గురించి వివరించింది మలాలా. ఇన్ని సవాళ్లు ఎదురైనా వాళ్లు అవరోధాలన్నిటినీ అధిగమించి, అంతిమంగా 2021, నవంబరులో ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హ్యామ్‌లో పెళ్లితో ఒక్కటయ్యారు.

మహిళలకు స్వీయరక్షణే ఆయుధం!

'బాలికపై అత్యాచారం'.. 'మహిళకు లైంగిక వేధింపులు' వంటి వార్తలను మనం ప్రతి రోజూ వార్తల్లో చూస్తూ ఉంటాం. మహిళలు తమను తాము రక్షించుకోగలిగితే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ స్వీయ రక్షణకు సంబంధించిన మెళుకువలను మహిళలకు చీరాలకు చెందిన బూదాటి బాలశంకర్ బోధిస్తున్నారు. ఇప్పటి దాకా ఆయన దగ్గర వందల మంది మహిళలు శిక్షణ పొందారు.



తోటవారి పాలెంకు చెందిన బూదాటి బాలశంకర్ ఒక సామాన్యమైన చేనేత కార్మికుడు. కానీ చిన్నప్పటి నుంచి ఆయనకు యుద్ధ విద్యలంటే ఆసక్తి. చిన్నప్పుడే కర్రసాము, కత్తిసాము వంటివి నేర్చుకున్నాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవటంతో ఆయన చేనేత వృత్తిలోనే కొనసాగాల్సి వచ్చింది. ప్రతి రోజూ మన చుట్టూ ఉన్న సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆయనపై తీవ్రమైన ప్రభావాన్ని చూపించాయి. వారికి ఆత్మస్థైర్యం కల్పిస్తే- తమను అత్యవసర పరిస్థితుల్లో తమను తాము కాపాడుకోగలరని భావించాడు. ఒక వైపు తన వృత్తి ద్వారా జీవితాన్ని గడుపుతూనే మరో వైపు అనేక మంది మహిళలకు ఈ యుద్ధ విద్యలలో శిక్షణ ఇవ్వటం మొదలుపెట్టారు. ఆయన దగ్గరకు ప్రతి రోజు అన్ని వర్గాలకు చెందిన అనేక మంది మహిళలు యుద్ధ విద్య నేర్చుకుంటూ ఉంటారు.

వయస్సుతో సంబంధం లేదు..

ఆత్మ రక్షణ విద్యలు నేర్చుకోవటానికి వయస్సుతో పని లేదని.. ఎవరైనా నేర్చుకోవచ్చంటారు శంకర్. ఆత్మరక్షణ కోసం అనేక విద్యలు అందుబాటులో ఉన్నా- కర్రసాము, కత్తిసాము, గరిడిలను నేర్చుకుంటే ప్రయోజనం ఎక్కువగా ఉంటుందంటారాయన. అందుకే తన దగ్గరకు వచ్చే వారికి కర్రసాము, కత్తిసాము నేర్పిస్తారు. ఈ రెండింటిలోను మౌలికమైన పద్ధతులు తెలుసుకోవటానికి సుమారు మూడు నెలలు పడుతుంది. పై మూడు విద్యల్లో సంపూర్ణ నైపుణ్యం సంపాదించటానికి కనీసం ఐదేళ్లు పడుతుంది. "సుమారు 30 ఏళ్లుగా శిక్షణ అందిస్తున్నాను. నేను విద్యను నేర్పటం వల్ల రెండు రకాల ప్రయోజనాలున్నాయి. మొదటిది మహిళలు తమను తాము రక్షించుకోగలుగుతారు. రెండోది ఈ విద్యలు అంతరించిపోకుండా ఒక తరం నుంచి మరొక తరానికి అందుతాయి" అంటారు శంకర్. స్వీయ రక్షణ విద్యలు నేర్చుకోవటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా రకరకాల వృత్తులకు చెందిన మహిళలు వస్తూ ఉంటారు. "రోజు భయపడుతూ బతకలేం. అయినా మనపై ఎవరైనా దాడి చేసినప్పుడు ఎదురుతిరగకపోవటం చేతకానితనమవుతుంది. అవతల వ్యక్తికి బుద్ధి చెప్పాలంటే- మనకు ఈ తరహా విద్యలు రావాలి. అప్పుడే మనను మనం రక్షించుకోగలం" అంటారు లెక్చరర్‌గా పనిచేస్తున్న ఉదయభాను. ఈ స్వీయరక్షణ శిక్షణ కాలేజీలో చదువుతున్న వారికి చాలా ముఖ్యం. అమ్మాయిలు కాలేజీలకు వెళ్లే సమయంలో అనేక రకాల వేధింపులు ఎదురవుతూ ఉంటాయి. ఆ సమయంలో వారిలో అభద్రత భావం ఏర్పడితే కాలేజీకి వెళ్లటానికి కూడా భయపడుతారు. వారి భవిష్యత్తుకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాంటి వారికి ఈ స్వీయరక్షణ విద్యలు ఎంతో ఉపకరిస్తాయి. "ఒకప్పుడు కాలేజీకి వెళ్లాలంటే ఎవరైనా ఏదైనా అంటారేమోనని భయమేసేది. కుటుంబసభ్యులు ఎంత ధైర్యం చెప్పినా మనసు మూలల్లో ఎక్కడో చిన్న భయం ఉండేది. స్వీయరక్షణ పద్ధతులు తెలుసుకున్న తర్వాత ధైర్యం పెరిగింది. ఏడాది నుంచి నేను ఈ విద్యలలో శిక్షణ పొందుతున్నాను. ఇప్పుడు ఎవరైనా నాపై దాడి చేసిన తిప్పికొట్టగలను" అంటారు డిగ్రీ చదువుతున్న చంద్రకళ. కొందరు మహిళలైతే వారు శిక్షణ పొందటంతో పాటుగా తమ పిల్లలను కూడా వెంట తీసుకువస్తున్నారు. "ప్రస్తుతం నేను కర్రసాము నేర్చుకుంటున్నాను. చాలా మంది మహిళలు కర్రసాము నేర్చుకోవటమేమిటనే ఆలోచనలో ఉంటారు. కానీ కర్రసాము నేర్చుకోవటానికి ఎవరు సిగ్గుపడాల్సిన అవసరం లేదు. చాలా ధైర్యంగా అనిపిస్తుంది" అంటారు శివకుమారి అనే ప్రైవేట్ ఉద్యోగిని. ప్రతి గ్రామంలో మహిళలకు ఈ తరహా శిక్షణ ఇచ్చేవారు ఉండాలని ఆశిద్దాం.



• తాళ్లూరి ప్రదీప్, చీరాల

మేకప్


అందమైన పెదవుల కోసం..

పెదవులు మీద అద్దుకున్న లిప్‌స్టిక్ తరచూ చెరిగిపోతూ ఉంటే అది పెద్ద చికాకే! తరచూ టచప్స్ చేసుకుంటూ, లిప్‌స్టిక్ మీద ఓ కన్నేసి ఉంచడం కష్టం కాబట్టి ఇదుగో ఈ లిప్‌స్టిక్స్ నియమాలను పాటించండి

క్రీమ్స్, లిక్విడ్స్.. ఇలా లిప్‌స్టిక్స్ రెండు రూపాల్లో దొరుకుతాయి. ప్రస్తుతం ద్రవరూప లిప్‌స్టిక్స్ ట్రెండ్ నడుస్తోంది. ఇది ట్రాన్స్‌ఫర్ ప్రూఫ్ కూడా! ఒకసారి పెదవులకు అద్దుకుంటే చాలు. ఇక రోజంతా దాని గురించి మర్చిపోవచ్చు. లాంగ్ వేర్ లిప్‌స్టిక్‌లో శాటిన్, మ్యాట్ రకాలుంటాయి. పెదవుల అంచున ఏదైనా కన్సీలింగ్ లేదా పౌడర్ ఉంటే వాటిని బ్లాటింగ్ పేపర్‌తో తొలగించి ఈ లిప్‌స్టిక్ వేసుకోవాలి. దీంతో లిప్‌స్టిక్ ఎక్కువ సేపు నిలిచి ఉంటుంది. అలాగే లాంగ్‌లాస్టింగ్ లిప్ పెన్సిల్‌తో అదనపు భద్రత దక్కుతుంది. దీనికి తోడు పెదవుల అంచున ట్రాన్స్‌ల్యూసెంట్ పౌడర్ అద్దుకుంటే, లిప్‌స్టిక్ పెదవులకే కట్టుబడి, అంచులు దాటకుండా ఉంటుంది. లిప్‌స్టిక్ చెదరకుండా ఉండడం కోసం పాటించవలసిన ఇంకొన్ని నియమాలు ఏవంటే...



- లిప్‌స్టిక్ వేసుకునే ముందు, పెదవులను స్క్రబ్ చేసుకోవాలి. గులాబీ రేకులు, పాలు కలిపి, ముద్ద చేసి పెదవులకు పూసుకుని, ఆరిన తర్వాత వేలితో మృదువుగా రుద్దుతూ మృతకణాలను వదిలించుకోవాలి
- పెదవులకు లిప్ బామ్ లాంటివి పూసుకుంటే, వాటిని పూర్తిగా వదిలించుకోవాలి
- నాణ్యమైన లిప్ లైనర్ పెన్సిల్‌తో పెదవులను అందంగా తీర్చిదిద్దుకోవాలి
- లిప్‌లైనర్ లిప్‌స్టిక్ కంటే రెండు రెట్లు ముదురు రంగులో ఉండేలా చూసుకోవాలి
- పెదవుల అంచుల నుంచి మొదలుపెట్టి మధ్య వైపుకు లిప్‌స్టిక్ బ్రష్‌ను కదిలించాలి
- లిప్ లైనర్, లిప్‌స్టిక్ కలిసిపోయేలా ఉండాలే తప్ప, వేర్వేరుగా కనిపించకూడదు
- లిప్‌స్టిక్ వేసుకున్న తర్వాత, బ్లాటింగ్ పేపర్‌తో అదనపు లిప్‌స్టిక్ తొలగించుకోవాలి



ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026 కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే, టెలికాం, డిఫెన్స్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఇంజనీరింగ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఇంజనీరింగ్ సర్వీసులో సివిల్స్ లాంటి పోస్టులు ఇవి.

ఖాళీలు 474

UPSC

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్

విద్యార్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ తదితర అర్హతలు ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: స్టేజ్ - 1 ప్రిలిమినరీ పరీక్ష, స్టేజ్-2లో మెయిన్ పరీక్ష ఉంటుంది. స్టేజ్-3లో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది. తరువాత మెడికల్ ఎగ్జామినేషన్ కూడా ఉంటుంది.

ప్రిలిమినరీ పరీక్ష: రెండు ఆబ్జెక్టివ్ టైప్(మల్టిపుల్ చాయిస్) తరహా ప్రశ్న పత్రాలు ఉంటాయి. ఇవి 500 మార్కులకు ఉంటాయి. ఇందులో 200 మార్కులకు పేపర్-1 ఉంటుంది. దీనిని రెండు గంటల్లో పూర్తి చేయాలి. 300 మార్కులకు పేపర్-2 ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ఇందులో కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్టులపై ప్రశ్నలు ఉంటాయి. అలాగే నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

మెయిన్స్ పరీక్ష: ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ పరీక్ష. ప్రిలిమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారిలో 1:6 లేదా 1:7 మందిని మెయిన్స్‌కు పిలుస్తారు. అంటే యావరేజీగా 2844 నుంచి 3318 మందికి మెయిన్స్ రాసే అవకాశం లభించవచ్చు. ఇందులో కూడా రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరుకు 300 మార్కులు. ఇవి పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పేపర్లు. ఒక్కో పేపర్ వ్యవధి మూడు గంటలు.

ఇంటర్వ్యూ: చివరగా ఇంటర్వ్యూ ఉంటుంది. దీనికి 200 మార్కులు కేటాయించారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనిలో అభ్యర్థుల ఆలోచించే తీరు, తెలివి తేటలు, నాయకత్వ లక్షణాలను పరిశీలిస్తారు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 16

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 8

మెయిన్స్ పరీక్ష: 2025 జూన్ 21

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

దిక్సూచి

నవోదయ విద్యాలయాల దరఖాస్తు గడువు అక్టోబర్ 21

జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో 9వ, 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి(లేటర్ ఎంట్రీ)కి దరఖాస్తుల గడువు 2025 అక్టోబర్ 21. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఆధునిక విద్యను అందించడం జేఎన్‌వీల ముఖ్య ఉద్దేశం.

- దేశ వ్యాప్తంగా 653 జేఎన్‌వీలు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు 9 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తారు. విద్యార్థి తను దరఖాస్తు చేయాలనుకున్న జిల్లా స్థానిక అభ్యర్థి అయి ఉండాలి. ఆయా జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతూ ఉండాలి.

పరీక్ష: మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. రెండున్నర గంటల్లో సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది.

పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 7

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1/

ఇండియన్ రైల్వేల్లో ఉద్యోగాలు

నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్)

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు 8050 ఉద్యోగాలతో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్) సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 5000 పోస్టులు గ్రాడ్యుయేట్, 3050 పోస్టులు అండర్ గ్రాడ్యుయేట్ ఉన్నాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 21 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 28 నుంచి ప్రారంభం అవుతాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 20, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 27.

- గ్రాడ్యుయేట్ స్థాయి పోస్టులలో గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్ వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్ ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, రైళ్ల క్లర్క్ ఖాళీలు ఉన్నాయి.

వయస్సు: గ్రాడ్యుయేట్ పోస్టులకు 18 నుంచి 33, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు 16-33 ఏళ్ల లోపు ఉండాలి. జోన్లు, విభాగాల వారీగా ఖాళీలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది.



జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్

భారతీయ రైల్వే 2570 పోస్టులతో మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే డివిజన్లలో ఉన్న కింద పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులను కోరుతోంది.

పోస్టులు: జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్.

(పూర్తి వివరాలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది. దీని కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌ను తరచూ చెక్ చేసుకుంటూ ఉండాలి.)

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2026 జనవరి 1 నాటికి 18-33 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తులు ప్రారంభం: 2025 అక్టోబర్ 30

చివరి తేదీ: 2025 నవంబర్ 30

రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబాయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం,

వెబ్‌సైట్: https://rrbsecunderabad.gov.in/



ఢిల్లీ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 509

ఢిల్లీ పోలీస్ విభాగంలో 509 హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఆసక్తిగల స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు:

- హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) మేల్: **341**
- హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) ఫీమేల్: **168**

వయస్సు: 2025 జూలై1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్

చివరి తేదీ: 2025 అక్టోబర్ 20

పరీక్ష తేదీ: 2025 డిసెంబర్/ 2026 జనవరి

వెబ్‌సైట్: https://ssc.gov.in

జర్నలిజం కోర్సులో అడ్మిషన్లు

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో 2025-26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అందించే ఈ కోర్సులు అభ్యర్థులు తమ ఆసక్తిని బట్టి రెగ్యులర్, కరస్పాండెన్స్ పద్ధతిలో చదవవచ్చు.

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. కనీసం విద్యార్హత పదో తరగతి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 18

ఫోన్: 98485 12767, 7286013388

వెబ్‌సైట్: www.apcj.in

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

సెన్సార్ పూర్తి



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా' సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సిద్ధు సరసన శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

అఖండ 2కు మరో ఆకర్షణ





బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అఖండ' చిత్రానికి బాలకృష్ణ నటనతో పాటు తమన్ నేపథ్య సంగీతం సైతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకొంది. ఇప్పుడు మరోసారి 'అఖండ 2' కోసం తమన్ రంగంలోకి దిగారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం బ్యాగ్రౌండ్ స్కోర్‌ను ప్రారంభించారు. సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యంతో ప్రసిద్ధి చెందిన పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులు ఇద్దరూ నేపథ్య సంగీతం కోసం తమ అద్భుతమైన గాత్రంతో సంస్కృత శ్లోకాలను, వేద మంత్రాలను పఠించనున్నారని తమన్ తెలిపారు. వారితో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఈ చిత్రంలో సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి విలన్ పాత్ర పోషిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలకపాత్రలో కనిపించనున్నారు.

అంచనాలు రెట్టింపు



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు పి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ టీజర్‌ని రిలీజ్ చేశారు. సినిమాలను, ఆంధ్ర కింగ్‌ను ఆరాధించే పాత్రలో రామ్ ఒదిగి పోయారు. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేశ్, తులసి బాగా నటించారు. ఆసక్తికర సంభాషణలతో మురళీ శర్మ ఆకట్టుకున్నారు. కాగా, ఈ చిత్రంలో ఉపేంద్ర ఆన్ స్ర్కీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. మొత్తానికి టీజర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

శ్రీకాంత్ అయ్యంగార్ క్షమాపణలు



మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్.. ఆదివారం సోషల్‌మీడియా వేదికగా క్షమాపణలు తెలిపారు. ఇటీవల నేను చేసిన కొన్ని వ్యాఖ్యలు మీ మనోభావాలను దెబ్బతీశాయి. అది నా ఉద్దేశం కాదు. మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమాపణలు. అలాగే, మన దేశానికి స్వాతంత్ర్యం అందించడం కోసం పాటుపడిన మహావీరులందరికి మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను. జై హింద్ అని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌పై 'మా'లో ఫిర్యాదు

మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు శ్రీకాంత్ అయ్యంగార్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలె సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆయన మా (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణుకు శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ అనేది అందరికీ ఈ కాలంలో ఓ ఫ్యాషన్‌గా మారిపోయింది. 'మా' క్రమశిక్షణ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటాం' అని 'మా' జనరల్ సెక్రటరీ శివబాలాజీ అన్నారు.

మోగ్లీ రాక ఖరారు



రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్ రాజ్ తెరకెక్కిస్తోన్న 'మోగ్లీ 2025' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తోన్న ఈ చిత్రం డిసెంబరు 12న విడుదల కానుంది. ఇప్పటికే నాని వాయిస్ ఓవర్‌తో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. రోషన్ సరసన సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటిస్తున్నారు. బండి సరోజ్ కుమార్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు.

అట్టహాసంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. 'లాపతా లేడీస్' ఉత్తమ చిత్రంగా పురస్కారం అందుకుంది. అత్యధికంగా 13 అవార్డులు దక్కించుకుని సత్తా చాటింది. ఆ సినిమాను తెరకెక్కించిన కిరణ్‌రావు ఉత్తమ దర్శకురాలుగా అవార్డును స్వీకరించారు. 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తిక్ ఆర్యన్, 'ఐ వాంట్ టూ టాక్' చిత్రానికి గాను అభిషేక్ బచ్చన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. 'జిగ్రా' సినిమాకు గాను ఉత్తమ నటిగా ఆలియా భట్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమానికి షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. 17 ఏళ్ల తర్వాత షారుక్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం విశేషం. కాజోల్‌తో కలసి స్టెప్పులేసి అందర్నీ ఆకట్టుకున్నారు. తన ప్రదర్శనతో జీనత్ అమన్‌కు నివాళినిచ్చారు కృతిసనన్.





షారుక్ ఖాన్, కాజోల్



నితాన్షీ గోయెల్



ప్రతిభ

అవార్డులు అందుకున్న మరికొందరి వివరాలు

- **ఉత్తమ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్):** రాజ్‌కుమార్ రావు (శ్రీకాంత్)
- **ఉత్తమ నటి (క్రిటిక్స్ ఛాయిస్):** ప్రతిభ (లాపతా లేడీస్)
- **ఉత్తమ సహాయ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్):** రవి కిషన్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ సహాయ నటి (క్రిటిక్స్ ఛాయిస్):** ఛాయా కదమ్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ చిత్రం:** ఐ వాంట్ టూ టాక్ (సూజిత్ సర్కార్)
- **ఉత్తమ పరిచయ నటుడు:** లక్ష్య (కిల్)
- **ఉత్తమ పరిచయ నటి:** నితాన్షీ గోయెల్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ స్ర్కీన్‌ప్లే:** నేహా దేశాయ్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ కథ:** ఆదిత్య ధర్, మోనాల్ థాక్కర్ (ఆర్టికల్ 370)



ఆలియ భట్

నటి డయాన్ కీటన్ కన్నుమూత



ఆస్కార్ విజేత, హాలీవుడ్ దిగ్గజ నటి డయాన్ కీటన్(79) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం తుదిశ్వాస విడిచారు. దాదాపు ఐదు దశాబ్దాలు తన నట జీవితాన్ని కొనసాగించిన ఆమె హాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆమె నటించిన 'అనీ హాల్' సినిమాకు ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. 'ది గాడ్‌ఫాదర్' సిరీస్ ఆమెకు గ్లోబల్ స్టార్‌డమ్‌ని తెచ్చిపెట్టింది. డయాన్ ధరించిన ప్రత్యేకమైన సూట్లూ, టోపీలు ఫ్యాషన్ ప్రపంచంలో ఓ కొత్త ఒరవడిని సృష్టించాయి.

ఆలోచింపజేసే చిత్రం

రోహిణి హట్టంగడి, రోహిణి ముల్లేటి, సముద్రఖని, హిమాంశు పోహూరి, సౌమ్య, అనన్య నన్నపనేని ప్రధాన పాత్రధారులుగా అక్కినేని కుటుంబరావు తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఒక మంచి ప్రేమ కథ'. హిమాంశు పోహూరి నిర్మాత. ఈ మూవీకి కథ, మాటలు, పాటల్ని ఓల్గా అందించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. చిత్ర దర్శకుడు అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ 'కోట్లు సంపాదించేందుకు పరుగులు పెడుతున్నారు. కానీ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదు. అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా నవ్విస్తూ,



ఏడ్పించేలా సినిమా తీశాను' అని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ 'పెద్దవాళ్లందరూ కలిసి నటించిన చిత్రమే అయినా ఇది యువతరానికి సంబంధించిన కథ' అని చెప్పారు. నిర్మాత హిమాంశు పోహూరి మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నటి రోహిణి హట్టంగడి, నటి రోహిణి ముల్లేటి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షకుడి కథ



మాస్టర్ మహేంద్రన్, అంబికావాణి ప్రధాన పాత్రధారులుగా వైకుంఠ్ బోను తెరకెక్కిస్తోన్న చిత్రం 'వసుదేవసుతం'. రెయిన్‌బో సినిమాస్ బేనర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని కథానాయకుడు సత్యదేవ్ ఆవిష్కరించారు. 'ఈ కథ.. ధర్మానికి అడ్డొస్తే..మేనమామ అయినా, లక్షల బంధుగణమైనా, ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా...ధర్మ హింస తథైవచ అన్న శ్రీకృష్ణుడిదే కాదు. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణహోమానికైనా ఎదురెళ్లే ఓ యువకుడిది ' అనే శక్తిమంతమైన సంభాషణలతో ప్రారంభమైన టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి డీఓపీ : జిజ్జు సన్నీ, సంగీతం: మణిశర్మ.


క్యాంప్‌బెల్ (87 బ్యాటింగ్)
షాయ్ హోప్ (66 బ్యాటింగ్)

ఫాలో ఆన్‌లో..

క్యాంప్‌బెల్, హోప్ అజేయ అర్ధ శతకాలు

కరీబియన్ల అనూహ్య పోరాటం

● విండీస్ 173/2
● తొలి ఇన్నింగ్స్‌లో 248 ఆలౌట్
● భారత్‌తో రెండో టెస్ట్

కుల్దీప్‌నకు ఐదు వికెట్లు

న్యూఢిల్లీ: ఊదేస్తామనుకొన్న భారత్‌కు.. ఫాలో ఆన్ ఆడుతున్న వెస్టిండీస్ కౌంటర్ అటాక్‌తో ఎదురు నిలిచింది. జాన్ క్యాంప్‌బెల్ (87 బ్యాటింగ్), షాయ్ హోప్ (66 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. విండీస్ ఆటను నాలుగో రోజుకు తీసుకెళ్లింది. 97 పరుగుల వెనుకంజలో ఉన్న కరీబియన్లు టీమిండియా ఇన్నింగ్స్ విజయాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడిన విండీస్.. ఆదివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 173/2 స్కోరు చేసింది. చేతిలో ఇంకా 8 వికెట్లు ఉండడంతో.. భారత్‌కు లక్ష్యాన్ని నిర్దేశించే దిశగా సాగుతోంది. ఓపెనర్ తేజ్‌నరైన్ చందర్‌పాల్ (10)ను సిరాజ్ పెవిలియన్ చేర్చగా.. అలిక్ అథనజె (7)ను సుందర్ బౌల్డ్ చేశాడు. అయితే, మరో ఓపెనర్ క్యాంప్‌బెల్, హోప్ మూడో వికెట్‌కు 138 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఎదురుదాడి చేశారు. ఈ క్రమంలో విండీస్ తరఫున ఈ ఏడాది అత్యధిక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 140/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ 248 పరుగులకు కుప్పకూలింది. షాయ్ హోప్ (36), అండర్సన్ ఫిలిప్స్ (24 నాటౌట్), కేరీ పియర్రీ (23) కొంతసేపు క్రీజులో నిలిచారు. కుల్దీప్ ఐదు, జడేజా మూడు వికెట్లు పడగొట్టారు. అయితే, టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగకుండా వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించింది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసింది.


కుల్దీప్ (5/82)

1 చేజ్-హోల్డర్ తర్వాత భారత్‌తో టెస్ట్‌లో ఒక పూర్తి సెషన్ బ్యాటింగ్ చేసిన జంటగా క్యాంప్‌బెల్-హోప్. 2016లో కింగ్‌స్టన్‌లో జరిగిన టెస్ట్‌లో ఐదో రోజు ఆఖరి సెషన్‌లో 19 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఛేజ్-హోల్డర్ విండీస్‌ను డ్రాతో గట్టెక్కించారు.

లిప్‌బామ్ ఫ్రెండ్లీ గొడవ..

ఎటువంటి మ్యాచ్ ఒత్తిడీ లేకపోవడంతో ఫీల్డింగ్ చేస్తున్న భారత ఆటగాళ్లు ఎంతో సరదాగా కనిపించారు. జడేజా జోకులు పేలుస్తుంటే.. కుల్దీప్ వికెట్ పడగొట్టినప్పుడల్లా జైస్వాల్.. గిల్‌తో సంబరాలు చేసుకొన్నాడు. స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రాహుల్.. జేబులోంచి లిప్ బామ్ తీసుకొని రాసుకొన్నాడు. కొంచెం ఆవలగా నిలబడిన గిల్.. రాహుల్ వద్దకు వచ్చి ఏదో అనడంతో రాహుల్ కూడా సరదాగా తిరిగి కౌంటర్ ఇచ్చాడు. ఆ తర్వాత ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ సీన్ అభిమానుల దృష్టిలో పడడంతో.. నెట్‌లో వైరల్ అయింది.

1 భారత పర్యటనలో గత మూడు ద్వైపాక్షిక సిరీస్‌ల్లో.. ఆడిన ఆరు టెస్ట్‌ల్లో ఒక మ్యాచ్‌ను వెస్టిండీస్ నాలుగో రోజుకు తీసుకెళ్లడం ఇదే తొలిసారి.

జేడెన్ సీల్స్‌కు జరిమానా



క్రమశిక్షణను ఉల్లంఘించిన విండీస్ పేసర్ సీల్స్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతోపాటు ఓ డిమెరిట్ పాయింట్‌ను అతడి ఖాతాలో చేర్చారు. భారత తొలి ఇన్నింగ్స్ 29వ ఓవర్‌లో తన బౌలింగ్‌లోనే బంతిని ఆపిన సీల్స్.. బ్యాటర్ జైస్వాల్‌వైపు విసిరేశాడు. అయితే, బంతి జైస్వాల్ ప్యాడ్‌లకు బలంగా తాకింది. దీంతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో ఆర్టికల్ 2.9 కింద అతడిపై మ్యాచ్ రెఫరీ చర్యలు తీసుకొన్నాడు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 134.2 ఓవర్లలో 518/5 డిక్లేర్.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 10, చందర్‌పాల్ (సి) రాహుల్ (బి) జడేజా 34, అథనజె (సి) జడేజా (బి) కుల్దీప్ 41, హోప్ (బి) కుల్దీప్ 36, చేజ్ (సి అండ్ బి) జడేజా 0, టెవిన్ ఇమ్లాచ్ (ఎల్బీ) కుల్దీప్ 21, గ్రీవ్స్ (ఎల్బీ) కుల్దీప్ 17, కరీ పైర్రీ 23, వారికన్ (బి) సిరాజ్ 1, ఫిలిప్స్ (నాటౌట్) 24, జేడెన్ సీల్స్ (ఎల్బీ) కుల్దీప్ 13; **ఎక్స్‌ట్రాలు: 28; మొత్తం: 81.5 ఓవర్లలో 248 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-21, 2-87, 3-106, 4-107, 5-156, 6-163, 7-174, 8-175, 9-221, 10-248; **బౌలింగ్:** బుమ్రా 14-4-40-1, సిరాజ్ 9-2-16-1, జడేజా 19-5-46-3, కుల్దీప్ యాదవ్ 26.5-4-82-5, సుందర్ 13-2-41-0.

వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (బ్యాటింగ్) 87, చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10, అథనజె (బి) సుందర్ 7, హోప్ (బ్యాటింగ్) 66; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 49 ఓవర్లలో 173/2; వికెట్ల పతనం:** 1-17, 2-35; **బౌలింగ్:** సిరాజ్ 6-2-10-1, జడేజా 14-3-52-0, సుందర్ 13-3-44-1, కుల్దీప్ 11-0-53-0, బుమ్రా 4-2-9-0, జైస్వాల్ 1-0-3-0.

661 పరుగులు.. భారత్-ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్ల బాదుడుకు విశాఖ స్టేడియంలో పరుగుల వరదే పారింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ ధాటికి మిడిలార్డర్ తోడవ్వడంతో భారత్ ఏకంగా 330 పరుగులతో వహ్వా.. అనిపించింది. ఇక గెలుపు మనదే అని ఫ్యాన్స్ సంబరపడిన వేళ ప్రత్యర్థి ఆసీస్ మాత్రం ఎప్పటిలాగే తమ ప్రొఫెషనల్ ఆటతీరును చూపింది. లక్ష్యం ఎంత భారీదైనా తమ దూకుడు ముందు దిగదుడుపే అని నిరూపించింది. కెప్టెన్ అలీసా హీలీ ఆరంభం నుంచే కదం తొక్కుతూ అద్భుత శతకంతో ఛేదనకు మార్గం సుగమం చేసిన వేళ.. భారత బౌలర్ల పోరాటం చిన్నబోయింది.


అలీసా హీలీ (142)

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్

మహిళల వన్డే వరల్డ్‌కప్

ఆస్ట్రేలియా రికార్డు ఛేదన
కెప్టెన్ హీలీ అద్భుత శతకం

1 మహిళల వన్డే వరల్డ్‌కప్‌ల్లో భారత జట్టుకిదే అత్యధిక స్కోరు (330). అలాగే వన్డేల్లో ఆసీస్‌పై ఎక్కువ స్కోరు సాధించిన జట్టుగా భారత్ తొలి రెండు స్థానాల్లో నిలిచింది. ఇదే ఏడాది 369 రన్స్ సాధించగా, తాజాగా 330 పరుగులు సాధించింది.

330 చాల్లేదు

భారత్‌కు రెండో ఓటమి

మహిళల వన్డేల్లో అత్యధిక ఛేదనలు

లక్ష్యం	ఛేదించిన జట్టు	ప్రత్యర్థి	ఎప్పుడు
330	ఆస్ట్రేలియా	భారత్	2025
302	శ్రీలంక	దక్షిణాఫ్రికా	2024
289	ఆస్ట్రేలియా	న్యూజిలాండ్	2012
283	ఆస్ట్రేలియా	భారత్	2023
282	ఆస్ట్రేలియా	భారత్	2025

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌కు మరో ఝలక్. ఆదివారం డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో ఓడింది. అటు 331 పరుగుల రికార్డు ఛేదనను ఆస్ట్రేలియా తమ చాంపియన్ ఆటతీరుతో మరో 6 బంతులుండగానే ముగించడం విశేషం. కెప్టెన్ అలీసా హీలీ (107 బంతుల్లో 21 ఫోర్లు, 3 సిక్సర్లతో 142) విధ్వంసకర శతకంతో చెలరేగింది. ఇది భారత్‌కు వరుసగా రెండో ఓటమి కాగా.. ఆసీస్‌కు నాలుగు మ్యాచ్‌ల్లో మూడో విజయం. ఓ మ్యాచ్ రద్దయ్యింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 48.5 ఓవర్లలో 330 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (66 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80), ప్రతీకా రావల్ (96 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 75) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. హర్లీన్ (38), జెమీమా (33), రిచా (32) రాణించారు. పేసర్ సదర్లాండ్‌కు ఐదు, సోఫీకి మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 49 ఓవర్లలో 331/7 స్కోరుతో గెలిచింది. పెర్రీ (47 నాటౌట్), గార్డ్‌నర్ (45), లిచ్‌ఫీల్డ్ (40) గెలుపులో భాగమయ్యారు. శ్రీచరణికి మూడు.. దీప్తి, అమన్‌జోత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హీలీ నిలిచింది.


ప్రతీకా (75)
మంధాన (80)

మెరుపు ఛేదన: భారీ లక్ష్యం కళ్లముందున్నా ఆసీస్ ఎలాంటి బెరుకు లేకుండా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఎనిమిదో ఓవర్‌లో హీలీ 6,4,4,4తో 19 రన్స్ రాబట్టింది. ఇక పదో ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ నాలుగు ఫోర్లతో రాణించి 17 రన్స్ సమకూర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 82 పరుగులతో నిలిచింది. అయితే శ్రీచరణి తన తొలి ఓవర్‌లోనే లిచ్‌ఫీల్డ్‌ను దెబ్బ తీయడంతో మొదటి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు హీలీ బాదుడుకు 15 ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. ఆ తర్వాత ఎలిస్ పెర్రీ 32 పరుగుల దగ్గర కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఈ సమయంలో బౌలర్లు పరుగులను కట్టడి చేయడంతో పాటు మూనీ (4), సదర్లాండ్ (0)లను వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. 31వ ఓవర్‌లో 4,4,6తో చెలరేగి 84 బంతుల్లోనే హీలీ కెరీర్‌లో ఆరో శతకాన్ని పూర్తి చేసింది. ఇక అత్యంత ప్రమాదకరంగా మారిన హీలీ జోరుకు స్నేహ్ రాణా అద్భుత క్యాచ్‌తో శ్రీచరణి బ్రేక్ వేసింది. ఇక 36 బంతుల్లో 32 పరుగులు కావాల్సి ఉండగా ఆసీస్ చేతిలో నాలుగు వికెట్లున్నాయి. ఈ స్థితిలో పెర్రీ తిరిగి మైదానంలో అడుగుపెట్టింది. కిమ్ గార్త్ (14 నాటౌట్)ను అండగా చేసుకుని ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేసింది. ఇక 12 బంతుల్లో 13 రన్స్ కావాల్సి వేళ 49వ ఓవర్‌లో గార్త్ ఫోర్.. చివరి బంతికి పెర్రీ సిక్సర్‌తో ఆసీస్‌కు అద్భుత విజయాన్నందించారు.

1 మహిళల వన్డేల్లో వేగంగా (112 ఇన్నింగ్స్) 5000 పరుగులు పూర్తి చేసిన ప్లేయర్‌గా స్మృతి మంధాన. అలాగే ఈ ఏడాదిలో వెయ్యి రన్స్ పూర్తి చేసిన ఏకైక మహిళా బ్యాటర్‌గానూ నిలిచింది.
ఆసీస్ జట్టుపై వరుసగా ఐదుసార్లు 50+ స్కోర్లు నమోదు చేసిన ఏకైక మహిళా బ్యాటర్‌గా మంధాన.
వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (13) నమోదు కావడం ఇదే తొలిసారి.

ఆరంభం అదిరినా.. చివర్లో తడబాటు: ఈ మెగా టోర్నీలో ఇప్పటి దాకా తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేక పోయిన స్మృతి మంధాన ఫామ్‌ను అందుకుని తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్‌తో పాటు మిడిలార్డర్ కూడా తలో చేయి వేయడంతో భారత్ పరుగుల వరద పారించింది. కానీ ఆసీస్ బౌలర్ల ధాటికి కేవలం 36 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లు కోల్పోవడంతో ఆశించిన స్కోరు చేయలేకపోయింది. ఇక టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆరంభంలో ఏడో ఓవర్ ముగిసే సరికి స్కోరు 26 మాత్రమే. కానీ ఆ తర్వాత మంధాన లయ అందుకుంది. అడపాదడపా బౌండరీలతో మంధాన 46 బంతుల్లోనే ఫిఫ్టీని అందుకుంది. కాసేపటికే ప్రతీకా కూడా అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. అయితే దూకుడు మీదున్న మంధాన స్లాగ్ స్వీప్‌నకు వెళ్లి లిచ్‌ఫీల్డ్‌కు క్యాచ్ ఇచ్చింది. ఈ దశలో ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసి ప్రతీకాతో పాటు వేగంగా ఆడుతున్న హర్మన్‌ప్రీత్ (22), హర్లీన్‌ల వికెట్లను కూడా భారత్ కోల్పోయింది. 42 ఓవర్లలోనే స్కోరు 287/4తో అత్యంత పటిష్టంగా కనిపించింది. కానీ ఈ ప్రమాదకర జోడీని పేసర్ సదర్లాండ్ విడదీసింది. రిచాను అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక ఇక్కడి నుంచి భారత వికెట్ల పతనం వేగంగా సాగింది. ఓ దశలో సునాయాసంగా 370 రన్స్ సాధిస్తుందనుకున్నప్పటికీ టెయిలెండర్లు అనవసర షాట్లతో వరుస విరామాల్లో పెవిలియన్‌కు చేరారు. దీంతో స్కోరు 330కే పరిమితమైంది.

స్కోరుబోర్డు

భారత్: ప్రతీకా రావల్ (సి) పెర్రీ (బి) సదర్లాండ్ 75, స్మృతి మంధాన (సి) లిచ్‌ఫీల్డ్ (బి) మోలినెక్స్ 80, హర్లీన్ (సి) సదర్లాండ్ (బి) మోలినెక్స్ 38, హర్మన్‌ప్రీత్ (సి) మోలినెక్స్ (బి) షుట్ 22, జెమీమా (సి) మూనీ (బి) సదర్లాండ్ 33, రిచా ఘోష్ (సి/సబ్) వారెహమ్ (బి) సదర్లాండ్ 32, అమన్‌జోత్ (సి) మోలినెక్స్ (బి) గార్డ్‌నర్ 16, దీప్తి శర్మ (సి) మూనీ (బి) మోలినెక్స్ 1, స్నేహ్ రాణా (నాటౌట్) 8, క్రాంతి గౌడ్ (సి/సబ్) వారెహమ్ (బి) సదర్లాండ్ 1, శ్రీచరణి (బి) సదర్లాండ్ 0, **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 48.5 ఓవర్లలో 330 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-155, 2-192, 3-234, 4-240, 5-294, 6-309, 7-320, 8-327, 9-330, 10-330; **బౌలింగ్:** కిమ్ గార్త్ 5-0-35-0, మెగాన్ షుట్ 6.1-0-37-1, గార్డ్‌నర్ 7-0-40-1, మోలినెక్స్ 10-1-75-3, సదర్లాండ్ 9.5-0-40-5, మెక్‌గ్రాత్ 4.5-0-43-0, అలనా కింగ్ 6-0-49-0.

ఆస్ట్రేలియా: అలిస్సా హీలీ (సి) రానా (బి) శ్రీచరణి 142, లిచ్‌ఫీల్డ్ (సి) రాణా (బి) శ్రీచరణి 40, ఎలిస్ పెర్రీ (నాటౌట్) 47, బెత్ మూనీ (సి) జెమీమా (బి) దీప్తి 4, సదర్లాండ్ (బి) శ్రీచరణి 0, గార్డ్‌నర్ (బి) అమన్‌జోత్ 45, మెక్‌గ్రాత్ (ఎల్బీ) దీప్తి 12, మోలినెక్స్ (ఎల్బీ) అమన్‌జోత్ 18, కిమ్ గార్త్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 49 ఓవర్లలో 331/7; వికెట్ల పతనం:** 1-85, 1-154, 2-168, 3-170, 4-265, 5-279, 6-299, 7-303; **బౌలింగ్:** అమన్‌జోత్ 9-0-68-2, క్రాంతి 9-1-73-0, స్నేహ్ రాణా 10-0-85-0, శ్రీచరణి 10-1-41-3, దీప్తి 10-0-52-2, హర్మన్‌ప్రీత్ 1-0-10-0.

కుర్రాళ్ల జోరు

న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు
జొహోర్ కప్ జూనియర్ హాకీ

జొహోర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 4-2తో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. అర్ష్‌దీప్ (2ని.), సునీల్ (15ని.), అరిజీత్ సింగ్ హుందాల్ (26ని.), రోషన్ (47ని.) భారత్‌కు గోల్స్ అందించారు. గస్ నెల్సన్ (41ని.), ఐడన్ మ్యాక్స్ (52ని.) న్యూజిలాండ్ తరఫున గోల్స్ చేశారు. టోర్నమెంట్‌లో భారత్‌కిది రెండో విజయం. శనివారంనాటి ఆరంభ మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్‌పై 3-2తో నెగ్గిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడుతుంది.



మహిళా క్రికెట్‌కు గౌరవం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని ఓ స్టాండ్‌కు భారత మాజీ క్రికెటర్, హైదరాబాద్‌కు చెందిన మిథాలీరాజ్ పేరు, గేటుకు ఆంధ్రాకు చెందిన అంతర్జాతీయ మాజీ క్రికెటర్ రావి కల్పన పేరు పెట్టారు. మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌కు ముందు ఏపీ మంత్రి నారా లోకేశ్, ఐసీసీ అధ్యక్షుడు జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, దేశంలో లక్షలాది మంది యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచిన మిథాలీరాజ్ పేరును ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఒక స్టాండ్‌కు పెట్టడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. స్టేడియంలో ఒక గేట్‌కు రావి కల్పన పేరు పెట్టడం క్రీడారంగానికి సముచిత గౌరవమేనన్నారు. పురుషులతో సమానంగా మహిళా సీనియర్ క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు అందడం ఆర్థికంగా లాభదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సాన సతీష్, చాముండేశ్వర్‌నాథ్ పాల్గొన్నారు.



అన్‌సీడెడ్‌గా వచ్చాడు ట్రోఫీ పట్టేశాడు

షాంఘై మాస్టర్స్‌లో వాలెంటిన్ సంచలనం

షాంఘై (చైనా): టోర్నీ ఆరంభానికి ముందు అతనో అనామక ఆటగాడు.. పైగా, ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అతని స్థానం 204.. ఇంకేం, తొలి మ్యాచ్ నెగ్గడమే గగనం అనుకున్నారంతా! కానీ, అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ దిగ్గజం జొకోవిచ్‌లాంటి స్టార్లను చిత్తుచేస్తూ ముందుకు సాగిన అతను.. ఏకంగా టోర్నీ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించాడు. అతనే, మొనాకోకు చెందిన 26 ఏళ్ల వాలెంటిన్ వాచెరోట్. ఏమాత్రం అంచనాలు లేని వాలెంటిన్.. షాంఘై మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సింగిల్స్ ట్రోఫీ నెగ్గి సరికొత్త రికార్డు నమోదు చేశాడు. క్వార్టర్స్‌లో పదోసీడ్ హోల్గర్ రూన్‌కు, సెమీస్‌లో నాలుగో సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చిన వాలెంటిన్ ఫైనల్లో తనకు వరుసకు సోదరుడైన ఆర్థర్ రిండెర్‌నెచ్‌ను 4-6, 6-3, 6-3తో ఓడించి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీ చరిత్రలో టైటిల్ నెగ్గిన అతి తక్కువ ర్యాంకర్‌గా వాలెంటిన్ నయా చరిత్ర సృష్టించాడు.

గాఫ్‌కు వుహాన్ టైటిల్




అమెరికా టెన్నిస్ స్టార్ కొకొ గాఫ్.. వుహాన్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. చైనాలోని వుహాన్‌లో శనివారం జరిగిన మహిళల తుదిపోరులో మూడో సీడ్ గాఫ్ 6-4, 7-5తో తన దేశానికే చెందిన జెస్సికా పెగులపై గెలిచి ట్రోఫీ అందుకుంది. 21 ఏళ్ల గాఫ్‌కిది ఈ ఏడాది రెండో టైటిల్. అంతకుముందు ఫ్రెంచ్ ఓపెన్ గెలిచింది.

దీప్తికి స్వర్ణం



పర్వతగిరి (ఆంధ్రజ్యోతి): వర్టైస్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వరంగల్ అమ్మాయి జీవాంజి దీప్తి పసిడి పతకం దక్కించుకుంది. ఆదివారం ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన 400 మీటర్ల టీ20 కేటగిరీ పరుగులో దీప్తి 55.92 సెకన్లలో రేసును పూర్తి చేసి, అగ్రస్థానాన్ని దక్కించుకుంది. కరీనా ఫైమ్ (పోర్చుగల్) రజతం, టెలయ బ్లాక్‌స్మిత్ (ఆస్ట్రేలియా) కాంస్యం సాధించారు. ఇటీవల జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దీప్తి రజతం గెలవడం తెలిసిందే.

శతక్కొట్టిన సీవీ ఆనంద్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హెచ్‌సీఏ 'సి' డివిజన్ వన్డే లీగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్ అజేయ శతకం (111) సాధించారు. ఆదివారం బేగంపేటలో హెచ్‌పీఎస్ జట్టుతో తలపడిన సికింద్రాబాద్ క్లబ్ 81 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ క్లబ్, సీవీ ఆనంద్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో (89 బంతుల్లో 111 పరుగులు) 35 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో 5 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఛేదనలో హెచ్‌పీఎస్ జట్టు 35 ఓవర్లలో 142/9 చేసి ఓటమి పాలైంది.



పుణె 'టైబ్రేకర్' గెలుపు

న్యూఢిల్లీ: ఉత్కంఠను అదిమిపట్టిన పుణెరి పల్టన్ టైబ్రేకర్‌లో 6-5 స్కోరుతో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ప్రొ.కబడ్డీ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత పుణె, ఢిల్లీ 38-38తో సమంగా నిలిచాయి. దాంతో టైబ్రేకర్ అనివార్యమైంది. ఈ విజయంతో పుణె పాయింట్ల పట్టికలో అగ్ర స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 43-32తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.



పాక్ 313/5

ఇమాముల్ సెంచరీ మిస్

● సౌతాఫ్రికాతో తొలి టెస్ట్

లాహోర్: దక్షిణాఫ్రికాతో ఆదివారం మొదలైన తొలి టెస్ట్‌లో ఓపెనర్ ఇమాముల్ హక్ (93), కెప్టెన్ షాన్ మసూద్ (76) అర్ధ శతకాలతో రాణించడంతో పాకిస్థాన్ భారీస్కోరు దిశగా సాగుతోంది. హక్, మసూద్‌తో పాటు రిజ్వాన్ (62 బ్యాటింగ్), సల్మాన్ ఆఘా (52 బ్యాటింగ్) సత్తా చాటడంతో మొదటి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 313/5 స్కోరు చేసింది. బాబర్ ఆజమ్ (23)తోపాటు ఓపెనర్ అబ్దుల్ షఫీక్ (2), సౌద్ షకీల్ (0) నిరాశపర్చారు. సెనురన్ ముత్తుసామి రెండు వికెట్లు పడగొట్టాడు.

ఆర్చరీ లీగ్ విజేత రాజస్థాన్

ఫైనల్లో యోధాస్ ఓటమి

న్యూఢిల్లీ: ఆర్చరీ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ టైటిల్‌ను రాజ్‌పుతానా రాయల్స్ ఆఫ్ రాజస్థాన్ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్స్‌లో రాయల్స్ - పృథ్వీరాజ్ యోధాస్ జట్లు 4-4 స్కోరుతో సమంగా నిలవడంతో టైబ్రేకర్ అనివార్యమైంది. ఇందులో యోధాస్ ఆర్చర్లలో ఒక్కరు కూడా టార్గెట్‌లోని పసుపు చుక్కపై బాణాలను సంధించలేకపోయారు. రాయల్స్ ఆర్చర్లలో ఓజాస్, ఎల్లా గిబ్సన్ టార్గెట్‌కు సరిగ్గా గురిపెట్టి, లక్ష్యాన్ని ఛేదించడంతో ట్రోఫీ వారి సొంతమైంది.

హైదరాబాద్ పోరాడినా..

వాలీబాల్ లీగ్‌లో పరాజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో హైదరాబాద్ జట్టు హ్యాట్రిక్ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ నాలుగో మ్యాచ్‌లో హైదరాబాద్ 2-3తో అహ్మదాబాద్ డిఫెండర్స్ చేతిలో పోరాడి ఓడింది. తొలి రెండు సెట్లలో దూకుడుగా ఆడిన హైదరాబాద్ 15-9, 15-7తో నెగ్గినా.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్లలో 9-15, 11-15, 8-15తో ఓటమి పాలై నిరాశపర్చింది.

వేములవాడలో దర్శనాల వివాదం

- రాజన్న ఆలయంలో ఎప్పటిలాగే పూజలు
- భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు
- పొంతనలేని ప్రకటనలతో భక్తుల్లో అయోమయం

సిరిసిల్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో అభిషేకాలు, అర్చనలు, పూజల నిలిపివేత ప్రకటనలు భక్తులను అయోమయానికి గురిచేశాయి. ఇదే క్రమంలో భీమన్న గుడిలో ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి శనివారం కోడె మొక్కులను ప్రారంభించారు. దీంతో భక్తులకు ముందస్తు సమాచారం లేకుండా రాజన్న ఆలయం నుంచి భీమన్న ఆలయానికి దర్శనాలు ఎలా మారుస్తారనే వివాదం మొదలైంది. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు పొంతనలేని ప్రకటనలు చేశారు. రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేయడం లేదని, దర్శనాలు ఉంటాయని ప్రకటించారు. ఆదివారం దర్శనాలను ఎప్పటిలాగే కొనసాగించారు. భక్తుల నుంచి నిరసనలు రావడంతో దర్శనాలు కొనసాగుతాయన్నారు. మరోవైపు రాజన్న మొక్కులు భీమన్నకి ఎలా చెల్లిస్తారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే ఊరుకోమని హెచ్చరించారు. వేములవాడ దేవస్థానం ఎదుట, రాజన్న సిరిసిల్ల వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, ధర్నాలు జరిగాయి. కాగా, రాజన్న ఆలయం మూసివేత ఉండదని, స్వామివారికి నిత్య పూజలు కొనసాగుతాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పారు. రాజన్న ఆలయంలో యంత్రాలతో పనులు జరిగే క్రమంలో ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

- జోర్డాన్‌లో చిక్కుకున్న కార్మికులకు హరీశ్‌రావు భరోసా



సిద్దిపేట క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆందోళన పడకండి.. బీఆర్ఎస్ అండగా ఉంటుంది అని అరబ్ దేశం జోర్డాన్‌లో చిక్కుకున్న వలస కార్మికులకు మాజీ మంత్రి హరీశ్ రావు భరోసానిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం నాడు వారితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులకు వివరించారు. మరోవైపు బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ సురేశ్ రెడ్డి కూడా విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో మాట్లాడుతున్నారని చెప్పారు. ఎలాగైనా తెలంగాణకు తీసుకొస్తామని, అధైర్య పడవద్దని హరీశ్‌రావు దీమా ఇచ్చారు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన 12మంది వలస కార్మికులు ఏడాది క్రితం ఉపాధి కోసం జోర్డాన్‌కు వెళ్లారు. అక్కడ పనిచేసే కంపెనీ అనుమతి ఇవ్వకపోవడం, చేతిలో డబ్బులు లేకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కార్మికులు హరీశ్ రావును సంప్రదించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎలాగైనా తమను తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని కోరగా.. హరీశ్ వారికి ధైర్యం చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే కాంగ్రెస్‌కు బుద్ధి వస్తుంది

- మోసం రేవంత్ నైజం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ రెండేళ్లుగా వంచిస్తోందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిస్తేనే ఆ పార్టీకి బుద్ధి వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన 'కారు' పార్టీ కావాలా.. హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చుతున్న 'బుల్డోజర్' కాంగ్రెస్ కావాలా.. ఓటర్లే నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు. షేక్‌పేట్ డివిజన్ బీజేపీ నాయకుడు చెర్క మహేశ్ తదితరులు ఆదివారం కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓటుకు రూ.10 వేలు ఇవ్వాలని కాంగ్రెస్ చూస్తోందని, ప్రజలు మోసపోవద్దన్నారు. మోసం రేవంత్‌రెడ్డి నైజమని విమర్శించారు. అన్నీ తెలిసి.. బీసీ రిజర్వేషన్ల అంశంలో నాటకాలాడుతున్నారని ఆరోపించారు.

సెప్టెంబరు నాటికి ఆ 3 జిల్లాల్లోనే
రూ.4,804 కోట్ల ఇళ్ల రిజిస్ట్రేషన్లు

- నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97%
- డిసెంబరు నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియ చేపడతాం
- 2-3 నెలల్లో ఏఐ సిటీకి భూమిపూజ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో ఈ ఏడాది సెప్టెంబరు నాటికి రూ.4,804 కోట్ల విలువైన 6,612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గత ఏడాది ఇదే కాలంలో రూ.2,820 కోట్ల విలువైన 4,903 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని చెప్పారు. ఈ ఏడాది 35 శాతం పెరిగిందని, విలువలో వార్షిక వృద్ధి 70 శాతం నమోదైందని పేర్కొన్నారు. ఇవి కేవలం గణాంకాలే కాదని, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలైందంటూ తమపై దుష్ప్రచారం చేస్తున్న వారికి దీటైన సమాధానాలని చెప్పారు. ఆదివారం హైటెక్స్‌లో నిర్వహించిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆయన ప్రసంగించారు. '2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణరంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80 వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్‌డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంద'ని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలోనే ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. డిసెంబరు నాటికి ఫ్యూచర్ సిటీలో జోనలైజేషన్ ప్రక్రియను పట్టాలెక్కించాలనే పట్టుదలతో ఉన్నామని చెప్పారు. అక్కడే 200 ఎకరాల్లో ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లో భూమిపూజ చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి, కాశీ ప్రసాద్, కిరణ్, కే శ్రీధర్ రెడ్డి, ఆర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు జ్ఞాపికను అందజేస్తున్న నారెడ్కో ప్రతినిధులు

ఆరోగ్య తెలంగాణ.. ప్రభుత్వ సంకల్పం

లక్షలాది మందిని కబళిస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 'గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్'ను ఆయన ప్రారంభించారు. ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదని, ఆరోగ్య తెలంగాణను నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలన్నారు.

రక్తశుద్ధికి వెళితే కొత్త రోగాలు!

(మొదటిపేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను 2014-15లో ప్రారంభించారు. నాడు 5,476 మంది కిడ్నీ ఫెయిల్యూర్ బాధితులకు రక్తశుద్ధి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 102 డయాలసిస్ కేంద్రాలున్నాయి. వాటిలో 14,156 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీటన్నింటినీ హబ్ అండ్ స్పోక్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులు నోడల్ సెంటర్లుగా, డయాలసిస్ కేంద్రాలు స్పోక్ పద్ధతిలో పని చేస్తున్నాయి. గతేడాది డయాలసిస్ కేంద్రాల్లో నెలకు సగటున 93,015 సైకిల్స్ డయాలసిస్ చేశారు. 2014-2025 మధ్య కాలంలో మొత్తం 76లక్షల 25 వేల డయాలసిస్ సెషన్స్ జరిగాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.1090 కోట్లు ఖర్చు పెట్టింది. ప్రస్తుతం మూడు ప్రైవేటు కంపెనీలు డయాలసిస్ నిర్వహణను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో చేస్తున్నాయి. సింగిల్ డయలైజర్ వాడకం పద్ధతిలో ఒక్కో డయాలసిస్‌కు సర్కారు రూ.1950 చొప్పున నిర్వహణ కంపెనీలకు చెల్లిస్తోంది.

హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ చేయని కేంద్రాలు?

డయాలసిస్ కేంద్రాల్లో కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకున్న తర్వాత తదుపరి రోగికి రక్తశుద్ధి చేయాలంటే కొంత విరామం ఇవ్వాలి. డయాలసిస్ చేసిన వెంటనే కనీసం అరగంటపాటు హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ చేయాలి. అంటే ఒక రోగికి వాడిన బ్లడ్ ట్యూబ్‌లతోపాటు డయాలసిస్ మెషిన్లను శుభ్రం చేయాలి. డయాలసిస్ కేంద్రాల్లో 5-10 మెషిన్లు ఉంటున్నాయి. కొన్ని కేంద్రాల్లో విపరీతమైన రద్దీ ఉంటుండడంతో డీప్ క్లీనింగ్ చేసేంత సమయం ఉండటం లేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. కొన్ని కేంద్రాల్లో అసలు హాట్ డిస్‌ఇన్ఫెక్షనే జరగడం లేదన్న ఆరోపణలున్నాయి. డిస్‌ఇన్ఫెక్షన్ చేస్తే తరువాత వచ్చే రోగికి ఎటువంటి ఇబ్బంది ఉండదని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. మన వద్ద హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ ఎవరు చేస్తున్నారో పర్యవేక్షించే యంత్రాంగం లేదు. దీంతో కొన్నిసార్లు రోగులు ఇతర రోగాల బారిన పడుతున్నారు. అలాగే డయాలసిస్ రోగులకు ప్రతి మూడు నెలలకోసారి వైరల్ టెస్టులు విధిగా చేయాలి. ఈ వైరల్ మార్క్ టెస్టుల్లో హెచ్ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ పరీక్షలుంటాయి. ఈ టెస్టులు కూడా ఎలీసా మెథడ్‌లో చేయాలి. కానీ, చాలా డయాలసిస్ కేంద్రాల్లో స్ట్రిప్ పద్ధతిలో చేస్తున్నారని, దీంతో రక్తపరీక్షల్లో సరైన కచ్చితత్వం ఉండటం లేదని రోగులు చెబుతున్నారు. అలాగే బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేసుకోవాలని, అది కూడా సరిగా చేయడం లేదన్న విమర్శలున్నాయి.



ఒక్కో డయలైజర్ రెండు మూడుసార్లు..!

నిబంధనల మేరకు నిర్వాహకులు ప్రతి రోగికీ డయాలసిస్ చేసిన ప్రతిసారీ సింగిల్ డయలైజర్ వాడాలి. కానీ, కొన్ని కేంద్రాల్లో సిబ్బంది ఒక్కసారికి బదులు రెండు మూడుసార్లు డయలైజర్స్‌ను వాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. లెక్కల్లో సింగిల్ అని చూపిస్తూ, మిగిలిన డయలైజర్స్‌ను ప్రైవేటులో అమ్ముకుంటున్నట్లు చెబుతున్నారు. కొన్ని కేంద్రాల్లో ఈ తతంగం బాహాటంగానే సాగుతున్నా.. ఆరోగ్యశ్రీ నుంచి సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని అంటున్నారు. దీనిని పర్యవేక్షించే అధికారులు నిర్వహణ కంపెనీలతో లాలూచీ పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కార్యాలయ అధికారుల అండదండలతోనే డయాలసిస్ నిర్వహణ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కేంద్రాల్లో డయాలసిస్ సిబ్బంది స్లాట్స్ విషయంలో రోగుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. కేంద్రానికి ముందుగా వచ్చిన వారికి తొలుత డయాలసిస్ చేయకుండా.. కొందరి వద్ద డబ్బులు తీసుకొని ఇష్టారాజ్యంగా చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. అలాగే డయాలసిస్ చేయించుకున్న రోగులు ఇటీవలి కాలంలో ఎక్కువ మంది మరణిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కేంద్రాలను తనిఖీ చేసి లోతుగా పరిశీలిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

సివిల్ వివాదాల్లో పోలీసులు తల దూర్చవద్దు

గీత దాటితే వేటు తప్పదు: డీజీపీ శివధర్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చవద్దని, సివిల్ వివాదాలను పరిష్కరించిన పోలీసు స్టేషన్లు, సంబంధిత అధికారులపై తక్షణమే వేటు పడుతుందని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. హోం గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకూ ఎవరూ సివిల్ వివాదాల్లో తల దూర్చవద్దని కోరుతూ రాష్ట్ర పోలీసులనుద్దేశించి రాసిన అంతర్గత లేఖలో శివధర్ రెడ్డి పేర్కొన్నారు. సివిల్ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయన్న సంగతి ప్రతి పోలీసుకూ తెలుసునని, అయినా వాటిపై దృష్టి సారించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పోలీసు యూనిఫామ్, అవినీతి కలిసి ఉండకూడదన్న డీజీపీ.. అవినీతి, అక్రమాలపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే ప్రజల్లో నమ్మకం పోతుందని చెప్పారు.

తొలి సెమీకండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియం ప్రారంభం

గచ్చిబౌలి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): టీ-చిప్ (టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్) ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి సెమీకండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియంను కొండాపూర్‌లో ఆదివారం ప్రారంభించారు. భవిష్యత్తులో సెమీకండక్టర్ ఆధారిత టెక్నాలజీ ఎలా ఉంటుందో చెప్పేలా తీర్చిదిద్దిన ఈ మ్యూజియంను ప్రజలు సందర్శించవచ్చు. స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు తాము సాగిస్తున్న కృషిని, తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించేందుకు వీలు కల్పించారు. మ్యూజియం ప్రారంభం సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సెమీకండక్టర్ల ఆవిష్కరణ రంగంలో దీన్ని కీలకమైన అడుగుగా అభివర్ణించారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగాన్ని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం మద్దతు ఇస్తుందని తెలిపారు.

ఐదేళ్లలో 30% మహిళా ఉద్యోగులు: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: రాబోయే ఐదేళ్లలో మహిళా ఉద్యోగుల సంఖ్యను 30 శాతానికి పెంచుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా లింగ వైవిధ్యాన్ని పెంచే వ్యూహాన్ని రూపొందించింది. తమ బ్యాంకులో ఫ్రంట్‌లైన్ సిబ్బందిని చూసినట్టయితే వారిలో మహిళలు 33% ఉన్నారని, మొత్తం సిబ్బందిని చూస్తే మాత్రం 27% మాత్రమే ఉన్నారని, లింగ వైవిధ్యాన్ని మరింత మెరుగుపరచాలనుకుంటున్నామని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (హెచ్ఆర్), చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిశోర్ కుమార్ పోలుదాసు చెప్పారు. పురుష, మహిళా ఉద్యోగుల శాతం లో ఈ వ్యత్యాసాన్ని తొలగించి మధ్యకాలికంగా 30% మహిళా సిబ్బంది లక్ష్యం చేరాలన్నది తమ ధ్యేయమని ఆయన తెలిపారు. ఎస్‌బీఐలో ప్రస్తుతం 2.4 లక్షల మంది ఉద్యోగులున్నారు. బ్యాంకింగ్ రంగంలోనే కాకుండా దేశంలోని ఏ ఇతర సంస్థలో అయినా గరిష్ఠ ఉద్యోగుల సంఖ్య ఇదే. మహిళా ఉద్యోగుల సౌకర్యం కోసం తమ బ్యాంక్ క్రెష్ (శిశు రక్షణ కేంద్రం) అలవెన్స్, ఫ్యామిలీ కనెక్ట్ కార్యక్రమం, మాతృత్వ సెలవుల అనంతరం తిరిగి విధుల్లో చేరే మహిళలకు శిక్షణ, సిక్ లీవ్ పెంపు వంటి పలు సౌకర్యాలు కల్పిస్తున్నదని ఆయన వెల్లడించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాలు వినియోగంలోకి తెచ్చేందుకు వీలుగా వారికి సంపూర్ణ సురక్షిత, సమ్మిళిత వాతావరణం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎస్‌బీఐలో పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్న బ్రాంచీల సంఖ్య 340కి పైగా ఉండడమే మహిళల పట్ల తమ చిత్తశుద్ధికి నిదర్శనమని కిశోర్ అన్నారు.

ఓఎన్‌జీసీ
లాభాల్లో ఎంతో మిన్న
మార్కెట్ క్యాప్‌లో మాత్రం చిన్న

అగ్రస్థానం నుంచి 25వ స్థానానికి..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) షేర్లపై మదుపరులు అంతగా మక్కువ చూపించటం లేదు. గత మూడేళ్లలో ఈ పీఎస్‌యూ దిగ్గజం రూ.1.16 లక్షల కోట్ల లాభాలు నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరానికి చూసినా ఓఎన్‌జీసీ అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.38,329 కోట్లు, ఏకీకృతం (స్టాండ్‌ఎలోన్)గా చూస్తే రూ.35,610 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.697 కోట్లు మాత్రమే. అయినా గత వారాంతానికి స్టాక్ మార్కెట్లో జొమాటో మార్కెట్ క్యాప్ రూ.3.37 లక్షల కోట్లుగా ఉంటే ఓఎన్‌జీసీ మార్కెట్ క్యాప్ రూ.3.10 లక్షల కోట్లు మాత్రమే.

గతమెంతో ఘనం

పదమూడేళ్ల వెనక్కి వెళితే దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.2.44 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఓఎన్‌జీసీ అగ్రస్థానంలో ఉండేది. టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉండేవి. ఇప్పుడు రూ.18.7 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఆర్ఐఎల్ అగ్రస్థానంలో, రూ.10.95 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో టీసీఎస్ నాలుగో స్థానంలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ మాత్రం రూ.3.10 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో 25వ స్థానానికి పడిపోయింది.



అండర్ వాల్యుయేషన్

మార్కెట్ వర్గాలు ఓఎన్‌జీసీ షేర్ల ప్రస్తుత విలువ దాని అసలు విలువను ప్రతిబింబించడం లేదంటున్నాయి. ఓఎన్‌జీసీకి ఎంఆర్‌పీఎల్ ఈక్విటీలో 71.63 శాతం, హెచ్‌పీసీఎల్ ఈక్విటీలో 54.9 శాతం, ఐఓసీ ఈక్విటీలో 14.20 శాతం, గెయిల్ ఇండియా ఈక్విటీలో 5 శాతం వాటా ఉంది. ఇవిగాక విదేశాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తిలో ఉన్న ఓఎన్‌జీసీ విదేశ్ పూర్తిగా ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ. ఈ సంస్థల్లో ఉన్న ఓఎన్‌జీసీ వాటాల విలువే ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.1.07 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఓఎన్‌జీసీ షేర్ల మార్కెట్ క్యాప్ మరో 33.3 శాతం పెరుగుతుంది. పీఎస్‌యూ కావడం తోనే ఇన్వెస్టర్లు ఓఎన్‌జీసీ షేర్లను సరిగా అంచనా వేయలేక పోతున్నారని చెబుతున్నారు.

రోజుకు 17 కోట్ల సైబర్ దాడులు
ఎన్‌ఎస్‌ఈ

ముంబై: దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలపైనా సైబర్ కేటుగాళ్లు కన్నేశారు. తమ డేటా బ్యాంకుల్లోకి జొరబడి కీలక సమాచారం తస్కరించేందుకు లేదా తమ కార్యకలాపాలను స్తంభింప చేసేందుకు సైబర్ కేటుగాళ్లు రోజుకు 15 కోట్ల నుంచి 17 కోట్ల సార్లు దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) అధికారులు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అయితే ఈ రోజువారీ దాడుల సంఖ్య 40 కోట్లకు చేరింది. అత్యాధునిక సాఫ్ట్‌వేర్, యంత్రాలు, సుశిక్షితులైన సైబర్ నిపుణులతో ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతున్నట్టు తెలిపారు. సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు తమ సైబర్ యోధులు 24 గంటలూ అప్రమత్తంగా ఉన్నట్టు వారు చెప్పారు.

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. గోల్డ్ సిల్వర్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్)ను ప్రారంభించింది. ఇది కోటక్ గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌కు చెందిన ఓపెన్ ఎండెడ్ ఎఫ్ఓఎఫ్. దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాల కోసం ఈ ఫండ్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఈ నెల 20.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	525
వరంగల్	507	గోదావరి	510
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

బిజినెస్

24,800 దిగువన బేరిష్

(అక్టోబరు 13-17 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 24,881-25,331 పాయింట్ల మధ్యన కదలాడి 389 పాయింట్ల లాభంతో 25,285 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,800 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,057, 24,861, 24,957, 24,188 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,600 బ్రేక్‌డౌన్ స్థాయి: 24,800
నిరోధ స్థాయిలు: 25,485, 25,585, 25,685 (25,385 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,085, 24,985, 24,885 (25,185 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	127	అనంతపురం	100
గోదావరి	119		

మరో కరెక్షన్‌కు ఆస్కారం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 25,000 వద్ద బ్రేకౌట్ సాధించి 400 పాయింట్ల లాభంతో 25,300 సమీపంలో క్లోజైంది. గత కొద్ది రోజుల్లో 800 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించి ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయిలకు చేరువవుతోంది. మిడ్‌క్యాప్-100 సూచీ 1,200 పాయింట్లు లాభపడి ఇటీవల గరిష్ఠ స్థాయి 59,000కు చేరువైంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. స్మాల్‌క్యాప్-100 సూచీ కూడా 255 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ ప్రస్తుతం సెప్టెంబరులో బలమైన కరెక్షన్‌లో ప్రవేశించిన గరిష్ఠ స్థాయి 25,300 వద్ద ఉంది. అప్రమత్తంగా ఉండాలి. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన బలమైన డౌన్‌ట్రెండ్ కారణంగా ఈ వారం నిఫ్టీ నెగెటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 25,000 వద్ద మరో పరీక్షకు గురి కానుంది.

బుల్లిష్ స్థాయిలు: పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడినా 25,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి లేదా కన్సాలిడేట్ కావాలి. ప్రధాన నిరోధం 25,300. ఆ పైన నిలదొక్కుకోగలిగితే తదుపరి టార్గెట్ 25,500.

బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం 1,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన ఈ సూచీ 56,600 వద్ద ముగిసి ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయిలకు చేరువలో ఉంది. రియాక్షన్‌లో పడినా సానుకూలత కోసం మద్దతు స్థాయి 56,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 55,400, 55,000. ప్రధాన నిరోధ స్థాయిలు 56,600, 57,300.

పాటర్న్: సానుకూలత కోసం నిఫ్టీ 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. మరోసారి 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొంటున్నందున ఇక్కడ బలం ప్రదర్శించినప్పుడే స్వల్పకాలిక సానుకూలత ఏర్పడుతుంది. గత నెలలో 25,300 వద్ద బలమైన టాప్ ఏర్పడింది. సానుకూలత కోసం దాన్ని ఛేదించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,210, 25,300
మద్దతు	25,100, 25,000

ఈ వారం ఆటుపోట్లలోనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. రేర్ ఎర్త్ మెటల్స్ ఎగుమతులపై నిషేధం విధించిన చైనాపై డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్ విధించటం, ఇతర అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు సూచీలపై ప్రభావం చూపించే వీలుంది. ఈ నేపథ్యంలో మదుపరులు ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే పెట్టుబడి పెట్టడం మంచిది. గత వారం నిఫ్టీ దాదాపు 2 శాతం మేర పెరిగి 25,285 పాయింట్ల వద్ద క్లోజైంది. సూచీ ఇదే స్థాయిల్లో కొన్నాళ్లు కన్సాలిడేట్ అయితే స్థిరత్వం వస్తుంది. ప్రస్తుతం నాన్ ఫెర్రస్ మెటల్స్, టెలికాం, వజ్రాభరణాలు, ఇన్‌ఫ్రా, బ్యాంకింగ్ రంగాలు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

డీఎల్ఎఫ్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. కన్సాలిడేషన్ కూడా జరుగుతోంది. ప్రస్తుతం కీలకమైన రూ.706 వద్ద మద్దతు లభించింది. స్వల్పకాల అప్‌ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.740 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825 టార్గెట్ ధరతో రూ.740 శ్రేణిలో డిప్స్ పద్ధతిలో అక్యుములేట్ చేసుకోవాలి. రూ.720 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ గ్రీన్ ఎనర్జీ: కొన్ని నెలలుగా కన్సాలిడేట్ అవుతున్న ఈ షేరు ప్రస్తుతం స్వలకాలిక అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. ఫండమెంటల్స్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.1,064 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,040 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,180 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,010 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డాక్టర్ రెడ్డీస్: స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ట్రయాంగిల్ ప్యాటర్న్ ఫామ్ అయ్యింది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.1,264 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 శ్రేణిలో ప్రవేశించి రూ.1,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పవర్‌గ్రిడ్: ప్రస్తుతం ఈ కౌంటర్ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. షార్ట్‌టర్మ్ వ్యూహంతో ఇందులో పొజిషన్ తీసుకోవచ్చు. గత శుక్రవారం రూ.289 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.280 పై స్థాయిలో ప్రవేశించి రూ.315/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.270 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఆటో: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 45 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం స్టేజ్-2లో ఉంది. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగం మూమెంటమ్‌లో ఉంది. గత శుక్రవారం రూ.8,946 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.8,850 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.9,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.8,750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

పేదల సంక్షేమమే సర్కారు ఎజెండా

» రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి



ఖమ్మం రూరల్, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసినా తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగకుండా కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలో ఖమ్మం-కోదాడ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి జీ+2 కాలనీ వయా ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 వరకు రూ.1.71 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా పాలన సాగిస్తోందన్నారు. కొత్త మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదలకిచ్చిన ఘనత తమ సర్కారేదనన్న మంత్రి పొంగులేటి.. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. చిన్న వెంకటగిరిలో కోదాడ ప్రధాన రహదారి పక్కన అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. వైఎస్ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మంత్రి పొంగులేటి పరిశీలించారు.

ఐసీఎస్ అధికారి ఆత్మహత్యపై భట్టి విచారం

» చండీగఢ్‌లో పూరన్ కుమార్ మృతదేహానికి నివాళి

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనపై ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన చండీగఢ్‌కు వెళ్లి పూరన్ కుమార్ మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశంలోనే అత్యున్నత సర్వీసుల్లో పనిచేస్తున్న వారికి కూడా సామాజిక న్యాయం దక్కడం లేదన్నారు. అందుకు పూరన్ కుమార్ ఆత్మహత్యే ఒక ఉదాహరణ అని ధ్వజమెత్తారు. డీజీపీ సహా 8 మంది ఐపీఎస్ అధికారుల కుల వివక్ష, బహిరంగ అవమానాలను భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన పూరన్ కుమార్ మృతి దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు ఆపండి

» బీఆర్ఎస్, బీజేపీ నేతలకు మంత్రి సీతక్క హితవు

ములుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలకు మంత్రి సీతక్క హితవు పలికారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క, సారలమ్మలను మంత్రి సీతక్క ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం మహాజాతర పనులను పరిశీలించారు. అనంతరం ములుగు నియోజకవర్గం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం దేశానికే ఆదర్శమని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధితోపాటు పేదల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం రేవంత్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కడుపు మంటగా ఉందన్నారు.

వర్షాలతో కామారెడ్డిలో నష్టం 275.83కోట్లు

» కేంద్ర బృందానికి నివేదించిన జిల్లా అధికార యంత్రాంగం

కామారెడ్డి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో కామారెడ్డి జిల్లాలో రూ.275.83కోట్ల మేర నష్టం వాటిల్లిందని జిల్లా అధికార యంత్రాంగం కేంద్ర బృందానికి నివేదించింది. ఇందులో రోడ్లు, వంతెనల తక్షణ మరమ్మతుల కోసం రూ.38.68 కోట్లు, పూర్తిస్థాయి పనులకు రూ.212.68కోట్లు, పంట నష్టపరిహారం కింద రూ.24.47కోట్లు అవసరం అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 8న కేంద్రానికి చెందిన నలుగురు ఉన్నతాధికారుల బృందం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. వరదల వల్ల దెబ్బతిన్న రహదారులను, బ్రిడ్జిలను, ప్రాజెక్టులను, చెరువులను, పంటలను కేంద్ర అధికారులు పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం జిల్లా అధికారులు నష్టంపై నివేదిక అందజేశారు.

4వేల మంది గురుకుల ఉద్యోగుల సేవల పునరుద్ధరణ

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల సేవల కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గురుకుల విద్యావ్యవస్థ పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొత్తం 4,092 మంది ఉద్యోగుల సేవలు పునరుద్ధరించడంతో వేల కుటుంబాలకు ఊరటనిస్తుందన్నారు.

ఎస్సారెస్పీ ఫేజ్-2కు దామోదర్‌రెడ్డి పేరు

» 24 గంటల్లో జీవో విడుదల చేస్తాం
» ఆర్డీఆర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి ఇదే
» ఆయన కుటుంబానికి అండగా పార్టీ
» సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి



దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్

మోత్కూరు/తుంగతుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ఫేజ్-2కు దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి (ఆర్డీఆర్) పేరు పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇదే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఆదివారం దామోదర్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగిన సంతాపసభకు సీఎం రేవంత్ హాజరై మాట్లాడారు. తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలు నీటి సౌకర్యం లేక ఎడారిగా మారే ప్రమాదం ఉందని, ప్రజలకు నివాస యోగ్యం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ఇచ్చిందని, దీంతో దామోదర్‌రెడ్డి ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకు వచ్చి సస్యశ్యామలం చేయాలన్న ఆలోచన చేశారని తెలిపారు. ఫ్లోరైడ్ భూతాన్ని తరమడంలో దామోదర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, శ్రీరాంసాగర్ జలాలను కరీంనగర్, వరంగల్‌తో పాటు నల్లగొండ (ప్రస్తుత సూర్యాపేట) జిల్లాకు ఇవ్వాలంటూ పోరాడారని గుర్తు చేశారు. నల్లగొండలో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయంటే అది దామన్న వల్లేనన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు దామోదర్‌రెడ్డి నాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ ఫేజ్-2కు శంకుస్థాపన చేయించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆయన క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న దామోదర్‌రెడ్డి వైఎస్సార్‌పై ఒత్తిడి తెచ్చి.. కాల్వల నిర్మాణం పూర్తిచేయించారని పేర్కొన్నారు. గోదావరి జలాల కోసం ఇంతగా పోరాడిన దామోదర్‌రెడ్డి పేరును ఆ ప్రాజెక్టుకు పెడుతూ 'ఆర్డీఆర్ ఎస్సారెస్పీ ఫేజ్-2'గా నామకరణం చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఇందుకు సంబంధించి 24 గంటల్లో జీవో విడుదల చేస్తామన్నారు. దామోదర్‌రెడ్డి కుటుంబానికి 'గాంధీ' కుటుంబం అండగా ఉంటుందని, ఆర్డీఆర్ మృతి పట్ల సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే ఈ విషయం చెప్పారని తెలిపారు. దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డికి రాజకీయంగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అది మా కుటుంబ సమస్య

చిన్న చిన్న పంచాయితీలుంటాయి.. మంత్రులు సీతక్క, సురేఖ నాతో మాట్లాడారు

» సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా
» 'పొంగులేటి' వివాదంపై టీపీసీసీ చీఫ్
» బీసీ రిజర్వేషన్లపై మాకు చిత్తశుద్ధి ఉంది
» అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నాం
» బీసీల నోటికాడి కూడును తన్నుతున్న బీజేపీ, బీఆర్ఎస్: మహేశ్‌గౌడ్



హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క మధ్య వివాదం తమ కుటుంబ సమస్య అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కుటుంబం అన్నప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య చిన్న చిన్న పంచాయితీలు ఉంటాయని, ఈ విషయంపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క తనతో మాట్లాడారని చెప్పారు. అయితే వారు ఫిర్యాదు చేసినట్లుగా కాకుండా.. అక్కడున్న సమాచారాన్ని మాత్రమే ఇచ్చారని తెలిపారు. దీనిపై తాను, సీఎం రేవంత్‌రెడ్డి కూర్చుని మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఉంటుందని, అధిష్ఠానానికి ఎవరైనా లేఖలు రాసే స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. సామాన్యుడి దగ్గర్నుంచి మంత్రుల వరకు ఎవరైనా వెళ్లి అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. ఇక స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని పీసీసీ చీఫ్ అన్నారు. అందుకే జీవో 9పై హైకోర్టు ఇచ్చిన స్టే మీద సుప్రీంకోర్టు తలుపు తడుతున్నామని చెప్పారు. ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలకు భయపడేది లేదని, బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నా.. నిర్వహించడం లేదని, బీసీలకు 42 శాతం రిజర్వేషనే తమకు ప్రాధాన్య అంశమని వెల్లడించారు. ఏడాది కిందట జరగాల్సిన ఎన్నికలను.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకే ఆపామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్.. బీసీ వ్యతిరేక పార్టీలు అని, బీసీల నోటికాడికి వచ్చిన కూడును కాలదన్నుతున్నాయని ఆరోపించారు.

అడుగడుగునా అడ్డుకుంటున్న బీజేపీ..

బీసీ బిల్లులను బీజేపీ అడుగడుగునా అడ్డుకుంటోందని మహేశ్‌గౌడ్ అన్నారు. ఆ బిల్లులు రాష్ట్రపతి, గవర్నర్ వద్ద ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో బీజేపీకి చెందిన బీసీ ఎంపీలు ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ ఏనాడైనా అడిగారా? అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీసీ సంఘాల జేఏసీ నిర్వహించనున్న బంద్‌లో తాము కూడా పాల్గొంటామన్నారు. హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి కులవివక్ష కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారంటే.. సమాజం ఎటుపోతుందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ఐపీఎస్ కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. ఇక సమాచార హక్కు(ఆర్టీఐ) సహా.. యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన అనేక చారిత్రక చట్టాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. ఆర్టీఐ చట్టానికి 2019లో సవరణలు చేసిన బీజేపీ.. కమిషనర్ల స్వతంత్రతను బలహీనపరిచిందన్నారు. బీజేపీ ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వివేక్ వర్సస్ అడ్లూరి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడుతున్నామని, తాను ఇన్‌చార్జి అయ్యాక అక్కడ కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని వ్యాఖ్యానించారు. కాగా, మంత్రి వివేక్ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెంటనే స్పందించారు. ముగిసిన వివాదాన్ని వివేక్ మళ్లీ తెరపైకి తెచ్చారని, ఈ అంశాన్ని ఇక అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాలలను గౌరవించిందెవరో అందరికీ తెలుసునని, ఎవరు ఎవరిని అవమానిస్తున్నారో చర్చకు సిద్ధమని చెప్పారు. మంత్రి వివేక్ కుమారుడిని ఎంపీగా గెలిపించింది తాము కాదా? అని ప్రశ్నించారు. గతంలో వివేక్ తండ్రి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ ఇచ్చారనడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. "ఏదైనా మన పార్టీ నేతల సమక్షంలో అంతర్గతంగా మాట్లాడితే బాగుండేది" అని వ్యాఖ్యానించారు.

నేను ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదు: సీతక్క



మేడారం ఆలయ అభివృద్ధి పనుల విషయంలో టీపీసీసీ అధ్యక్షుడికి తాను ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని మంత్రి సీతక్క ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి విషయంలో 'ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు' అంటూ మీడియాలో వచ్చిన వార్తలను ఆయన దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. వీలైనంత త్వరగా ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడేలా చూడాలని కోరానన్నారు. ఆలయ అభివృద్ధి పనుల విషయంలో చిన్న వివాదం కూడా ఉండొద్దన్న ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా తన అభిప్రాయాన్ని చెప్పానన్నారు. సున్నితమైన అంశమైనందున.. వీలైనంత త్వరగా అపార్థాలు తొలగిపోయి, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకుసాగేలా చూడాలని కోరినట్లు సీతక్క వెల్లడించారు.

అధిష్ఠానం మందలించిందనడం అవాస్తవం: కొండా సురేఖ



కాంగ్రెస్ అధిష్ఠానం తనను మందలించిందనడం అవాస్తవమని మంత్రి కొండా సురేఖ తెలిపారు. హైకమాండ్ తనకు క్లాస్ తీసుకున్నట్లుగా కొన్ని మీడియా చానళ్లలో ప్రచారం జరుగుతోందని, జరగని విషయాలు జరిగినట్లుగా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను పార్టీ లైన్ దాటనని, తనను ఎవరూ ఏమీ అనలేదని చెప్పారు. గత రెండు రోజులుగా తాను తన ఇంట్లోనే ఉన్నానని, ఎక్కడికీ వెళ్లలేదని స్పష్టం చేశారు. ఆదివారం తనను కలిసిన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

గెలుపు, ఓటములు నన్ను ప్రభావితం చేయలేవు

» నా రాజకీయ ప్రయాణం కష్టాలతో కూడుకున్నది
» రాత్రిళ్లు జెండాలు కట్టి.. పగటిపూట ధర్నాలు చేసి ఎదిగిన చరిత్ర నాది
» గెలిస్తే తోపు అనుకోను.. ఓడితే ఇంట్లో పడుకోను
» కులం పేరు చెప్పుకొని రాలేదు.. జనం మధ్య నుంచే వచ్చాను
» మళ్లీ రాష్ట్రంలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమే
» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సదాశివపేటలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, పక్కన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

సదాశివపేట, అక్టోబరు 12, ఆంధ్రజ్యోతి: గెలుపు, ఓటములు తనను ప్రభావితం చేయలేవని, తన రాజకీయ ప్రయాణం కష్టాలతో కూడుకున్నదంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాత్రిళ్లు జెండాలు కట్టి పగటిపూట ధర్నాలు చేసి ఎదిగిన చరిత్ర తనదని స్పష్టం చేశారు. సంగారెడ్డి నియోజకవర్గం సదాశివపేటలో కందకం రోడ్డు ప్రగతి పనులపై తన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలతో కలిసి జగ్గారెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి కులం పేరు చెప్పుకొని రాలేదని, ప్రజా సమస్యలపై పోరాటం చేసి లీడర్ అయ్యానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని, ఆ పార్టీలో వాళ్లలోవాళ్లే కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులపై తాను చేసే సమీక్షలకు వచ్చే అధికారులు భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. పనుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తన మాట కాదనరని జగ్గారెడ్డి చెప్పారు. తాను చేసే పనికి ఓట్లకు సంబంధం ఉండదని, మనం అంతటి బలహీనులం కాదని జగ్గారెడ్డి ప్రస్తావించారు.

పాఠాలు ఆపి.. బడుల తనిఖీకి

(మొదటి పేజీ తరువాయి)

సంచాలకులు నవీన్ నికోలస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసేందుకు పదేళ్లకు పైబడి సీనియారిటీ ఉన్న ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేయాలని డీఈవోలను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి తనిఖీ కమిటీల ఏర్పాటుకు మార్గదర్శకాలను ఆయన విడుదల చేశారు. కనీసం పదేళ్ల అనుభవం కలిగిన ఎస్జీటీలు, 7 సబ్జెక్టుల టీచర్లు, గెజిటెడ్ హెచ్‌ఎంలను ఈ కమిటీల్లో నియమించనున్నారు. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16,474 ప్రాథమిక పాఠశాలలకు 504 ఉపాధ్యాయులతో కూడిన 168 తనిఖీ బృందాలు ఏర్పాటు కానున్నాయి. 3,100 మాధ్యమిక పాఠశాలల తనిఖీకి 105 ఉపాధ్యాయులతో 35 బృందాలు, 4,672 ఉన్నత పాఠశాలల తనిఖీలకు 864 మంది ఉపాధ్యాయులతో 96 బృందాలు ఏర్పాటవుతాయి. ఆయా కమిటీలు 3 నెలల్లో 100 ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు, 50 ఉన్నత పాఠశాలల చొప్పున తనిఖీ చేయాల్సి ఉంటుంది. తనిఖీ కమిటీలకు ఎంపికైన వారు ఇక నుంచి బడులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. వీరంతా డీఈవో, ఎంఈవోల పర్యవేక్షణలో పనిచేస్తారు. కాగా, స్కూళ్ల తనిఖీ విధానంపై ఉపాధ్యాయ సంఘాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని.. ఈ పరిస్థితుల్లో టీచర్లను బోధనకు దూరం చేస్తే ప్రమాణాలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నాణ్యమైన వైద్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చవుతుందనో కాకుండా.. కాస్త ఎక్కువ ఖర్చయినా సరే నాణ్యత ధ్రువీకరణ పొందిన వైద్యసేవలు కావాలని ప్రజలు కోరుతున్నారని తేల్చింది. కరోనా తర్వాతి నుంచి ఈ పరిస్థితి పెరుగుతూ వస్తోందని పేర్కొంది. దేశంలో నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హస్పిటల్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య పదిశాతంలోపే ఉందని నివేదిక వెల్లడించింది. ఇక నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ (నాబా) గుర్తింపు పొందిన ప్రైవేటు డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు రెండులోపేనని తెలిపింది. దేశంలో పెద్ద పట్టణాల్లోని కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు రోగులకు సంబంధించిన వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డు(ఈఎంఆర్) రూపంలో భద్రపరుస్తున్నాయని వెల్లడించింది. అదే సమయంలో చిన్న పట్టణా లు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రులు ఇంకా పేపర్ రికార్డులపైనే ఆధారపడుతున్నాయని వివరించింది.

సర్వేలో తేలిన అంశాలివీ..

- వైద్యసేవలకు సంబంధించి నిర్దిష్టమైన, అందరికీ అందుబాటులో ఉండే సమాచారం కావాలన్నవారు.. 83 శాతం
- నాణ్యత ధ్రువీకరణ ఉన్న వైద్యసేవల కోసం ఎక్కువ సొమ్ము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నవారు.. 90శాతం
- 2024 నాటికి దేశంలో ప్రతి వెయ్యి మంది జనాభాకు అందుబాటులో ఉన్న బెడ్లు.. 1.3.
- వైద్యం కోసం ప్రజలు స్వయంగా భరించే వ్యయం.. 2005లో రూ.853.. 2024లో రూ.2,600.
- దేశంలో ప్రతి లక్ష జనాభాకు ఉన్న ఎంబీబీఎస్ సీట్లు.. 2005లో 1.7.. 2024లో 8.3
- ప్రైవేట్ ఆస్పత్రులలో ఒక పడకకు రోజువారీ సగటు ఆదాయం రూ.30,000-రూ.40,000. మెట్రో నగరాల్లో రూ.70,000 వరకు..

దేశంలో 40 ఏళ్లు దాటినవారిలో..

- ఊబకాయంతో బాధపడుతున్నవారు 56శాతం
- అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారు 50%
- ప్రీడయాబెటిక్ స్థితిలో ఉన్నవారు.. 11 శాతం
- మానసికఒత్తిళ్లతో బాధపడుతున్నవారు.. 18%

మధ్యాదాయ, అధిక ఆదాయం ఉన్న 40 ఏళ్లపైబడినవారిలో..

- ఊబకాయంతో బాధపడుతున్నవారు 67శాతం
- అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారు 50%
- ప్రీడయాబెటిక్ స్థితిలో ఉన్నవారు 33శాతం
- మానసికఒత్తిళ్లతో బాధపడుతున్నవారు 33%
- గుండె దెబ్బతిన్న రోగుల్లో ఏడాదిలోనే చనిపోతున్నవారు.. భారత్‌లో 23శాతం.. చైనాలో 9 శాతం
- తీవ్రమైన కిడ్నీ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తున్నది.. భారత్‌లో 52%.. డెన్మార్క్‌లో 80%

'కపాస్ కిసాన్'తో రైతులకు ఇబ్బంది కలగొద్దు

» ప్రతీ కొనుగోలు కేంద్రంలో ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ని పెట్టండి
» అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం
» టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సూచన



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనం ఫొటో ఫ్రేమ్‌ను మంత్రికి అందజేస్తున్న పామాయిల్ రైతులు

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఇటీవల ప్రారంభించిన 'కపాస్ కిసాన్ యాప్'తో రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. పత్తి రైతులు తమ వివరాలను కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో.. రైతులకు సాయం చేసేందుకు ప్రతీ కొనుగోలు కేంద్రంలో ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి తుమ్మల.. కపాస్ కిసాన్ యాప్ అంశంలో కీలక సూచనలు చేశారు. మొబైల్ నెంబర్లు మార్చిన రైతులకు యాప్‌లో లాగిన్ అవ్వడానికి ఎదురయ్యే ఇబ్బందులపై దృష్టి పెట్టాలని తుమ్మల ఈ సందర్భంగా సూచించారు. అయితే, ఆధార్ నెంబరు, ఓటీపీ ద్వారా యాప్‌లో లాగిన్ అయ్యే అవకాశం కల్పించాలని, డేటాబేస్‌లో లేని రైతులకు కొత్తగా రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని సీసీఐ అధికారులను ఇప్పటికే కోరామని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మంత్రికి తెలియజేశారు. అలాగే, కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్, కౌలు రైతుల నమోదు ప్రక్రియపై వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ ఇచ్చామని అధికారులు తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు- 1800 599 5779 ఏర్పాటు చేసి ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. అయితే, కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు వారికి అవసరమైన సాయం అందించేందుకు ప్రతీ కొనుగోలు కేంద్రంలో ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్ నియమించాలని అధికారులను మంత్రి తుమ్మల ఈ సందర్భంగా ఆదేశించారు. అలాగే, ఈ నెల పదో తేదీతో ముగిసిన సీసీఐ జాబ్ వర్క్ టెండర్లలో 328 జిన్నింగ్ మిల్లులు పాల్గొన్నాయని, టెక్నికల్ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందని మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తిచేసి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని, కనీస మద్దతు ధరకు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

ఆయిల్‌పామ్ ఓఈఆర్‌లో ప్రపంచంతో తెలంగాణ పోటీ

అశ్వారావుపేట: ఆయిల్‌పామ్ ఓఈఆర్(ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియా)లో మలేషియా అగ్రస్థానంలో ఉండగా మరో 20 రోజుల్లో ఆ ఓఈఆర్‌ను అధిగమించి తెలంగాణ ఆయిల్‌పామ్ ప్రపంచంతోనే పోటీ పడబోతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ట్రంప్ దెబ్బకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుందని, ఆయిల్‌పామ్‌లో దిగుమతులను తగ్గించుకొని స్వయం సమృద్ధి సాధిస్తే అలాంటి సంక్షోభాలను భారతదేశం అలవోకగా అధిగమించవచ్చునని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ తొలిసారి 300మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించిన సందర్భంగా ఆయిల్‌ఫెడ్ అధికారులు, సిబ్బందిని పామాయిల్ రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని పెంచడం ద్వారా రైతులకు లబ్ధి జరిగి స్వదేశీ నూనె ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధ్యమన్నారు. ఆయిల్ పామ్‌కు టన్నుకి రూ.25వేల కనీస ధరను ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. కేంద్రం పత్తికి బదులుగా పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని పెంచితే రైతులకు, దేశానికి మేలు అన్నారు. దేశ మొత్తమ్మీద అత్యధిక ఓఈఆర్ సాధించడంతో పాటు 300 టన్నుల లక్ష్యాన్ని అధిగమించడంలో ఆయిల్‌ఫెడ్ అధికారుల కృషి అభినందనీయమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించిన ఆయిల్‌ఫెడ్ అధికారులు, అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమ ఉద్యోగులను మంత్రి తుమ్మల సత్కరించారు.



మండవ వెంకట్రామయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విలువలు పాటించిన గొప్ప వ్యక్తి మండవ వెంకట్రామయ్య

- నూజివీడు సీడ్స్ స్థాపనతో వ్యవసాయ రంగానికి మేలు
- సంస్మరణ సభలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారంలో మంచి విలువలు పాటించిన వ్యక్తి నూజివీడు సీడ్స్ వ్యవస్థాపకులు దివంగత మండవ వెంకట్రామయ్య అని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రధాన్ కన్వెన్షన్ లో ఆదివారం మండవ వెంకట్రామయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామయ్యతో తన అనుబంధాన్ని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. స్వయంకృషితో గొప్ప వ్యాపార సంస్థను ప్రారంభించి, నిలబెట్టి వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేశారన్నారు. నిత్య జీవితంలో విలువలకు కట్టుబడి ఉండే వెంకట్రామయ్య వ్యాపారంలోనూ విలువలు పాటించారన్నారు. పెద్ద పరిశ్రమను స్థాపించానన్న గర్వం ఏ మాత్రం లేకుండా ఎంతో మంది యువతకు అండగా నిలిచి, వారు జీవితాల్లో నిలదొక్కుకోవడానికి సాయం చేశారన్నారు. ఆయన సంతానాన్ని గొప్ప విలువలతో పెంచారని, వారు వారసత్వాన్ని చక్కగా కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. వెంకట్రామయ్య చూపించిన బాటలోనే మండవ ప్రభాకర్‌రావు, ఆషా ముందుకెళ్లడం సంతోషదాయకమన్నారు. సంస్మరణ సభలో మండవ వెంకట్రామయ్య చిత్రపటానికి ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తాం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తామని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ అంశంపై హైకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి పెట్టిందే కాంగ్రెస్ హయాంలో అని తెలిపారు. సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా ఎవరూ ఏమీ చేయలేరని మహారాష్ట్రలో తమ ప్రభుత్వమే ఉన్నా ఏమీ చేయలేకపోయామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

పనికిరాని పార్టీ బీఆర్ఎస్: మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఏమాత్రం పనికిరాని పార్టీ బీఆర్ఎస్ అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని, పార్లమెంటు ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి, కుంభకోణాల్లో బీఆర్ఎస్ నాయకులు కూరుకుపోయారని ఆరోపించారు. ఏ కేసులో ఎవరు ఎప్పుడు అరెస్టు అవుతారో తెలియని పరిస్థితి ఆ పార్టీలో నెలకొని ఉందన్నారు. బీజేపీ పూజకు పనికిరాని పువ్వులాంటిదంటూ కేటీఆర్ చేసిన విమర్శలు హాస్యాస్పదమని, బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు.

గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

- మధ్యప్రదేశ్ సీఎస్ అనురాగ్ జైన్

భోపాల్, అక్టోబర్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పర్యాటకం, వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మధ్యప్రదేశ్ సీఎస్ అనురాగ్ జైన్ తెలిపారు. భోపాల్‌లో జరుగుతున్న మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్-2025లో భాగంగా బిజినెస్-టు-బిజినెస్ ఈవెంట్, "విలేజ్ వైబ్స్" ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు, వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడానికి ట్రావెల్ మార్ట్ ఎంతో ఉపయోగపడుతున్నాదన్నారు. మహిళల కోసం సురక్షిత పర్యాటక స్థలాల ప్రాజెక్ట్ కింద శిక్షణ పొందిన యువతులతో ఆయన సంభాషించారు. ప్రముఖ నటుడు రఘువీర్ యాదవ్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ, టూరిజం, సంస్కృతి శాఖ శివ శేఖర్ శుక్లా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎం చెబితే చేయాలంతే!

'కాదు' అన్నందుకే నాడు ఎల్వీపై జగన్ వేటు.. చెప్పింది చేయకుంటే ఇక నేనెందుకని జగన్ అన్నారు

ఆర్‌కేతో 'బిగ్ డిబేట్'లో రిటైర్డ్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"ముఖ్యమంత్రే సర్వాధికారి.. ఆయన చెప్పినట్లు అధికారులు పని చేయాల్సిందే! అలా చేయనందుకే నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎల్వీ సుబ్రమణ్యంపై జగన్ వేటు వేశారు" అని స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ స్పష్టంచేశారు. సచివాలయంలో అన్ని ఫైళ్లకూ సీఎం ఆమోదం కచ్చితంగా ఉండాలన్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంను నాడు సీఎంగా ఉన్న జగన్ ఎందుకు సాగనంపారనే రహస్యాన్ని బయటపెట్టారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ ఆదివారం నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో ప్రవీణ్ ప్రకాశ్ పాలుపంచుకున్నారు. 'బిగ్ డిబేట్' కీలకాంశాలివీ..



అన్ని హద్దులూ క్రాస్ చేసేశారన్నది మీ మీద నింద!

అవును సర్.. ఈ రోజు మీ దగ్గరకు రావడానికి కారణం ఏమిటంటే.. నాకు ఆంధ్రప్రదేశ్ మీద కమిట్‌మెంట్ ఉంది. నా లైఫ్‌లో 2.0 స్టార్ట్ అయింది. మళ్లీ ఏపీ వైపు అడుగు వేయాలని భావిస్తున్నా. కాబట్టి ఏపీతో మాట్లాడాలి. అది మీ ద్వారా ప్రతి ప్రశ్నకు జవాబు చెప్పాలనుకుంటున్నాను.

జగన్ దగ్గర పని చేసినప్పుడు ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేయించారు? ఎలా వేయిస్తారు..?

నేను కేవలం ఉద్యోగిని. ఎంప్లాయ్‌గా కొన్ని లిమిట్స్ ఉంటాయి. రాజకీయ పార్టీలో ఒక వ్యక్తి చెప్పిన తర్వాత.. నేనెలా ఆపగలను? ప్రభుత్వంలో క్యాబినెట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా పని చేస్తుంది. మేం పొలిటికల్ సిస్టమ్ మేరకు చెక్స్ అండ్ బ్యాలెన్స్ చేసుకోవాలి.

మీకే ఎందుకీ సమస్య వచ్చింది?

నేను వీఆర్ఎస్ ఇవ్వడానికి 2024లో 50 శాతం మాత్రమే నిర్ణయం తీసుకున్నాను. 2021లోనే మొదటి 50% నిర్ణయం తీసుకున్నాను. ఎందుకంటే కేంద్రంలో నాకు ప్రమోషన్ రాలేదు. ఇప్పటి వరకూ ఎవరి వద్దా ఒక్క రూపాయి తీసుకోలేదు. చంద్రబాబును గానీ, జగన్‌ను గానీ ఎవరినీ ప్లీజ్ చేయడానికి కూడా ప్రయత్నం చేయలేదు. అవసరమైతే పాలీగ్రాఫ్ పరీక్షకైనా సిద్ధం. కేంద్రానికి వెళ్లే విషయమై సీనియర్లతో సంప్రదించేవాడిని. అప్పుడు వారు.. ఐఏఎస్‌లో ఒక సిస్టమ్ ఉంది. నువ్వు సీనియర్స్‌తో మిస్‌బిహేవ్ చేస్తావా..? ఎల్వీ ప్రీతి సుడాన్, పీవీ రమేశ్‌తో మిస్‌బిహేవ్ చేస్తే నిన్ను సెంట్రల్‌లో ఎంప్యానెల్ ఎలా చేస్తాం? నువ్వు ఆంధ్రా భవన్‌లో కూర్చుని వ్యతిరేక ప్రచారం (బ్లాక్ బ్యాడ్జ్) వేస్తావా? నీకసలు కామన్ సెన్స్ ఉందా.. అని గట్టిగా చెప్పారు.

ఎల్వీ సుబ్రహ్మణ్యంతో ఏమిటి సమస్య..?

2019 అక్టోబరులో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రెండు ముఖ్యమైన పథకాల గురించి.. నాడు-నేడు, ఆర్బీకేల (రైతు భరోసా కేంద్రాలు) విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నారు. నాడు-నేడు ప్రోగ్రాంలో భాగంగా పాత స్కూల్స్ చాలా అభివృద్ధి చేయాలని చెప్పారు. నాడు-నేడుకు సంబంధించి టెక్నికల్ నాలెడ్జ్ ఉన్న వ్యక్తి కావాలని, తెలంగాణలో రిటైరైన ఐఏఎస్ మురళిని తనకివ్వాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అడిగారు. సీఎం వెంటనే ఆయన్ను ఏపీకి తెప్పించాలన్నారు. తర్వాత రెండ్రోజులకు ఆర్బీకేపై సమీక్ష చేశారు. అప్పుడు పూనం మాలకొండయ్య అగ్రికల్చర్‌కు ఇన్‌చార్జి స్పెషల్ సీఎస్‌గా ఉన్నారు. ఆర్బీకేల్లో అన్నీ ఉండాలి, ఫెర్టిలైజర్స్ నాణ్యమైనవి అందుబాటులో ఉంచాలని సీఎం స్పష్టంగా చెప్పారు. ఆమె వెంటనే.. 'సర్ నేను అగ్రికల్చర్ శాఖకు ఇన్‌చార్జిని మాత్రమే.. ఫుల్ చార్జ్ ఉంటే బాగా చేస్తాను' అని చెప్పారు. వెంటనే సీఎం ఆమోదించి, ఫైల్ మీద సంతకం చేసి సీఎస్‌కు పంపించారు. తర్వాతి వారం కూడా ఈ రెండు ప్రోగ్రామ్స్‌పై సీఎం సమీక్ష చేపట్టగా.. 'మీరు అంతా స్పీడ్‌గా చేయమంటారు.. మీ దగ్గరే అంతా స్లోగా ఉంది. చిన్న పోస్టింగ్ ఇవ్వడానికి కూడా ఆలస్యమవుతోంది' అని రాజశేఖర్ అన్నారు. ముఖ్యమంత్రి వెంటనే నన్ను పిలిచి.. వెంటనే వెళ్లి సీఎస్(ఎల్వీ)ను అడగండని చెప్పారు. నేను సీఎస్ దగ్గరకు వెళ్లాను. సీఎం దగ్గర నుంచి మీకు రెండు నోట్లు వచ్చాయని.. వెంటనే వాటిని పంపించాలని చెప్పాను. కానీ ఎల్వీ చేయనని స్పష్టంగా చెప్పేశారు. రెండు వారాల తర్వాత మళ్లీ ఈ రెండు ప్రోగ్రామ్స్‌పై జగన్ వద్ద సమీక్ష జరిగింది. రెండు ట్రాన్స్‌ఫర్లు కూడా చేయలేకపోతున్నారు.. ఏమైందని ఆయన అడిగారు. నేను ఫైల్ సీఎస్ దగ్గర ఉందని చెప్పాను. ఆ విషయం నాతో చెప్పాలి కదా అని అన్నారు. 'ఇది కూడా జరగక్కపోతే ఇంకెందుకు? నాకు సీఎం పోస్టు అవసరం లేదు. నేను వెళ్లిపోతాను. నేను దీని కోసమే వచ్చానా..? ఇది జరక్కపోతే వెళ్లిపోతాను' అంటూ కొంచెం ఎమోషనల్ అయ్యారు. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నేను ఆ హోదాలో జీవో జారీ చేశాను. ఆ ఆర్డర్లు ఇచ్చిన తర్వాత సీఎం వద్దకు ఎల్వీ రాలేదు.

ఎల్వీని బదిలీ చేయాలని ఎవరు చెప్పారు?

క్యాబినెట్ భేటీకి ముందు సీఎంకు బ్రీఫింగ్ ఉంటుంది. సీఎం, సీఎస్ చర్చించిన తర్వాత ఎజెండా నిర్ణయిస్తారు. విలేజ్ కోర్టుల గురించి సవివర ప్రజెంటేషన్ ఇవ్వాలని.. ఆ తర్వాత క్యాబినెట్‌లో పెడదామని సీఎం అన్నారు. లా సెక్రటరీ వేరే పని ఉండడంతో వెళ్లిపోయారు. తర్వాతి రోజు వచ్చారు. సీఎం గారికి ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. నేను అనుమతివ్వలేదు. ఆయన వెంటనే సీఎస్(ఎల్వీ) వద్దకు వెళ్లారు. ఆయన్ను సీఎం వద్దకు తీసుకెళ్లాలని సీఎస్ నాతో చెప్పారు. నేను ఇప్పుడు వద్దన్నాను. సీఎం కంఫర్ట్‌బుల్‌గా లేరని స్పష్టంగా చెప్పాను. ఇదే అసలు సమస్యగా మారింది. ఆయన్ను ఎందుకు ఆపారంటూ సీఎస్ నాకు మెమో జారీ చేశారు. ఈ విషయం నేను ఎవరికీ చెప్పలేదు. ఆ తర్వాత 'వెంటనే ఏపీలో ఎవరెవరు సీనియర్లు ఉన్నారో లిస్ట్ చెప్పు.. సీఎంకు సీఎస్, సీఎంవో రెండు కళ్లు. ఈ రెండింటి మధ్య సమన్వయం ఉండాలి. నీకు ఎవరితో కంఫర్ట్‌గా ఉంటుందో చెప్పు' అని జగన్ అన్నారు. నేను వెంటనే నీలం సాహ్ని అయితే బాగుంటుందని చెప్పాను. ఇద్దరం జగన్ వద్దకు వెళ్లాం.. ఆ రోజు ఆయన రెండు ఫైల్స్‌పై ఆయన సంతకం చేశారు. నీలం మేడంను ఏపీకి తీసుకురావడంతో పాటు ఎల్వీ సర్‌ను బాపట్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ జీవో జారీ చేశారు.

మరి తర్వాత మిమ్మల్ని ఎందుకు పంపించేశారు?

ఇది జరిగిన రెండున్నరేళ్ల తర్వాత సీఎం వద్దకు వెళ్లాను. 26 నుంచి 28 నెలల తర్వాత ఆఫీసర్‌కు ఎఫిషియన్సీ తగ్గుతుంది.. మూడేళ్లపాటు సీఎంవోలో పని చేశాను.. ఏ పోస్టులో కూడా ఇంత కాలం చేయలేదని చెప్పాను. మీ సొంత స్టేట్‌లో చాలా మంది ఐఏఎస్‌లు చాలా కాలం నుంచి ఒకే పోస్టులో పని చేస్తున్నారు.. ఢిల్లీలో కూడా ఐఏఎస్‌లు ఒకే పోస్టులో చాలా కాలం నుంచి కొనసాగుతున్నారని ఆయన అన్నారు. మిగిలిన ఆఫీసర్ల వైపు చూస్తూ.. ప్రవీణ్ ఏం మాట్లాడతారో.. ఏ థియరీ మాట్లాడతారో ఆయనకే తెలియదని నవ్వుతూ చెప్పారు. మీరు అనుమతిస్తే ఢిల్లీ వెళ్లిపోతానని అన్నాను. ఆయన నీ ఇష్టమనేసి వెళ్లిపోయారు.

జగన్ ముందు మోకాళ్లపై ఎందుకు కూర్చున్నారు?

గణతంత్ర దినోత్సవం రోజు కొత్త జిల్లాలు ప్రకటిస్తున్నారు. ఆ ఉదయం హడావుడిలో నేను వ్యాయామం చేసి రాలేదు. సీఎం చేరువకు వెళ్లి మాట్లాడితే నోటి దుర్వాసన వస్తుందనే భావనతో కొంత దూరంగా మోకాళ్లపై కూర్చోని మాట్లాడాను. అంతే.

ప్రజల సొమ్ము వృథా చేస్తే.. నేనైతే ప్రాసిక్యూషన్ చేసేవాడిని.

సర్.. ఒక ప్రశ్న అడుగుతా. కొంత మంది ఒక ప్రోగ్రాం చేయాలంటే పెద్ద మీటింగ్‌లు పెడతారు. ప్రభుత్వంలో కొన్ని మీటింగ్స్‌లో పెద్ద స్టేజ్.. భారీగా చేయాలనుకుంటున్నారు. ఇది డబ్బు వృథా కాదా..?

వంద శాతం కరెక్టు. కానీ రంగుల విషయంలో నేషనల్ బిల్డింగ్స్ కోడ్ ఉంది కదా!

సీఎం ఎలా చెబితే అలా చేయాల్సిందే. పార్లమెంటరీ వ్యవస్థలో ముఖ్యమంత్రి అసెంబ్లీకి వెళ్లి, కొన్ని చట్టాలు చేస్తారు. ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలో కూడా ముఖ్యమంత్రి హెడ్. సచివాలయంలోని అన్ని ఫైల్స్‌కు సీఎం ఆమోదం కచ్చితంగా ఉండాలి. అన్ని ఫైల్స్ ఆయనే ఆమోదిస్తారు.

మళ్లీ సర్వీస్‌లోకి రావాలనే ఆలోచన ఉందా?

నేను కోపంలో చేశాను. 3 నెలల్లో వీఆర్ఎస్ వెనక్కి తీసుకుంటానని అడిగాను. నీరబ్‌కుమార్(అప్పటి సీఎస్) మాకు బంధువే. మళ్లీ సర్వీస్‌లోకి వస్తానని చెబితే.. సీఎం చంద్రబాబు మీమీద చాలా కోపంగా ఉన్నారని చెప్పారు. తనపై ఒత్తిడి తెస్తే సస్పెండ్ చేస్తానని సీఎం అన్నట్లు కొంత మంది నాతో అన్నారు. నేను ప్రతి రోజూ పేషీకి ఫోన్ చేసేవాడిని. అపాయింట్‌మెంట్‌ఇప్పించాలని అడిగేవాడిని. గతంలో చంద్రబాబు, నేను దగ్గరగా ఉండేవాళ్లం..! 2019లో నన్ను సీఎం పేషీలోకి కూడా తీసుకుంటామన్నారు.

'పునర్విభజన'తో దేశ సమగ్రతకు ముప్పు

- బాలగోపాల్ 16వ సంస్మరణ సభలో భారత జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో హిందీయేతర రాష్ట్రాల అస్తిత్వానికి, దేశ సమగ్రతకు ముప్పు అని భారత జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్ అన్నారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రఖ్యాత మానవహక్కుల నేత బాలగోపాల్ 16వ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బాలగోపాల్ రచించిన 'రాజ్యాంగాన్ని ఎలా చూడాలి?' అనే పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. అనంతరం 'ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థ - సవాళ్లు' అంశంపై యోగేంద్ర యాదవ్ మాట్లాడారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఓటర్ల జాబితా సవరణ.. అంశాలను కలిపి లోతుగా పరిశీలిస్తే దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ధ్వంసం చేయడానికి కేంద్రం అమలు చేస్తోన్న కుట్ర అర్థమవుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక వర్గాల ఓట్లను తొలగించేందుకే ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియను చేపడుతున్నారని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ బిహార్‌కే పరిమితం కాదని, ఆ ప్రక్రియను పౌర సమాజం ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఇక, 'బస్తర్ ఎవరిది? ఆదివాసుల భవిష్యత్తు ఏం కానుంది' అంశంపై ఉపన్యసించిన సామాజిక శాస్త్రవేత్త నందిని సుందర్.. బస్తర్ ముమ్మాటికి ఆదివాసీలదేనని అన్నారు. బస్తర్‌లోని రోడ్డు నిర్మాణపనుల్లో అవినీతిని వెలుగులోకి తెచ్చిన ముఖేష్ అనే జర్నలిస్టును చంపేశారని, ఇదేనా మోదీ ప్రభుత్వం ఆ ప్రాంతంలో నెలకొల్పబోయే శాంతి అని నిలదీశారు. అలాగే, 'కృత్రిమమేధ -గోప్యత' అంశంపై ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ నిర్వాహకుడు అపార్ గుప్తా మాట్లాడుతూ కృత్రిమ మేధతో సానుకూలతలతోపాటు సమస్యలు కూడా ఎక్కువేనని అన్నారు. కృత్రిమ మేధ సర్వరోగ నివారిణి అనే భ్రమ నుంచి బయటకు రావాలని సూచించారు. పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ సాగుదారులు మాత్రమే వ్యవసాయ భూమి కొనుగోలు చేసేలా చట్టం రూపొందించాలన్నారు. చర్చ చేపట్టకుండా ల్యాండ్ టైటిల్ గ్యారంటీ చట్టాన్ని కేంద్రం రాష్ట్రాలపై రుద్దడం అప్రజాస్వామికమని అన్నారు.

సమాజంలో పెరుగుతున్న అంతరాలు

- విచ్ఛిన్నమవుతున్న కుటుంబ బంధాలు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ ఆందోళన



మియాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అంతరాలు పెరిగిపోతున్నాయని, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల సంఖ్య పెరుగుతోందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చంద్ర రాజేశ్వర రావు (సీఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమం 26వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రరాజేశ్వరరావు, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటీవల మరణించిన మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ... అన్యాయాలను ఎదిరించే విషయంలో మౌనంగా ఉండకూడదనే ఉద్దేశంతోనే చంద్ర రాజేశ్వరరావులాంటి ఎంతో మంది మహనీయులు రచయితలుగా, గాయకులుగా, వివిధ రకాలుగా ప్రజలలో చైతన్యాన్ని నింపేందుకు కృషి చేశారన్నారు. సమాజానికి అనేక రకాలుగా సేవలందించిన వారు వృద్ధాశ్రమంలో ఉన్నారని, వారంతా నడిచేదేవుళ్లు అన్నారు. నిరసన కార్యక్రమాలు చేపట్టినందుకుగాను తన తండ్రి ప్రతి ఏటా కనీసం పది రోజులు జైలు జీవితం గడిపేవారని జస్టిస్ నగేష్ భీమపాక గుర్తు చేసుకున్నారు. పదెకరాల్లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి మరింత మందికి సేవలను అందించాలని, ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీనిచ్చారు. సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. చంద్ర రాజేశ్వరరావు జీవితం ఎంతో మందిని ప్రభావితం చేసిందన్నారు. ప్రతి సమస్యను సీఆర్ లోతుగా ఆలోచించి దాని పరిష్కారానికి కృషి చేశారన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.